
'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 241

మంగళవారం 22-11-2022



జగదీశన్ 277

వన్డేల్లో ప్రపంచ రికార్డు సృష్టించిన తమిళనాడు బ్యాటర్ - 12లో



ప్రతికూలతలు పడేశాయ్

సెన్సెక్స్ 519 పాయింట్లు పతనం.. నిఫ్టీకి నష్టం 148 పాయింట్లు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చంద్రుని చెంతకు ఓరియాన్

పలు అడ్డంకుల్ని, బాలారిష్టాల్ని దాటుకుంటూ నాసా ఇటీవల ప్రయోగించిన ఓరియాన్ స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడిని చేరింది.

వివరాలు 6లో



అత్యవసర ఔషధాల జాబితాలో..

హృద్రోగులకు అమర్చే కరోనరీ స్టెంట్లను అత్యవసర ఔషధాల జాతీయ జాబితాలో చేరుస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది.

వివరాలు 6లో



అరుణ్ గోయల్ బాధ్యతల స్వీకారం

కేంద్ర నూతన ఎన్నికల కమిషనర్ (ఈసీ)గా అరుణ్ గోయల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

వివరాలు 6లో



పాక్ ఆర్మీ చీఫ్‌కు వేల కోట్లు

పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ జావెద్ బజ్వా బాధ్యతలు చేపట్టాక రూ.1,270 కోట్లు వెనకేసుకున్నారని 'ది ఫ్యాక్ట్ ఫోకస్' వెల్లడించింది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

ప్రకృతి పత్తి భళా..



పంట ఏదైనా ప్రకృతి వ్యవసాయంలో పండించడం ఎంతో శ్రేయస్కరమని ఓ యువ రైతు అనుభవ పూర్వకంగా చెబుతున్నారు. రెండున్నర ఎకరాల్లో రసాయనిక సేద్య పద్ధతిలో గతేడాది మిర్చి సాగు చేసి నల్లతామర బారిన పడ్డారు. తర్వాత ప్రకృతి సాగుకు మారి మెరుగైన దిగుబడులు సాధించారు.

వివరాలు 11లో ▸

కొనసాగుతున్న వాయుగుండం



నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. ఇది గంటకు 25 కిలో మీటర్ల వేగంతో వాయవ్యదిశగా కదులుతోంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు వైపు పయనిస్తుందని ఐఎండీ వెల్లడించింది. దీని ప్రభావంతో రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమలో వర్షాలు పడనున్నాయి.

వివరాలు 10లో ▸

ఎంపీహెచ్‌డబ్ల్యూ పరీక్షల షెడ్యూల్ విడుదల



మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) ఫీమేల్/ఏఎన్ఎం కోర్సు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సోమవారం విడుదల చేసింది. డిసెంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు థియరీ పరీక్షలు, 23, 24 తేదీల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొంది.

వివరాలు 14లో ▸

ఇండోనేసియాలో భారీ భూకంపం

162 మంది దుర్మరణం

వందలాది మందికి గాయాలు

రిక్టర్ స్కేల్‌పై 5.6 గా నమోదు



■ ఇండోనేసియాలోని జావా ద్వీపం సోమవారం భారీ భూకంపం ధాటికి చిగురుటాకులా వణికిపోయింది. డజన్ల కొద్దీ భవంతులు పేకమేడల్లా నేలమట్టమయ్యాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. భవంతులు కూలిన ఘటనల్లో మొత్తంగా 162 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయాలపాలయ్యారు. చాలా మంది భవనాల శిథిలాల కింద చిక్కుకున్నారు. మరణాల సంఖ్య భారీగానే ఉండొచ్చని భావిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం వేళ రిక్టర్ స్కేల్‌పై 5.6 తీవ్రతతో వచ్చిన భూకంపం పశ్చిమ జావాలోని సియాంజుర్ రీజియన్‌లో భూమికి 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని ఆ దేశ జాతీయ విపత్తు సంస్థ వెల్లడించింది.

- వివరాలు 6లో



నరసాపురం సభకు భారీ ఎత్తున హాజరైన జనసందోహంలో ఓ భాగం

బూతుల పార్టీ.. రౌడీ 'సేన'

టీడీపీ, జనసేనపై సీఎం జగన్ ధ్వజం

- చంద్రబాబు అధికార భగ్న ప్రేమికుడు.. తనను గెలిపించకుంటే ఇవే చివరి ఎన్నికలంటున్నారు
- చావు హెచ్చరికల్లా.. బాబు బెదిరింపులు.. దత్తపుత్రుడి పార్టీ రౌడీ సేనగా మారింది
- రాష్ట్ర ప్రజలంతా ఇదేం ఖర్మరా బాబూ.. అనుకుంటున్నారు
- వారి మోసాలను గుర్తించే 2019లోనే దత్తపుత్రుడిని, సొంత పుత్రుడిని అన్నిచోట్లా ఓడించారు
- నరసాపురంలో రూ.3,300 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సొంత నియోజక వర్గమైన కుప్పం ప్రజలకు కూడా తన పాలనలో మంచి చేయని టీడీపీ చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు తామేం చేశారో చెప్పుకోలేక ఈమధ్య నోటికి ఎక్కువగా పని చెబుతున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. అధికార భగ్న ప్రేమికుడు ఇటీవల రాష్ట్ర ప్రజలను బెదిరించేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు తీరు చూస్తుంటే.. సెల్‌ఫోన్ టవర్ నుంచి దూకేస్తామని, రైలు కింద పడతామని, పురుగుల మందు తాగుతామని బెదిరించే వారిలా ఉందని వ్యాఖ్యానించారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహించిన మత్స్యకార దినోత్సవం, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనల కార్యక్రమాల్లో సీఎం వైఎస్ జగన్ పాల్గొన్నారు. నరసాపురం నియోజకవర్గంలో రూ.3,300 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు

మిగతా 2వ పేజీలో ▶



నరసాపురంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

> టీడీపీ అంటే.. తెలుగు బూతుల పార్టీగా మార్చేశారు. దత్తపుత్రుడి పార్టీని రౌడీసేనగా మార్చారు. వీరి పాలన రుచి చూసిన రాష్ట్ర ప్రజలంతా 'ఇదేం ఖర్మరా బాబూ..' అనుకోబట్టే, వారు చేసిన మోసాలను గుర్తించే 2019లోనే దత్తపుత్రుడిని, సొంత పుత్రుడిని అన్నిచోట్లా ఓడించి బైబై చెప్పారు. - సీఎం వైఎస్ జగన్

ఏపీలో తొలి ఆక్వా వర్సిటీ

- సుస్థిర అభివృద్ధికి రూ.332 కోట్లతో నరసాపురంలో ఏర్పాటు: సీఎం జగన్
- తమిళనాడు, కేరళ తరువాత దేశంలో ఇది మూడోది

2లో

మరింత జాగ్రత్తగా రికార్డుల అప్‌డేట్

- రీసర్వే పూర్తయినా సరిదిద్దుకునేందుకు రైతులకు అవకాశం
- సంతృప్తి చెందకపోతే మధ్యవర్తిత్వం కోరే చాన్స్
- ప్రతిదశలోను రైతులు, భూయజమానులకు భాగస్వామ్యం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూముల రీసర్వే చురుగ్గా సాగుతోంది. ప్రతిదశలోను రైతులు, భూయజమానులకు భాగస్వామ్యం కల్పిస్తూ పారదర్శకంగా అమలవుతోంది. రీసర్వే ద్వారా రికార్డులు అప్‌డేట్ చేసే ప్రక్రియ మరింత జాగ్రత్తగా అమలయ్యేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంది. రీసర్వే పూర్తయి తుది నోటిఫికేషన్లు ఇచ్చిన తర్వాత కూడా రైతులు, భూయజమానులు రికార్డుల్లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు, సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించింది. దీన్ని వారు సద్వినియోగం చేసుకుంటున్నారు. రీసర్వేలో భూయజమానుల భాగస్వామ్యం ఉండేలా రూపొందిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం

మిగతా 5వ పేజీలో ▶

ఖాళీలన్నీ భర్తీ చేసేలా..

- ఆస్పత్రుల్లో నిరంతరాయంగా నియామక ప్రక్రియ
- వైద్య శాఖలో సరికొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం
- ఖాళీల గుర్తింపు, భర్తీ అంతా ఆన్‌లైన్‌లోనే

14





ఇంగ్లండ్ శుభారంభం

■ ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ బోణీ అదిరింది. గ్రూప్ 'బి'లో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 6–2 గోల్స్ తేడాతో ఇరాన్‌పై ఘనవిజయం సాధించింది. కాగా, హిజాబ్ కట్టుబాట్లపై ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఇరాన్ ఫుట్‌బాలర్లు తమ జాతీయ గీతానికి శ్రుతి కలపకుండా మౌనంగా నిరసన తెలిపారు. కాగా, సెనెగల్ జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2–0తో గెలిచింది.

- వివరాలు 12లో

రైతన్నకు 'మద్దతు'

పంట ఉత్పత్తుల కొనుగోలుకు సన్నాహాలు

- మొక్కజొన్న, సజ్జలు, వేరుశనగ కొనుగోలుకు ఏర్పాట్లు
- మార్కెట్లో ఆశాజనకంగా ధరలు
- ఏమాత్రం ధర తగ్గినా వెంటనే రంగంలోకి ప్రభుత్వం
- మద్దతు ధరకు ఉత్పత్తుల కొనుగోలు.. ఆర్బీకేల్లో రైతుల వివరాలు నమోదుకు శ్రీకారం
- 1.21 లక్షల టన్నుల వేరుశనగ కొనుగోలు లక్ష్యం
- 66 వేల టన్నుల మొక్కజొన్న, 12 వేల టన్నుల సజ్జలు కొనాలని నిర్ణయం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోంది. ఏటా ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంతోపాటు, ఉచిత పంటల బీమా వంటి పలు సదుపాయాలు కల్పించింది. ఆర్బీకేల ద్వారా నిరంతరం వారికి అవసరమైన సేవలు అందిస్తోంది. మార్కెట్‌లో రైతు పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభించేలా చూస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా కనీస మద్దతు ధర దక్కని ఖరీఫ్ ఉత్పత్తుల కొనుగోలుకు సన్నాహాలు చేస్తోంది. ధాన్యంతో పాటు

మిగతా 2వ పేజీలో ▶

'టమాటా'కు రానున్నది మంచికాలం

- ఇంటిగ్రేటెడ్ టమాటా వాల్యూచైన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శ్రీకారం..
- పీపీపీ విధానంలో త్రైపాక్షిక ఒప్పందం
- 20 ఎఫ్‌పీవోల్లో 20 వేలమంది రైతులకు మేలు.. టమాటాకు కనీస మద్దతు ధర
- రైతులకు అదనపు ఆదాయకల్పనే లక్ష్యం



3లో

ఇదండీ సంగతి



అప్పుల్లో.. అడుగునే



ఏపీ అప్పులు 2022 మార్చికి రూ.3,98,903 కోట్లు

టీడీపీ దిగిపోయే నాటికే రూ.2,70,451 కోట్ల రుణ భారం

ఈ మూడేళ్లలో చేసిన అప్పులు రూ.1.28 లక్షల కోట్లు

రూ.8 లక్షలు.. పది లక్షల కోట్లంటూ.. శ్రీలంకతో పోలుస్తూ

రాష్ట్ర ప్రతిష్టపై ఓ వర్గం మీడియా తరచూ బురద

మన కన్నా దేశంలో ఏడు రాష్ట్రాల్లో అప్పులు అత్యధికం

అప్పుల్లో తమిళనాడు టాప్.. రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్

వివిధ రాష్ట్రాల అప్పులను నివేదిక రూపంలో వెల్లడించిన ఆర్బీఐ

ఆర్బీఐ నివేదిక కంటే ప్రామాణికత ఇంకేముంటుంది?

ఇకనైనా వాస్తవాలు ఒప్పుకోవాలని సూచిస్తున్న ఆర్థిక శాఖ వర్గాలు

సాక్షి, అమరావతి: ఒకసారి శ్రీలంకతో పోలుస్తూ.. మరోసారి రూ.పది లక్షల కోట్లంటూ రాష్ట్ర అప్పులపై తమకు నచ్చినట్లు పుంఖాను పుంఖాలుగా ఓ వర్గం మీడియా ప్రచురిస్తున్న కథనాల్లో ఏమాత్రం నిజం లేదని ఆర్బీఐ నివేదిక సాక్షిగా తేటతెల్లమైంది. 2021–22 ఆర్థిక ఏడాది మార్చి నాటికి వివిధ రాష్ట్రాల అప్పులపై ఆర్బీఐ తాజాగా నివేదిక విడుదల చేసింది. ఇన్‌స్టిట్యూషన్లతో పాటు స్టేట్ డెవలప్‌మెంట్ రుణాలు (మార్కెట్ బారోయింగ్), విద్యుత్ బాండ్లు, నాబార్డు, ఇతర బాండ్లు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, కేంద్రం నుంచి రుణాలు, అడ్వాన్స్‌లు, నేషనల్ సెక్యూరిటీ ఫండ్, నేషనల్ కో–ఆపరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపాజిట్స్ అండ్ అడ్వాన్స్ ద్వారా తీసుకున్న మొత్తం రుణాలను రాష్ట్రాల వారీగా ఆర్బీఐ వెల్లడించింది. అన్ని రకాల రుణాలు కలిపి ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పులు 2022 మార్చి నాటికి రూ.3,98,903 కోట్లుగా ఉన్నట్లు ఆర్‌బీఐ నివేదిక స్పష్టం చేసింది. 2019 మార్చి నెలాఖరు నాటికి అంటే చంద్రబాబు పాలన చివరి దశలో రాష్ట్రం అప్పులు రూ.2,64,451 కోట్లుగా ఉన్నట్లు ఆర్బీఐ నివేదిక పేర్కొంది. 2019 ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పటికీ చంద్రబాబు సర్కారు

మిగతా 3వ పేజీలో ▶

ఏడు రాష్ట్రాల తరువాతే ఏపీ..

దేశంలో ఏడు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ కంటే అధికంగా అప్పులు చేశాయని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. దేశంలో అత్యధికంగా తమిళనాడు రాష్ట్రానికి అప్పులున్నాయని తెలిపింది, అత్యధిక అప్పుల్లో రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్, మూడో స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో పశ్చిమ బెంగాల్, ఐదో స్థానంలో రాజస్థాన్, ఆరో స్థానంలో కర్ణాటక, ఏడో స్థానంలో గుజరాత్ రాష్ట్రాలున్నాయి. ఆ తరువాత.. అంటే 8వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది.

క్లుప్తంగా

మత్స్యకార కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాం..
కడలి పుత్రులకు సీఎం జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కడలి పుత్రులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు చెప్పారు. 'సంక్షేమ పథకాలతో మత్స్యకార కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాం. వారి సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. నేడు(సోమవారం) నరసాపురంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం' అంటూ ట్వీట్ చేశారు.

రేపు శ్రీకాకుళం జిల్లాలో సీఎం జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించనున్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష (రీసర్వే) పథకం కింద సర్వే పూర్తి అయిన గ్రామాలకు సంబంధించిన రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 11.00 నుంచి 12.55 వరకు బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. లబ్ధిదారులకు పత్రాల పంపిణీ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1.25 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.25 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

చిరంజీవి విలక్షణమైన నటుడు
- ప్రధాని మోదీ ట్వీట్
- ఇండియా ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్‌గా నిలవడంపై ప్రశంసలు

సాక్షి, అమరావతి/సాక్షి న్యూఢిల్లీ: ఇండియా ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైన చిరంజీవిని కొనియాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ట్వీట్ చేశారు. ప్రధాని తెలుగులో ట్వీట్ చేయడం విశేషం. 'చిరంజీవి విలక్షణమైన నటుడు. అద్భుతమైన వ్యక్తిత్వంతో, విభిన్న నటనా చాతుర్యంతో అనేక పాత్రలు పోషించి కొన్ని తరాల ప్రేక్షకుల అభిమానాన్ని, ఆదరణనూ చూరగొన్నారు' అంటూ ప్రధాని మోదీ తన ట్వీట్‌లో ప్రశంసించారు.

అభినందనల వెల్లువ..
చిరంజీవికి అభినందనలు తెలిపిన వారిలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, అనురాగ్ ఠాకూర్, మురళీధరన్, మురుగన్, డా॥భగవత్ కిషన్‌రావు కారడ్, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచరణ్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ తదితరులు ఉన్నారు.

మెరైన్ మత్స్య ఉత్పత్తుల్లో ఏపీకి ఐదు అవార్డులు



కేంద్ర మంత్రి నుంచి ఉత్తమ మెరైన్ జిల్లా అవార్డు అందుకుంటున్న నెల్లూరు కలెక్టర్

కైకలూరు: ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) ఆధ్వర్యంలో డామన్ అండ్ దయ్యూలోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో సోమవారం జరిగిన ఆక్వా అవార్డుల ప్రదానోత్సవంలో ఏపీకి ఐదు అవార్డులు దక్కాయి. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పురుషోత్తమ రూపాల చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఏపీలో ఉత్తమ మెరైన్ జిల్లాగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు ఎంపిక కాగా, కలెక్టరు చక్రధర్‌బాబు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు అవార్డును స్వీకరించారు. ఉత్తమ మెరైన్ చేపల రైతుగా ఏలూరు జిల్లా కలిదిండి మండలం మట్టగుంట గ్రామానికి చెందిన పండుగప్ప సాగు రైతు తిరుమాని నాగరాజు, ఉత్తమ హేచరీగా కాకినాడ జిల్లాకు చెందిన సప్తగిరి హేచరీస్, ఉత్తమ ల్యాబ్‌గా తూర్పుగోదావరి జిల్లా రెడ్డి డ్రగ్స్, ల్యాబ్‌కు, ఉత్తమ ఆర్టెమియా టెక్నాలజీ ఇన్నోవేషన్‌గా ఐ అండ్ వీ బయో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డులు దక్కాయి. తిరుమాని నాగరాజుతోపాటు సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించారు.

'సౌత్ ఈస్ట్' సదస్సుకు మంత్రి గుడివాడ



అల్లిపురం (విశాఖ దక్షిణ): రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 12వ సౌత్ ఈస్ట్ ఏసియా ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం ఎట్ సింగపూర్ సదస్సులో పాల్గొనేందుకు సోమవారం సింగపూర్ చేరుకున్నారు. సింగపూర్ ఏపీ నాన్ రెసిడెంట్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ పిల్లి సంతోష్‌కుమార్‌రెడ్డి తదితరులు ఆయనకు చాంగీ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు.

ఏపీలో తొలి ఆక్వా వర్సిటీ

సుస్థిర అభివృద్ధికి రూ.332 కోట్లతో నరసాపురంలో ఏర్పాటు: ముఖ్యమంత్రి జగన్
- తమిళనాడు, కేరళ తరువాత దేశంలో ఇది మూడోది
- రూ.3,500 కోట్లతో రాష్ట్రంలో 9 ఫిషింగ్ హార్బర్లు
- రూ.430 కోట్లతో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మాణం
- 23,458 మంది గంగపుత్రులకు రూ.108 కోట్ల పరిహారం
- తీర ప్రాంత తాగునీటి ఎద్దడి నివారణకు రూ.1,400 కోట్లతో వాటర్ గ్రిడ్
- వశిష్ట బ్రిడ్జి నిర్మాణానికి వచ్చే జనవరిలో టెండర్లు
- నరసాపురంలో రూ.3,300 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన



పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఆక్వా కల్చర్ సుస్థిర అభివృద్ధి కోసం రాష్ట్రంలో మొట్టమొదటి ఆక్వా యూనివర్సిటీని నరసాపురంలో నెలకొల్పుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇది దేశంలో మూడో ఆక్వా యూనివర్సిటీ కానుందని చెప్పారు. ఫిషరీస్ పాలిటెక్నిక్ డిప్లొమా నుంచి పీహెచ్‌డీ వరకు ఇక్కడ అందుబాటులోకి తెచ్చి ఆక్వా కల్చర్‌లో మానవ వనరుల కొరత తీరుస్తామన్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో రూ.3,300 కోట్ల విలువైన 15 అభివృద్ధి పనులకు సీఎం జగన్ శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆ వివరాలివీ..

నరసాపురం చరిత్రలో తొలిసారిగా..
పవిత్ర కార్తీక మాసంలో చివరి సోమవారం రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాం. ఒకేరోజు సుమారు రూ.3,300 కోట్ల నిధులతో 15 అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించాం. ఇన్ని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం నరసాపురం చరిత్రలో బహుశా మునుపెన్నడూ జరిగిన దాఖలాలు లేవు. నరసాపురం, నియోజకవర్గం రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలను మీ ముందుంచుతున్నా.

ఫిషరీస్ యూనివర్సిటీ
ఇక్కడ ఆక్వా కల్చర్ ప్రధానమని మనందరికీ తెలుసు. మెరైన్ ప్రొడక్షన్, ఎక్స్‌పోర్ట్స్‌లో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఆక్వా కల్చర్‌కు సంబంధించిన స్కిల్, పరిజ్ఞానం పిల్లలకు అందుబాటులోకి వస్తే మెరుగైన ఉద్యోగాలు, మెరుగైన జీతాలు లభిస్తాయి. ప్రపంచంలో ఎక్కడ అవసరమున్నా మన వారి నైపుణ్యాన్ని వినియోగించేలా గొప్ప చదువు అందించేందుకు ఇవాళ నాంది పలుకుతున్నాం. ఆక్వా కల్చర్ సుస్థిర అభివృద్ధి కోసం ఫిషరీస్ పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్స్, బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ హోల్డర్లు, మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ పీజీ, డిగ్రీ హోల్డర్లతో ఆక్వా కల్చర్‌లో మానవ వనరుల కొరత తీర్చేందుకు ఆక్వా విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటివరకు దేశంలో తమిళనాడు, కేరళలలో మాత్రమే ఇవి ఉండగా మూడో వర్సిటీ మన రాష్ట్రంలో ఏర్పాటవుతోంది. రూ.332 కోట్లతో ఈ యూనివర్సిటీని నరసాపురంలో నెలకొల్పుతున్నాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తై పనులు ప్రారంభించడానికి శ్రీకారం చుట్టాం.

రూ.3500 కోట్లతో 9 హార్బర్లు

ఆరు వేల మంది మత్స్యకారులకు మేలు చేసేలా నరసాపురం ప్రాంతంలోని బియ్యపుతిప్ప వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. రూ.430 కోట్ల వ్యయంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కానుంది. హార్బర్‌లో 640 మీటర్ల బెర్తు, 2,400 మీటర్ల బ్రేక్ వాటర్ నిడివి ఉండేలా బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తున్నాం. ప్లాట్ ఫామ్స్, వేలం కోసం హాల్స్, డ్రైయింగ్ యార్డ్స్, బోట్ పార్కింగ్ ఏరియా, మత్స్యకారులకు విశ్రాంతి గదులు, కోల్డ్ స్టోరేజీలు తదితర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. మన రాష్ట్ర మత్స్యకారులు గుజరాత్ సహా ఇతర రాష్ట్రాలకు వెళ్లి బతకాల్సిన అవసరం రాకుండా ఇక్కడే తలెత్తుకుని జీవించేలా తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను రూ.3,500 కోట్లతో ఏర్పాటు చేస్తున్నాం.

మత్స్యకారులకు మేలు చేస్తూ..
ముమ్మిడివరంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల ప్రభావితమైన 23,458 మంది మత్స్యకార కుటుంబాలకు ఇక్కడి నుంచే బటన్ నొక్కి రూ.108 కోట్లు విడుదల చేశాం. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల నష్టపోయిన మత్స్యకారులకు మంచి చేసేందుకు గత ప్రభుత్వం ఏనాడూ ముందుకు రాలేదు. ఇప్పుడు మన ప్రభుత్వ హయాంలో వారందరికీ మేలు చేసేలా చర్యలు చేపట్టాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల్లోని పేదలంతా కూడా జగనన్న ప్రభుత్వమంటే మన ప్రభుత్వమనేలా ప్రతి అడుగూ వేస్తున్నాం.

ఉప్పుటేరుపై రూ.188 కోట్లతో..
నరసాపురంలోనే ఉప్పుటేరుపై మొల్లపర్రు వద్ద రెగ్యులేటర్ నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. వారి కోరికను నెరవేరుస్తూ ఈరోజు శంకుస్థాపన చేశాం. ఉప్పునీరు కొల్లేరులోకి రాకుండా రైతులకు మంచినీరు ఇంకా మెరుగ్గా అందేలా, కొల్లేరులో ఐదో కాంటూరు వరకు మంచినీరు నిల్వ ఉండేలా ఉప్పుటేరుపై రూ.188 కోట్లతో రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జి లాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం.

నీటి ఎద్దడిని శాశ్వతంగా నివారించేలా..

నరసాపురంలో శాశ్వతంగా నీటి ఎద్దడి నివారణ, రక్షిత మంచి నీటి సరఫరా కోసం ఫిల్టరేషన్ ప్లాంట్, సర్వీస్ రిజర్వాయర్లు, వాటర్ సప్లై పైప్‌లైన్ పనులకు నేడు శంకుస్థాపన చేశాం. రూ.62 కోట్ల వ్యయంతో మంచినీటి సరఫరా ప్రాజెక్టు చేపట్టాం. రూ.4 కోట్లతో నరసాపురం బస్‌స్టేషన్ అభివృద్ధి, కొత్త ప్లాట్‌ఫాంలు నిర్మించి నేడు వాటిని ప్రారంభించాం. బ్రిటీషర్ల కాలంలో నిర్మించిన ట్రెజరీ ఆఫీస్ బిల్డింగ్ నూతన భవనానికి శంకుస్థాపన చేశాం. పారిశ్రామిక, వ్యవసాయ, ఆక్వా రంగానికి మెరుగైన విద్యుత్ అవసరాల కోసం 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.132 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశాం. దీనివల్ల నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

అగ్రికల్చర్ కంపెనీ భూములపై రైతులకు హక్కులు

నరసాపురంలో అగ్రికల్చర్ కంపెనీ భూములపై పూర్తి హక్కులను రైతులకు ఈ రోజు నుంచి కల్పిస్తున్నాం. 1921లో బ్రిటీష్ ప్రభుత్వం దర్బరేవులో 1,754 ఎకరాల భూమిని నరసాపురం అగ్రికల్చర్ కంపెనీకి 99 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చింది. ఆనాటి నుంచి 1,623 మంది రైతులు సాగు చేస్తున్నప్పటికీ ఆ భూములపై వారికి ఎలాంటి హక్కులూ లేకపోవడంతో ప్రయోజనాలు అందని పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో నాడు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వారికి రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అందిస్తున్నాం. రైతుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపించాం. ఎకరానికి కేవలం రూ.100తో రైతులకు రిజిస్ట్రేషన్ చేసి వారికి హక్కులు కల్పించాం.

వంద పడకలతో ఏరియా ఆసుపత్రికి కొత్త భవనం
నరసాపురంలో రూ.1,300 కోట్లతో ఏరియా ఆసుపత్రికి కొత్త భవనాన్ని నిర్మించి జాతికి అంకితం చేస్తూ ప్రారంభించాం. ఈ ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచడంతో పాటు మరో రూ.66 లక్షల విలువైన వైద్య పరికరాలను అందించి ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్ కూడా అందుబాటులోకి తెచ్చాం.

రూ.1,400 కోట్లతో వాటర్ గ్రిడ్
ఇక్కడ ఒకపక్క గోదావరి మరోపక్క సముద్రతీర ప్రాంతం ఉన్నా తాగడానికి గుక్కెడు నీళ్లు లేని దుస్థితిని నా పాదయాత్ర సమయంలో చూశా. బోరు వేస్తే ఉప్పునీరు వస్తోందని, ఆక్వా కల్చర్ సాగుతో ఉపరితల జలాలు కలుషితమవుతున్న నేపథ్యంలో తాగునీరు లేకుంటే ఎలా బతకాలన్న ఈ ప్రాంత ప్రజల ఆవేదనను తొలగిస్తూ ఈరోజు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.1,400 కోట్లతో రక్షిత మంచి నీటి సరఫరా వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేశాం. విజ్జేశ్వరం వద్ద గోదావరి నీటిని ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ల ద్వారా అక్కడే శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తాం. ఈ పథకం ద్వారా తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని నిడదవోలు, తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, ఉంగుటూరు, ఏలూరు, తాడేపల్లి గూడెం నియోజకవర్గాల ప్రజలతో పాటు కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు మండలాల ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా అవుతుంది. మొత్తం 26 మండలాల్లో 1,178 గ్రామాలకు చెందిన సుమారు 18.50 లక్షలమంది ప్రజలకు దీనిద్వారా మేలు జరుగుతుంది.

పారదర్శకంగా రూ.1,76,516 కోట్లు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద ఓసీల అభివృద్ధికి కట్టుబడిన మన ప్రభుత్వ పాలనలో ఎలాంటి లంచాలు, అవినీతికి తావు లేకుండా బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో మూడేళ్ల ఐదు నెలల వ్యవధిలో రూ.1,76,516 కోట్లు జమ చేశాం. మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావించి 98 శాతం హామీలను నెరవేర్చాం. మేనిఫెస్టోలో చెప్పనివి కూడా అమలు చేస్తున్నాం. వైద్యం, ఆరోగ్యం, ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల స్థలాలు, విద్య, వ్యవసాయం, మహిళా సాధికారత.. ఇలా ఏ రంగం చూసినా పారదర్శకంగా పరిపాలన అందిస్తున్నాం. చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎన్నడూ చేయనివిధంగా గత పాలకుల ఊహకు కూడా అందని విధంగా దేవుడి దయతో అన్ని వర్గాలకు అండగా, తోడుగా మీ బిడ్డ నిలబడ్డాడు.

2,240 ఎకరాలకు సాగునీరు, తాగునీరు
నరసాపురంలో రూ.87 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఫేజ్ 1కి శంకుస్థాపన చేశాం. మరో రూ.26 కోట్లతో వశిష్ట వారధి, బుడ్డిగవాని రేవు ఏటిగట్టు పటిష్టం చేయడంతోపాటు రూ.7.83 కోట్లతో శేషావతారం పంట కాలువ అభివృద్ధి, టైల్ డ్యామ్ నిర్మాణం, సీసీ లైనింగ్ పనులకు కూడా శ్రీకారం చుట్టాం. మొగల్తూరు పంట కాలువ అభివృద్ధి పనులను రూ.24 కోట్లతో చేపట్టాం. 2,240 ఎకరాలకు సాగునీరు, వాటి పరిధిలోని గ్రామాలకు తాగునీరు అందుతుంది. కాజ, ఈస్ట్ కొక్కిలేరు, ముస్కేపాలెం, మడుగు తూముల స్లూయిజ్‌ల పునర్నిర్మాణ పనులకు రూ.9 కోట్లతో శంకుస్థాపన చేశాం. ఒక్క నరసాపురం అభివృద్ధి పనుల గురించి చెప్పేందుకే ఇంత సమయం పట్టిందంటే ప్రజలకు ఎంత మంచి జరుగుతుందో ఆలోచించండి.

పాలకొల్లు మెడికల్ కాలేజీ..
పాలకొల్లులో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ పనులు ప్రారంభమయ్యాయి. వశిష్ట బ్రిడ్జి నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. కోర్టుల్లో వేసిన కేసులను పరిష్కరించి కేంద్రాన్ని ఒప్పించాం. జనవరిలో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం.

హాజరైన మంత్రులు, ప్రజా ప్రతినిధులు..
ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, తానేటి వనిత, సీదిరి అప్పలరాజు, అంబటి రాంబాబు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మార్గాని భరత్, చింతా అనురాధ, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



లబ్ధిదారులకు భూముల పట్టాలు పంపిణీ చేస్తున్న సీఎం వైఎస్ జగన్



మత్స్య విశ్వవిద్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం జగన్



కంపెనీ భూముల పట్టాల లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బూతుల పార్టీ.. రౌడీ 'సేన'

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపన అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. సీఎం జగన్ ప్రసంగం వివరాలివీ..

భయం, నిస్పృహతోనే..
ఈమధ్య చంద్రబాబు తాను రాజకీయాల్లో ఉండాలంటే అసెంబ్లీకి వెళ్లాలని, వచ్చే ఎన్నికల్లో తనను ప్రజలు గెలిపించాలని, లేదంటే తనకు అవే చివరి ఎన్నికలవుతాయని ప్రజల్ని బెదిరిస్తున్నారు. కుప్పంలోనూ గెలవలేననే భయం, నిస్పృహ ఆయనలో కనిపిస్తోంది. ఏ మంచీ చేయని తమకు ఎవరైనా ఓటు ఎందుకు వేస్తారని, ఎందుకు ఓటు వేయాలనిగానీ చంద్రబాబు, దత్త పుత్రుడు చెప్పరు. ఎందుకంటే వారు చెప్పడానికీ ఏమీ లేదు. ఇలాంటి రాజకీయ నాయకులు 4 పేపర్లు, నాలుగు టీవీలు ఒక ఈనాడు, ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ 5 లాంటి వారితో దోచుకో, పంచుకో, తినుకో అనే ఒప్పందం చేసుకుంటారు. ఇదే పెద్ద మనిషి అధికారంలో ఉంటే దోచుకున్నది వీరందరితో పంచుకుని తింటారు. అందువల్లే వారంతా ఆ పెద్ద మనిషి చంద్రబాబు గురించి ఏమీ మాట్లాడరు, చూపించరు, రాయరు. చివరికి ప్రశ్నిస్తాననేవారు కూడా నోరెత్తరు. ఇలాంటి వారందరినీ చూసినపుడు ఇదేం ఖర్మరా బాబూ.. ఈ రాష్ట్ర రాజకీయాలు ఇలా ఉన్నాయనిపిస్తుంది.

బాబూ.. ఇదేం ఖర్మరా!
ప్రజలు కుప్పం స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం టీడీపీని చిత్తుగా ఓడించి మరోసారి బైబై బాబూ అని చెప్పారు. అందుకే చంద్రబాబు ఇదేం ఖర్మరా బాబూ అని తల పట్టుకుని కూర్చుంటే.. ఆయన పుత్రుడు, దత్తపుత్రుడు ఇదేం ఖర్మరా బాబూ అనుకుంటున్నారు. 1995లో చంద్రబాబు చేతిలో వెన్నుపోటుకు గురైన ఎన్టీఆర్ కూడా ఇలాంటి మనిషికి తన ఇంట్లో, పార్టీలో, కేబినెట్‌లో స్థానం కల్పించినందుకు ఇదేం ఖర్మరా బాబూ అని అనుకునే ఉంటారు. వీళ్ల ధోరణి చూసి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా ఇదేం ఖర్మ బాబూ అనుకుంటున్నారు.

ప్రతి ఇంటికీ మంచి జరిగిందా లేదా?
మీ అందరికీ ఒకటే చెబుతున్నా.. ఒకే ఒక్కటి కొలమానంగా తీసుకోండి. ఇవాళ ప్రతి కుటుంబంలోనూ మంచి జరిగిందా లేదా? అన్నది కొలమానంగా చూడండి. మంచి జరిగితే మీ అన్నగా, తమ్ముడిగా, బిడ్డగా నాకు అండగా నిలబడండి. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడిని నమ్మొద్దు. మా మేనిఫెస్టోలో చెప్పినవి 98 శాతం నెరవేర్చాం. మన ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధితో ప్రజలంతా ప్రతి ఉప ఎన్నికలోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అండగా నిలబడి ఆశీర్వదించారు.

అక్కున చేర్చుకున్నారు..

మత్స్యకారుల జీవితాల్లోకి ఇన్నాళ్లూ ఏ నాయకుడూ తొంగి చూసిన పరిస్థితి లేదు. మత్స్యకారుల తోలు తీస్తాం.. ఫినిష్ చేస్తాం అని గత సీఎం బెదిరిస్తే, సాదరంగా అక్కున చేర్చుకుని ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రిని ఇవాళ చూస్తున్నాం. ప్రతి హామీనీ నెరవేర్చిన సీఎం మన ముందున్నారు. మత్స్యకార భరోసా, డీజిల్ సబ్సిడీ, ఎక్స్‌గ్రేషియా అందిస్తూ వలస వెళ్లకుండా తొమ్మిది హార్బర్లు మంజూరు చేసిన ప్రభుత్వమిది. ఇప్పటికే నెల్లూరులో జువ్వలదిన్నె, బాపట్లలో నిజాంపట్నం, మచిలీ పట్నం, ఉప్పాడలో హార్బర్ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ రోజు బియ్యపుతిప్ప హార్బర్ నిర్మాణం ప్రారంభమవుతోంది. జిల్లాలో ఆక్వా యూనివర్సిటీ మత్స్యకారుల జీవితాల్లో గొప్ప మార్పు తెస్తుంది.
– సీదిరి అప్పలరాజు, పశు సంవర్థక, మత్స్యశాఖ మంత్రి

మాట ప్రకారం..

పాదయాత్ర సమయంలో నరసాపురం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేశారు. జిల్లా కేంద్రం చేయాలని కోరినప్పుడు నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబెడతామని సీఎం హామీ ఇచ్చారు. మాట ప్రకారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.3,300 కోట్ల ప్రాజెక్టులకు నరసాపురం నియోజకవర్గంలో శంకుస్థాపనలు నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ ప్రజలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నారు.
– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

రైతన్నకు 'మద్దతు'

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని రకాల ఉత్పత్తులకు మద్దతు ధర లభించేలా చర్యలు చేపడుతోంది. ధాన్యం కాకుండా ఈ మూడేళ్లలో 4.27 లక్షల మంది రైతుల నుంచి రూ.7,157 కోట్ల విలువైన 20.18 లక్షల టన్నుల వివిధ రకాల పంట ఉత్పత్తులను వైఎస్ జగన్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో మార్క్‌ఫెడ్ ద్వారా 3.76 లక్షల మంది రైతుల నుంచి రూ.5,023 కోట్ల విలువైన 16.34 లక్షల టన్నుల ఉత్పత్తులను సేకరించింది. ప్రధానంగా 2019–20 సీజన్‌లో 2.24 లక్షల మంది రైతుల నుంచి రూ. 2,231 కోట్ల విలువైన 8.56 లక్షల టన్నులు, 2020–21 సీజన్‌లో 1.20 లక్షల మంది రైతుల నుంచి రూ.2,255 కోట్ల విలువైన 6.46 లక్షల టన్నులు సేకరించింది. 2022–23లో ఇప్పటివరకు 32 వేల మంది నుంచి రూ. 537 కోట్ల విలువైన 1.32 లక్షల టన్నుల విలువైన ఉత్పత్తులను సేకరించింది. గత సీజన్‌లో మాదిరిగానే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న, సజ్జలు, వేరుశనగ కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఖరీఫ్‌లో వేరుశనగ 13.34 లక్షల ఎకరాల్లో సాగవగా, 4.87 లక్షల టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. మొక్కజొన్న 3.21లక్షల ఎకరాల్లో సాగవగా, 6.60 లక్షల టన్నులు, సజ్జలు 52 వేల ఎకరాల్లో సాగవగా, 50 వేల టన్నులు దిగుబడి వస్తుందని అంచనా. మొక్కజొన్నకు టన్నుకు రూ.1,962, సజ్జలకు రూ.2,350, వేరుశనగకు రూ.5,850 చొప్పున కనీస మద్దతు ధరలను



ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్‌లో వీటి ధరలు ప్రస్తుతం ఆశాజనకంగానే ఉన్నాయి. సజ్జలు మినహా మిగిలిన రెండింటి ధరలు ఎమ్మెస్పీకి దీటుగానే ఉన్నాయి. నాణ్యమైన (ఫైన్‌క్వాలిటీ) సజ్జలు, మొక్కజొన్నకు మార్కెట్‌లో టన్నుకు రూ.2 వేలకు పైగా ధర పలుకుతోంది. వేరుశనగ రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు పలుకుతోంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు ఏమాత్రం తగ్గినా వెంటనే మార్కెట్ ఇంటర్‌వెన్షన్ కింద జోక్యం చేసుకొని ధరలు పడిపోకుండా రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం మార్క్‌ఫెడ్ ద్వారా ఈ మూడు ఉత్పత్తుల కొనుగోలుకు సన్నాహాలు చేస్తోంది. 12వేల టన్నుల సజ్జలు, 66 వేల టన్నుల మొక్కజొన్న, 1.21 లక్షల టన్నుల వేరుశనగ కొనాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇప్పటికే ఆర్బీకేల ద్వారా రైతుల వివరాల నమోదు ప్రక్రియ చేపట్టింది.

ఏజెన్సీలో మరో 32 గర్భిణీ వసతి గృహాలు

సాక్షి, అమరావతి: కొండలు, కోనల్లో ఉండే గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ పలు చర్యలు చేపట్టారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 159 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులను అత్యవసర సమయాల్లో డోలీలు, మంచాలపై మోసుకెళ్లకుండా వారి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిరక్షించి, ముందుగానే ఆస్పత్రులకు తరలించేందుకు గిరిజన ప్రాంతాల్లో గర్భిణీ వసతి గృహాలు (బర్త్ వెయిటింగ్ హోమ్స్–బీడబ్ల్యూహెచ్) ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లో ఇవి 45 ఉన్నాయి. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రతిపాదనల మేరకు మరో 32 గర్భిణీ వసతి గృహాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో మొత్తం వీటి సంఖ్య 77కు పెరగనుంది. మారుమూల ప్రాంతాల్లోని గర్భిణులకు తక్షణ వైద్య సేవలు అందించి తల్లీ బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడంలో ఈ వసతి గృహాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో 1818 మారుమూల ప్రాంతాలున్నాయి. కొండలు, గుట్టలు, అడవులు, సెలయేరులు తదితర మారుమూల ప్రాంతాల్లో ఉండే ప్రజలకు గతంలో వైద్యం గగనమే అయ్యేది. దీంతో మరణాలూ అధికంగానే ఉండేవి. గర్భిణుల అవస్థలు చెప్పనలవి కాదు. సరైన వైద్యం అందక, ప్రసవ సమయానికి ఆస్పత్రికి వెళ్లలేక మరణించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గిరిజనులకు ఈ అవస్థలు తప్పించి, వారికి మంచి వైద్య సేవలను వైఎస్ జగన్ ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఆ ప్రాంతాల్లో తల్లీ బిడ్డలను క్షేమంగా ఉంచేందుకు గర్భిణీ వసతి గృహాలు ఏర్పాటు చేస్తోంది. గిరి రక్షక్ పేరుతో ఏర్పాటు చేయనున్న బైక్ అంబులెన్స్‌లు నెలలో 25 రోజులపాటు ప్రతి మారుమూల ప్రాంతాన్ని సందర్శించి గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తుంటారు. స్థానిక ఏఎన్ఎం దగ్గర్నుంచి మండల స్థాయి వైద్యాధికారి, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గర్భిణులతోపాటు అక్కడి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి తగు చర్యలు చేపడుతుంటారు. ప్రతి గురువారం గ్రామ సచివాలయ బృందం అన్ని మారుమూల (డోలీపై ఆధారపడిన) ప్రాంతాలను సందర్శిస్తుంది. ప్రతి శనివారం (పలకరింపు) వైద్య బృందం వెళ్లి అక్కడి వారికి ప్రాథమికంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రతి మంగళవారం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు మారుమూల ప్రాంతాలకు వెళ్లి క్షేమ సమాచారం తెలుసుకుంటారు. డోలీ మరణాల నివారణకు మారుమూల ప్రాంతాల్లోని గర్భిణులను డాక్టర్ నిర్ధారించిన ప్రసవ సమయానికి నెల రోజుల ముందుగానే సురక్షిత రవాణా వ్యవస్థ (108 అంబులెన్స్, ఫీడర్‌అంబులెన్స్, బైక్ అంబులెన్స్) ద్వారా బర్త్ వెయిటింగ్ హోమ్‌కు తరలిస్తారు. ఈ గృహాల్లో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు నిరంతరం గర్భిణుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంటారు. నిత్యం పోషకాహారాన్ని, మందులను అందిస్తారు. మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని ప్రాథమిక, సామాజిక, జనరల్ ఆసుపత్రులకు తరలిస్తారు.

క్లుప్తంగా

హైకోర్టులో నారాయణ పిటిషన్

టెన్త్ ప్రశ్నపత్రాల మాల్ ప్రాక్టీస్ కేసులో తన బెయిల్ రద్దు ఉత్తర్వులను కొట్టేయాలని వినతి

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాల మాల్ ప్రాక్టీస్ వ్యవహారంలో మాజీ మంత్రి, నారాయణ విద్యా సంస్థల అధినేత పొంగూరు నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. తనకు మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేస్తూ చిత్తూరు 9వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేయాలని, వాటికి సంబంధించి తదుపరి చర్యలు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ మంజూరు చేస్తూ మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చినవి తాత్కాలిక ఉత్తర్వులేనని, వాటిపై రివిజన్ పిటిషన్ దాఖలుకు వీల్లేదని తెలిపారు. సహ నిందితుల వాంగ్మూలం ఆధారంగానే తనను అరెస్ట్ చేశారని, చట్ట ప్రకారం ఆ వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకోకూడదని తెలిపారు. నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పదవికి 2014 లోనే రాజీనామా చేసినందున, ఈ కేసులో తనను నిందితునిగా చేయడానికి వీల్లేదన్నారు.

విలువలను మంటగలిపేలా చంద్రబాబు ప్రసంగాలు

మంత్రి బొత్స సత్యనారాయణ



నరసన్నపేట: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని గొప్పలు చెప్పుకొనే చంద్రబాబు గడిచిన నాలుగు రోజులుగా చేస్తున్న ప్రసంగాలు ప్రజాస్వామ్య విలువలను మంటగలిపేలా ఉన్నాయని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కర్నూలు సభలో ఆయన ప్రసంగం సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. చంద్రబాబు సహనం కోల్పోయి చేస్తున్న ప్రసంగాలపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు గమనించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో సీఎం జగన్ రాక నేపథ్యంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు కనీస సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'నువ్వు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎటువంటి హత్యలు, దోపిడీలు జరిగాయో గుర్తు చేసుకోవాలి' అంటూ హితవుపలికారు. సీఎం జగన్‌కు, ఆయన పాలనకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని బొత్స చెప్పారు.

చంద్రబాబు భాష సంస్కారహీనం

తిరుపతి ఎమ్మెల్యే భూమన



సాక్షి ప్రతినిధి, తిరుపతి: అధికార దాహంతో సభ్య సమాజం తలదించుకునేలా సంస్కారహీనమైన భాషను మాట్లాడడం ప్రతిపక్ష నేత చంద్రబాబుకే చెల్లిందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. కర్నూలు పర్యటనలో చంద్రబాబు మాట్లాడిన అసభ్య పదజాలం మానవజాతే తలదించుకునేలా ఉందని, 44 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఆయన నేర్చుకున్నది ఇదేనా? అని ప్రశ్నించారు. ఇక్కడ సోమవారం భూమన మీడియాతో మాట్లాడుతూ ఎలాగైనా అధికారంలోకి రావాలన్న తలంపుతో యువతను రెచ్చగొడుతూ, అసభ్య పదజాలంతో మాట్లాడడం చంద్రబాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. 'ఇదే నా చివరి ఎన్నికలు, ఓట్లు వేసి గెలిపించండి, లేకుంటే మీరే నష్టపోతారు' అంటూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ, బెదిరింపులకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. మొరార్జీదేశాయ్ 90 ఏళ్ల పాటు రాజకీయాలు చేశారని, జయప్రకాష్ నారాయణ 85 ఏళ్లు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి 83 ఏళ్లు, కరుణానిధి 93 ఏళ్ల పాటు రాజకీయాలు చేశారని, రాజకీయాలే నా వృత్తి, నా ప్రవృత్తి అని చెప్పుకొనే చంద్రబాబు 74 ఏళ్లకే చివరి ఎన్నికలు అని చెప్పుకొంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు.

టీడీపీ నేత చెంగల్రాయుడుపై చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి డిమాండ్



సాక్షి, అమరావతి: కోర్టులను కించపరిచేలా, పోలీసులను అవమానించేలా, దుర్భాషలాడిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, ఆయన్ను ప్రోత్సహించిన ప్రతిపక్ష నేత చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలో సోమవారం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సమక్షంలోనే కర్నూలుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు పవిత్రమైన న్యాయ, పోలీసు వ్యవస్థలను కించపరిచేలా, అవమానించేలా మాట్లాడడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిని చంద్రబాబు కనీసం ఖండించక పోవడాన్ని తప్పుపట్టారు. కోర్టులను తప్పుదోవ పట్టించేలా చేయాలని చెంగల్రాయుడు మాట్లాడటం నేరాలను ప్రోత్సహించడం కిందకే వస్తుందని అన్నారు. అందువల్ల చెంగల్రాయుడు, చంద్రబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా న్యాయ, పోలీసు వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు.

టమాటా రైతుకు రానున్నది మంచికాలం



ఇంటిగ్రేటెడ్ టమాటా వాల్యూచైన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శ్రీకారం

వచ్చేనెలలో 4 ప్రాసెసింగ్ కేంద్రాలు ప్రారంభం



మంత్రి కాకాణి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీ మహిళాభివృద్ధి సొసైటీ, లారెన్స్ డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా ప్రతినిధులు

సాక్షి, అమరావతి: దళారుల ప్రమేయం లేకుండా టమాటా రైతులకు కనీస మద్దతు ధర కల్పించి తద్వారా వారి ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో ఇంటిగ్రేటెడ్ టమాటా వాల్యూచైన్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ, లారెన్స్ డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా (ప్రై) లిమిటెడ్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ, ఉద్యాన పంట ఉత్పత్తులకు అదనపు విలువ చేకూర్చడం ద్వారా రైతులకు అదనపు ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. సొసైటీ ద్వారా రూ.110 కోట్ల అంచనాతో 20 ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తోందని తెలిపారు.

నాలుగు ప్రాసెసింగ్ కేంద్రాలను వచ్చే నెలలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కాకాణి చెప్పారు. వీటి నిర్వహణ బాధ్యతలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీవోలకు) అప్పగిస్తామని తెలిపారు. క్లీనింగ్, వాషింగ్, గ్రేడింగ్ తదితర పనులకు ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ, మార్కెటింగ్ చైన్ అభివృద్ధికి లారెన్స్ డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా (ప్రై) లిమిటెడ్ సహకరిస్తాయని తెలిపారు. సాధారణంగా డిమాండు, సప్లయ్‌కి అనుగుణంగా ధరల్లో హెచ్చుతగ్గుల వల్ల కొన్నిసార్లు టమాటా రైతులు, మరికొన్నిసార్లు బహిరంగ మార్కెట్‌లో రేట్లు పెరగడం వలన వినియోగదారులు నష్టపోతున్నారని చెప్పారు. ధర పతనమైనప్పుడు మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం... మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు రైతుల నుంచి కొనుగోలుచేసి రైతుబజార్ల ద్వారా సరసమైన ధరలకు విక్రయిస్తూ వినియోగదారులకు అండగా నిలుస్తుందన్నారు. ఇటీవల కొన్ని జిల్లాల్లో డిమాండుకు మించి దిగుబడుల ఫలితంగా రైతులకు గిట్టుబాటు ధర రాలేదన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 20 ఎఫ్‌పీవోల పరిధిలోని 20 వేలమంది టమాటా రైతులకు మేలు కలుగుతుందన్నారు. రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి, ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ సీఈవో సీఎస్ రెడ్డి, లారెన్స్ డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా (ప్రై) లిమిటెడ్ సీఈవో పి.విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంజనీరింగ్ నోటిఫికేషన్ల'.. తదుపరి చర్యలన్నీ నిలుపుదల

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- కౌంటర్లు దాఖలు చేయాలని ఏపీపీఎస్సీకి నోటీసులు



సాక్షి, అమరావతి: వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు నిలుపుదల చేసింది. అలాగే ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్సీర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో కూడా తదుపరి చర్యలన్నింటినీ స్తంభింపజేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీపీఎస్సీ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ సెప్టెంబర్ 28న నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే రాత పరీక్షను కేవలం ఇంగ్లిష్‌లో మాత్రమే నిర్వహిస్తున్నారని.. ఇది చట్టవిరుద్ధమంటూ నెల్లూరు జిల్లాకు చెందిన బాణాల చరణ్, ప్రకాశం జిల్లాకు చెందిన మద్దుల రాజారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్సీర్ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ సెప్టెంబర్ 26న నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టుల భర్తీకి సైతం ఇంగ్లిష్‌లోనే రాత పరీక్ష నిర్వహించనున్నారని, ఇది చట్టవిరుద్ధమంటూ ప్రకాశం జిల్లాకు చెందిన డి.శివశంకర్‌రెడ్డి, మద్దుల రాజారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వివేకానంద విరూపాక్ష వాదనలు వినిపిస్తూ.. ఇంగ్లిష్‌లో మాత్రమే రాతపరీక్ష నిర్వహించడం అధికార భాషా చట్ట నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇంగ్లిష్‌లోనే పరీక్ష నిర్వహించడం వల్ల తెలుగు మీడియం విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. తెలుగులో కూడా పరీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి రెండు నోటిఫికేషన్లలో తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ట్రాన్స్‌పోర్ట్ సబార్డినేట్ సర్వీసుల్లో అసిస్టెంట్ మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా హైకోర్టు నిలుపుదల చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

అప్పుల్లో.. అడుగునే

▶ మొదటి పేజీ తరువాయి

ఏప్రిల్ 4వతేదీన ఒకేసారి రూ.4,000 కోట్లు, మే 2వ తేదీన రూ.500 కోట్లు, మే 7వతేదీన 500 కోట్లు, మే 14వ తేదీన రూ.1,000 కోట్లు అప్పులు చేసింది. దీంతో మరో రూ.ఆరు వేల కోట్ల మేర చంద్రబాబు సర్కారు అప్పు చేసినట్టైంది. దీంతో చంద్రబాబు హయాంలో చేసిన అప్పులు రూ.2,70,451 కోట్లకు చేరుకున్నాయి.

ఇంతకంటే ప్రామాణికం ఇంకేముంది?

అప్పులపై ఆర్బీఐ నివేదిక కంటే ప్రామాణికం ఏదీ ఉండదని ఆర్థిక శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చాలనే దురుద్దేశంతోనే రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ ఓ వర్గం మీడియా బురద చల్లుతోందని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. అప్పులు ఎన్ని ఉన్నాయో ఆర్బీఐ నివేదికలో స్పష్టంగా చెప్పినందున ఇకనైనా తప్పుడు ప్రచారాన్ని ఆపాలని ఆర్థిక శాఖ వర్గాలు సూచిస్తున్నాయి. ఆ రెండు పత్రికలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ తప్పుడు సమాచారాన్ని ప్రచురిస్తున్నాయని పేర్కొంటున్నాయి. నిపుణుల పేరుతో ఓ వర్గం మీడియా వక్రీకరణలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట చేసిన అప్పుల వివరాలను ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ పత్రంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ఆ పత్రికలు పట్టించుకోకుండా కథనాలు అల్లడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

2022 మార్చి నాటికి రాష్ట్ర అప్పులు

వివరం	అప్పు రూ.కోట్లలో
ఎస్‌డీఎల్ (స్టేట్ డెవలప్‌మెంట్ రుణం)	2,63,483
విద్యుత్ బాండ్లు	8,256
ఇతర బాండ్లు	1,500
నేషనల్ సోషల్ సెక్యూరిటీ ఫండ్	8,945
ఆర్‌బీఐ వేస్ అండ్ మీన్స్	1,500
బ్యాంకులు, నాబార్డు, ఇతర ఆర్థిక సంస్థలు	6,799
మొత్తం అంతర్గత రుణం	2,90,483
కేంద్ర రుణాలు, అడ్వాన్స్‌లు	22,339
ప్రావిడెంట్ ఫండ్	20,917
డిపాజిట్ అడ్వాన్స్‌లు	65,114
కంటిన్‌జెన్సీ ఫండ్	50
మొత్తం అప్పులు	3,98,903

2022 మార్చి నాటికి వివిధ రాష్ట్రాల అప్పుల వివరాలు

రాష్ట్రం	అప్పులు రూ.కోట్లలో
తమిళనాడు	6,59,869
ఉత్తరప్రదేశ్	6,53,308
మహారాష్ట్ర	6,09,000
పశ్చిమ బెంగాల్	5,62,697
రాజస్థాన్	4,77,177
కర్ణాటక	4,61,833
గుజరాత్	4,02,785
ఆంధ్రప్రదేశ్	3,98,903



ఆంధ్రా యూనివర్సిటీలో చెట్ల కూల్చివేతలు ఆపండి

అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) పరిధిలో చెట్ల కూల్చివేతలను వెంటనే ఆపాలని వర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి ఎలాంటి చెట్లను కూల్చడానికి వీల్లేదంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే)జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెట్లను కూల్చివేస్తున్నారని, ఇందుకు సంబంధించి అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, ఇది వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. సహజసిద్ధంగా ఏర్పడిన నీటి కుంటలను సైతం పూడ్చేస్తున్నారని యాదవ్ తన పిల్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన సీజే ధర్మాసనం.. నీటి కుంటలను పూడ్చవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భారీ సంఖ్యలో చెట్లు కూల్చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే చాలా చెట్లను కూల్చేశారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. తక్షణమే చెట్ల కూల్చివేతలను ఆపాలని వర్సిటీ అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

జాకీని అడ్డుకుంది అప్పటి పప్పు, తుప్పు మంత్రులే

- పేజ్ ఇండస్ట్రీస్‌కు టీడీపీ హయాంలో అనేక రాయితీలిచ్చారు
- రూ. 140 కోట్ల భూమిని రూ.2.80 కోట్లకే ఇచ్చారు
- ఈనాడు అసత్య కథనంపై ఎమ్మెల్యే తోపుదుర్తి ధ్వజం



అనంతపురం: జాకీ ఇంటర్నేషనల్ కంపెనీని అడ్డుకున్నది అప్పటి టీడీపీ ప్రభుత్వంలోని పప్పు, తుప్పు మంత్రులేనని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దుయ్యబట్టారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వెళ్లిపోయిన సంస్థతో తనకు ముడిపెట్టి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'ఎక్కడ జాకీ, ఎవరి జాకీ, ఎక్కడుంది జాకీ? ఈ సంస్థకు సంబంధించి తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక్కటైనా నిర్మాణం జరిగిందా' అని ప్రశ్నించారు.

అదో దోపిడీ ఒప్పందం

'జాకీ దుస్తులు ఉత్పత్తి చేసే పేజ్ ఇండస్ట్రీస్ అనే సంస్థకు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.140 కోట్లు విలువ చేసే భూమిని కేవలం రూ.2.80 కోట్లకే ఇచ్చారు. 2017లో భూమి కేటాయించి 2018లో సేల్ డీడ్ చేశారు. మూడేళ్లు నడిపితే సేల బుల్ రైట్స్ ఇచ్చారు. వారు ఉద్యోగాలు కూడా దశలవారీగా ఇస్తామన్నారు. తొలుత వెయ్యి మందికి, మూడేళ్లకు రెండు వేల మందికి, ఆ తర్వాత దశలవారీగా 6 వేలమందికి ఉపాధి కల్పిస్తామని డీపీఆర్‌లో చెప్పారు. ఈ ఫ్యాక్టరీకి విద్యుత్తు సరఫరా, తాగు నీటి సదుపాయానికి కూడా ప్రభుత్వమే డబ్బులు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అంతేకాకుండా క్యాపిటల్ సబ్సిడీ దాదాపు రూ.15 కోట్లు ఇచ్చేలా, వడ్డీ సబ్సిడీ ఆరు శాతం ఏడేళ్ల పాటు.. అంటే రూ.42 కోట్లు, భూమికి రూ.130 కోట్లు, ఇవి కాకుండా వారు చెబుతున్న ప్రకారం 6 వేల మంది ఉద్యోగుల జీతాలపై సబ్సిడీ ఏడేళ్లకు రూ. 130 కోట్లు కలిపి మొత్తం రూ.300 కోట్లకు పైగా దోచిపెట్టేలా ఒప్పందం జరిగింది. తీరా చూస్తే ఆ ప్రాజెక్ట్ విలువ కేవలం రూ.40 కోట్లే. దాని డీపీఆర్ పెంచుకుని రూ.300కోట్లు దోచుకోవాలని పన్నాగం పన్నారు. ఆ సంస్థ 2017లో సివిల్ పనులు ప్రారంభించి, 2018 ఆగస్టు నాటికి ఫ్యాక్టరీ, బిల్డింగ్‌లు పూర్తి చేసి, 2018 అక్టోబరులో ఉత్పత్తి చేస్తామన్నారు. ఇంత హడావుడిగా షెడ్యూలు ఇచ్చిన ఆ సంస్థ ఎందుకు ఉత్పత్తి ప్రారంభించలేదు? బేరాలు కుదరలేదా?' అని ప్రకాష్‌రెడ్డి అన్నారు. 'ఆరోజు పప్పు మంత్రి నారా లోకేష్, తుప్పు మంత్రి పరిటాల సునీత చీకటి ఒప్పందం చేసుకున్నారు. తుప్పు మంత్రి కొడుకు, తమ్ముడు పోటీ పడి జాకీ కంపెనీ కాంపౌండ్ వాల్ నిర్మించాలని అనుకున్నారు. వారిద్దరూ కలిసి 2018 జూన్‌లో వంద మీటర్ల పనులు ప్రారంభించారు. మధ్యలోనే ఆపేశారు. హిందూపురంలో పది ఎకరాల్లో టెక్స్‌పోర్ట్ వచ్చింది. వారికి ప్రైమ్ ల్యాండ్ ఇవ్వలేదే? ఇక్కడేమో జాకీకి ప్రైమ్ ల్యాండ్ ఇచ్చారు. అయినా ఎందుకు రాలేదు? మీ చేతగానితనానికి మాపై విమర్శలు చేస్తారా' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లాల స్థూల ఉత్పత్తిలో 'కృష్ణా' ఫస్ట్

విశాఖపట్నంకు రెండు, విజయనగరానికి 13వ ర్యాంకు

- వ్యవసాయ రంగం ఆదాయంలో కృష్ణాజిల్లాయే టాప్
- పరిశ్రమలు, సర్వీసు రంగాల్లో విశాఖకు అగ్రస్థానం
- ఉమ్మడి జిల్లాల వారీగా వివిధ రంగాల స్థూల ఉత్పత్తి రూపొందించిన ప్రణాళికా శాఖ
- సమతుల్య అభివృద్ధికి జిల్లాల వారీగా గణాంకాలు దోహదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల స్థూల ఉత్పత్తిలో 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కృష్ణాజిల్లా మొదటి ర్యాంకు సాధించింది. విశాఖపట్నం జిల్లా రెండో ర్యాంకులో ఉండగా తూర్పుగోదావరి జిల్లా మూడవ స్థానంలో ఉంది. విజయనగరం జిల్లా చివరి 13వ ర్యాంకులో నిలిచింది. జిల్లాల స్థూల ఉత్పత్తికి (ఆదాయాల) సంబంధించిన గణాంకాలను ప్రణాళికా శాఖ ఇటీవల రూపొందించింది. జిల్లాల ఆదాయ సూచికలు సమతుల్య అభివృద్ధి సాధనకు దోహదపడతాయని ప్రణాళికా శాఖ పేర్కొంది. అలాగే, జిల్లాల మధ్య అసమానతలను పరిశీలించడంతో పాటు ఆయా జిల్లాల అభివృద్ధికి సరైన ప్రణాళికలు రూపొందించడానికి ఈ గణాంకాలు ఉపయోగపడతాయని ప్రణాళికా శాఖ నివేదికలో వివరించింది. జిల్లాల ఆర్థిక స్థితిగతులు, వివిధ రంగాల పనితీరును అంచనా వేయడానికి కూడా ఈ స్థూల ఉత్పత్తి గణాంకాలు అవసరమని ప్రణాళికా శాఖ తెలిపింది.

వ్యవసాయ అనుబంధ రంగాల్లోనూ..

మరోవైపు.. ప్రస్తుత ధరల ప్రకారం 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో 14.64 శాతంతో కృష్ణాజిల్లా అగ్రస్థానంలో ఉంది. పశ్చిమ గోదావరి జిల్లా 14.22 శాతంతో రెండో ర్యాంకు, తూర్పు గోదావరి జిల్లా 10.00 శాతంతో మూడోస్థానంలో ఉంది. అలాగే, పారిశ్రామిక రంగంలో విశాఖ జిల్లా 18.43 శాతంతో మొదటి ర్యాంకులో, 13.82 శాతంతో తూర్పుగోదావరి జిల్లా రెండవ ర్యాంకులో ఉండగా చిత్తూరు జిల్లా 9.33 శాతంతో మూడవ ర్యాంకులో ఉంది. ఇక సేవా రంగంలో 15.69 శాతంతో విశాఖ జిల్లా మొదటి ర్యాంకులో ఉంది. కృష్ణాజిల్లా 14.98 శాతంతో రెండో ర్యాంకులో ఉండగా.. తూర్పుగోదావరిజిల్లా 9.51 శాతంతో మూడో స్థానంలో ఉంది.

2020-21లో ప్రస్తుత ధరల ప్రకారం రంగాల వారీగా ఆదాయ విలువలు.. (రూ.కోట్లలో)

జిల్లా	స్థూల ఉత్పత్తి	ర్యాంకు	వ్యవసాయ అనుబంధ	ర్యాంకు	పారిశ్రామిక రంగం	ర్యాంకు	సర్వీసెస్ రంగం	ర్యాంకు
శ్రీకాకుళం	39,042	12	10,396	13	8,987	12	16,547	12
విజయనగరం	35,385	13	13,056	12	4,520	13	14,988	13
విశాఖపట్నం	1,24,013	2	16,089	10	36,413	1	61,625	1
తూర్పుగోదావరి	1,07,532	3	34,319	3	27,301	2	37,339	3
పశ్చిమగోదావరి	97,040	4	48,814	2	13,530	6	26,961	6
కృష్ణా	1,36,875	1	50,249	1	16,895	4	58,820	2
గుంటూరు	87,025	5	27,463	5	16,200	5	36,326	4
ప్రకాశం	59,661	10	24,488	8	10,587	10	19,830	10
నెల్లూరు	61,698	9	23,263	9	11,479	8	22,037	9
చిత్తూరు	82,470	6	26,415	6	18,442	3	31,039	5
వైఎస్సార్ కడప	49,104	11	15,626	11	11,165	9	18,399	11
అనంతపురం	68,842	7	27,478	4	9,681	11	26,195	7
కర్నూలు	65,688	8	25,587	7	12,311	7	22,554	8

బాబుకు, టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

- వచ్చే ఎన్నికల్లో ప్రజా తీర్పు అదే
- ఆ తర్వాత 'ఇదేం ఖర్మరా బాబూ' అని చంద్రబాబు, లోకేశ్ ఏడుస్తారు
- ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: రాబోయే ఎన్నికలు చంద్రబాబుకే కాదు టీడీపీకి కూడా చివరివని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజా తీర్పు కూడా ఇదే విధంగా వస్తుందన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును చూసి 'ఇదేం ఖర్మరా బాబూ' అని చంద్రబాబు, లోకేష్ ఏడుస్తారని చెప్పారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో చంద్రబాబు పర్యటన సినిమా షూటింగ్‌లా ఉందని అన్నారు. పార్టీ కార్యకర్తలను ముందుగానే తరలించి ఇరుకు సందుల్లో సభలు పెట్టారని చెప్పారు. సీఎం జగన్‌ను తిట్టేందుకు, అవమానించేందుకు ఈ పర్యటనలు అని అన్నారు. కర్నూలులో హైకోర్టు గురించి ప్రశ్నించిన లాయర్లను గుడ్డలూడదీసి కొడతాననడం బాబు శాడిజానికి నిదర్శనమన్నారు. బాబు సీఎం కాకపోయినా ప్రజలకు జరిగే నష్టం ఏమీ లేదన్నారు. వైఎస్ జగన్‌ను జీవితకాల ముఖ్యమంత్రిగా ప్రజలు భావిస్తున్నారని చెప్పారు.

గుడివాడ నుంచి మళ్లీ గెలుస్తా

గుడివాడ నియోజకవర్గ ప్రజలు తనకు అన్ని వేళలా అండగా ఉంటారని నాని అన్నారు. గుడివాడలో టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు, లోకేశ్ లేదా ఎవరు పోటీ చేసినా వైఎస్సార్ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానన్నారు. ప్రత్యర్థులు కుల సంఘాల చందా డబ్బులు కోట్లు కుమ్మరించినా తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

'స్మార్ట్' గైడ్

- ప్రపంచంలో 71 శాతం మందికి ప్రయాణ మార్గదర్శిగా స్మార్ట్ ఫోన్
- మన దేశంలో ఫోన్ సాయంతోనే 87 శాతం మంది టూర్ ప్లాన్

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా 'స్మార్ట్ ట్రావెలింగ్' కొత్తపుంతలు తొక్కుతోంది. ప్రయాణికులు స్మార్ట్ ఫోన్‌ను ట్రావెల్ టూల్‌గా ఉపయోగిస్తూ దేశ, విదేశాలను చుట్టేస్తున్నారు. మధ్యవర్తులు, టూర్ ఆపరేటర్లు లేకుండానే ఒక్క క్లిక్‌తో అరచేతిలో సమాచారాన్ని వీక్షిస్తూ ప్రయాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అంతర్జాతీయంగా 18 నుంచి 64 ఏళ్ల వయసు గల ప్రయాణికుల్లో 71% మంది తమ పర్యటనల కోసం స్మార్ట్ ఫోన్‌లపై ఆధారపడుతున్నారు. భారతదేశంలో అత్యధికంగా 87% మంది ప్రయాణికులు స్మార్ట్ ఫోన్ సాయంతోనే తమ ప్రయాణాలు చేస్తున్నట్లు గూగుల్, ఫోకస్ రైట్ సంస్థల అధ్యయనంలో వెల్లడైంది. ఫోన్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లోని వాయిస్ మోడ్‌లో సూచనలు, టికెట్ బుకింగ్‌లో డిజిటల్ అసిస్టెంట్ సేవలు సులభంగా లభిస్తున్నాయి. పర్యాటకులు ఎంపిక చేసుకున్న ప్రదేశాలకు నావిగేషన్ సాయంతో తేలికగా చేరుకుంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ట్రావెల్ కంపెనీలు కూడా కస్టమర్ జర్నీకి అనుగుణంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) సేవలను ప్రవేశపెడుతున్నాయి.

పర్యాటక రంగానికి ఊతం...

భారతదేశం నుంచి 2024 నాటికి సుమారు 8 కోట్ల మంది విదేశీ పర్యటనలు చేస్తారని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆసియా పసిఫిక్ డెస్టినేషన్ ఫోర్‌కాస్ట్–2022–24 రిపోర్టు ప్రకారం రానున్న రెండేళ్లలో 1.34 కోట్ల మంది విదేశీయులు భారతదేశాన్ని సందర్శిస్తారని అంచనా. దీనివల్ల కోవిడ్ వల్ల దెబ్బతిన్న పర్యాటక రంగానికి ఊతం లభిస్తుందని భావిస్తున్నారు.

ప్రచారంలో డిజిటల్ పోటీ...

కేరళ, మధ్యప్రదేశ్, గోవా, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ఆన్‌లైన్ వేదికగా విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే కేరళ ప్రభుత్వం వర్చువల్ ట్రావెల్ గైడ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. క్యూఆర్ కోడ్ ద్వారా టూరిజం లొకేషన్లను సులభంగా తెలుసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లలో వాటిని విరివిగా ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) కూడా సాంకేతిక వ్యవస్థను మెరుగుపరుస్తోంది. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్)ను అభివృద్ధి చేస్తోంది. తద్వారా పర్యాటకులు కచ్చితత్వంతో తమ ప్రయాణాలను ఎంపిక చేసుకునేలా సేవలు అందించనుంది. స్థానిక కళలు, చేతివృత్తులను ప్రోత్సహించేలా పర్యాటక రంగానికి అనుసంధానిస్తూ జీఐఎస్ వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నారు.

సాహో 'సౌర'!

సాక్షి, అమరావతి: పెరుగుతున్న సౌరవిద్యుత్ ఉత్పత్తి ప్రపంచం దేశాల ఆర్థిక స్థితిగతులపై ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా భారత్‌తో సహా చైనా, జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్‌లలో శిలాజ ఇంధన కొనుగోలు వ్యయాన్ని తగ్గిస్తోంది. దీంతో ప్రస్తుత ఉత్పత్తి కంటే ఆరురెట్లు పెరుగుదలతో 2030 నాటికి 280 గిగావాట్ల లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోంది. సోలార్ ఉత్పత్తిలో మనదేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద దేశంగా అవతరించగా, దేశంలోని మొదటి మూడురాష్ట్రాల్లో ఏపీకి స్థానం లభించింది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో 47.64 బిలియన్ యూనిట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి జరిగింది. ఈ కాలానికి 4.2 బిలియన్ల ఇంధన ఖర్చులను తగ్గించడానికి సోలార్ విద్యుత్ దోహదపడింది.



ఇద్దరు అత్యంత శక్తిమంతమైన యోధులు...
సహనం, సమయం.
– లియో టాల్‌స్టాయ్

సాక్షి
మంగళవారం, నవంబర్, 22

ఉత్తమాటల ఊరేగింపు

ఆచరణలో ఆశించిన పురోగతి లేనప్పుడు మాటల ఆర్భాటాల వల్ల ఉపయోగం ఏముంటుంది! ఈజిప్టులోని రేవుపట్నమైన షర్మ్ ఎల్–షేక్‌లో ఐక్యరాజ్య సమితి (ఐరాస) సారథ్యంలోని 'పర్యావరణ సమస్యలపై భాగస్వామ్య పక్షాల 27వ సదస్సు' (యుఎన్–కాప్–27) ఆదివారం ముగిశాక అదే భావన కలుగుతోంది. 2015 నాటి ప్యారిస్ ఒప్పందం కింద పెట్టుకున్న లక్ష్యాలపై వేగంగా ముందుకు నడిచేందుకు ప్రపంచ దేశాలు కలసి వస్తాయనుకుంటే అది జరగలేదు. అది ఈ 'కాప్–27' వైఫల్యమే. శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించడంపై స్పష్టమైన హామీ లభించక పోవడంతో సదస్సుతో అందివచ్చిన అవకాశం చేజారినట్టయింది. అలాగని అసలు శుభవార్తలేమీ లేవని కాదు. కాలుష్యకారక ధనిక దేశాల వల్ల పర్యావరణ మార్పులు తలెత్తి, ప్రకృతి వైపరీత్యాలకు బలవుతున్న అమాయకపు దేశాల కోసం 'నష్టపరిహార నిధి' విషయంలో గత ఏడాది ఓ అంగీకారం కుదిరింది. దానిపై ఈసారి ఒక అడుగు ముందుకు పడింది. అది ఈ సదస్సులో చెప్పుకోదగ్గ విజయమే. వెరసి, కొద్దిగా తీపి, చాలావరకు చేదుల సమ్మిశ్రమంగా ముగిసిన సదస్సు ఇది.

సదస్సు ఫలితాలపై ఐరాస ప్రధాన కార్యదర్శి తీవ్ర నిరాశ వ్యక్తం చేసింది అందుకే! పుడమితల్లి ఇప్పటికీ 'అత్యవసర గది'లోనే ఉంది. గ్రీన్‌హౌస్ వాయువులను తక్షణమే గణనీయంగా తగ్గించాల్సిన అవసరాన్ని 'కాప్ గుర్తించలేదు' అన్నది ఆయన మాట. అదే భావన ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తోంది. పారిశ్రామికీకరణ అనంతరం విపరీతంగా కర్బన ఉద్గారాలకు కారణమైన ధనిక దేశాలు 'నష్టపరిహార నిధి'కి ఒప్పుకోవడం కూడా ఆషామాషీగా ఏమీ జరగలేదు. 134 వర్ధమాన దేశాల బృందమైన 'జి–77' ఈ అంశంపై కట్టుగా, గట్టిగా నిలబడడంతో అది సాధ్యమైంది. ఈ నిధి ఆలోచన కనీసం 3 దశాబ్దాల క్రితం నాటిది. ఇన్నాళ్ళకు అది పట్టాలెక్కుతోంది. దాన్నిబట్టి వాతావరణ మార్పులపై అర్థవంతమైన బాధ్యత తీసుకోవడానికి ధనిక దేశాలు ఇప్పటికీ అనిష్టంగానే ఉన్నాయని స్పష్టమవుతోంది. పైపెచ్చు, 'వాతావరణ బాధ్యతల నాయకత్వం' వర్ధమాన ప్రపంచమే చేపట్టాలన్న అభ్యర్థన దీనికి పరాకాష్ఠ.

చిత్రమేమిటంటే – ఈ నష్టపరిహార నిధిని ఎలా ఆచరణలోకి తెస్తారన్న వివరాలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం! ఆ నిధిని ఎలా సమకూర్చాలి, ఎప్పటికి అమలులోకి తేవాలనేది పేర్కొనలేదు. వాటిని ఖరారు చేయడానికి ఒక కమిటీని వేస్తున్నట్టు సదస్సు తీర్మానంలో చెప్పారే తప్ప, దానికీ తుది గడువేదీ పెట్టకపోవడం విడ్డూరం. అంతేకాక, దీర్ఘకాలంగా తాము చేసిన వాతావరణ నష్టానికి బాధ్యత వహించడానికి ఇష్టపడని ధనిక దేశాలు వర్తమాన ఉద్గారాలపైనే దృష్టి పెట్టనున్నాయి. ఆ రకంగా వర్ధమాన దేశాలకు ఇది కూడా దెబ్బే. ఇక, పారిశ్రామికీకరణ ముందు నాటి కన్నా 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ మేరకే భూతాపోన్నతిని నియంత్రించాలని చాలాకాలంగా 'కాప్'లో చెప్పుకుంటున్న సంకల్పం. ఈసారీ అదే లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. ఆ లక్ష్యాన్ని సాధించాలంటే దశలవారీగా శిలాజ ఇంధన వినియోగాన్ని ఆపేయడం కీలకం. గ్లాస్గోలో జరిగిన గడచిన 'కాప్–26'లోనే ఇష్టారాజ్యపు బొగ్గు వినియోగాన్ని దశలవారీగా ఆపేందుకు అంగీకరించారు. తీరా దానిపై ఇప్పటికీ ఎలాంటి ఒప్పందం కుదరనే లేదు.

శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించడంపై భారత్ తన వాణి బలంగా వినిపిస్తూ వచ్చింది. పునరుద్ధరణీయ ఇంధనాల వైపు వెళతామంటూ మన దేశం ఇప్పటికే గణనీయమైన హామీలిచ్చింది. కాకపోతే, ఒక్క బొగ్గే కాకుండా చమురు, సహజ వాయువులను సైతం శిలాజ ఇంధనాల్లో చేర్చాలని పట్టుబట్టింది. చివరకు మన డిమాండ్ గురించి ఎలాంటి ప్రస్తావనా లేకుండానే ముసాయిదా ఒప్పందం జారీ అయింది. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం నేపథ్యంలో ఇంధన సంక్షోభం తలెత్తడంతో, యూరోపియన్ దేశాలు మళ్ళీ బొగ్గుపైనే ఆధారపడే విధానాలకు తిరిగొచ్చాయి. శిలాజ ఇంధన వినియోగ లాబీదే పైచేయిగా మారింది. ఇది చాలదన్నట్టు వచ్చే ఏడాది జరిగే 'కాప్' సదస్సుకు చమురు దేశమైన యూఏఈ అధ్యక్షత వహించనుంది. కాబట్టి, భూతాపోన్నతిని నియంత్రించేలా ఉద్గారాలను తగ్గించడమనే లక్ష్యం కాస్తా చర్చల్లో కొట్టుకుపోయింది.

నవంబర్ 18కే ఈ సదస్సు ముగియాల్సి ఉంది. అయితే, పలు కీలక అంశాలపై ఏకాభిప్రాయం కుదరక సదస్సును మరో రోజు పొడిగించారు. కానీ, సాధించినదేమిటంటే 'నిధి' ఏర్పాటు తప్ప చెప్పుకోవడానికి ఏమీ లేని పరిస్థితి. ఆ మాటకొస్తే, ఒక్క కరోనా ఉద్ధృతి వేళ మినహా... 1995లో బెర్లిన్‌లోని 'కాప్–1' నుంచి ఈజిప్టులోని ఈ ఏటి 'కాప్–27' వరకు ఇన్నేళ్ళుగా కర్బన ఉద్గారాలు నిర్దయగా పైపైకి ఎగబాకుతూనే ఉన్నాయి. మన నివాసాన్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. ఈ సదస్సులతో గణనీయ లాభాలుంటాయనే అత్యాశ లేకున్నా, తాజా 'కాప్–27' అంచనాలను అధఃపాతాళానికి తీసుకెళ్ళింది. నియంతృత్వ పాలనలోని దేశంలో, ప్రపంచంలోని అతి పెద్ద ప్లాస్టిక్ కాలుష్యకారక సంస్థ స్పాన్సర్‌గా, 600 మందికి పైగా శిలాజ ఇంధన సమర్థక ప్రతినిధులు హాజరైన సదస్సు – ఇలా ముగియడం ఆశ్చర్యమేమీ కాదు. ఇప్పటి వరకు జరిగిన సదస్సుల్లో ఇదే అతి పెద్ద ఫ్లాప్ షో అన్న మాట వినిపిస్తున్నది అందుకే. ఈ పరిస్థితి మారాలి. ఏటేటా పాడిందే పాడుతూ, వివిధ దేశాధినేతల గ్రూప్ ఫోటోల హంగామాగా 'కాప్' మిగిలిపోతే కష్టం. వట్టి ఊకదంపుడు మాటల జాతరగా మారిపోతే మన ధరిత్రికి తీరని నష్టం.

సామాన్యుడి కోసం ధర్మపీఠం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల తన ప్రమాణ స్వీకారంలో జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నిర్మొహమాటంగా చేసిన ఒక ప్రకటన దేశ ప్రజల్లో ఆశలు రేకెత్తించేదిగా ఉంది. పాలక విధానాల ఫలితంగా దేశం నేడు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా దేశ దిశాగతిని మార్చడానికి తోడ్పడగల నిర్ణయాలు చేసే అవకాశం తన స్థాయిలో ఉందని ఆ ప్రకటన ద్వారా ఆయన సూచనప్రాయమైన భరోసాను ఇచ్చారు. తన ఎదుగుదలలో గాంధీ, నెహ్రూల ప్రజాస్వామ్య భావాల ప్రభావమే గాక కారల్ మార్క్స్ రూపొందించిన ప్రపంచ ప్రసిద్ధ మేనిఫెస్టో ప్రభావం కూడా ఉండి ఉండవచ్చునని అనిపిస్తోంది! కనుకనే చంద్రచూడ్ 'సామాన్య పౌరుల ప్రయోజనాల పరిరక్షణే' తన ధ్యేయంగా బాహాటంగా ప్రకటించుకోగలిగారు.

"పేదసాదల కోసం మా ప్రభుత్వం అన్నీ చేస్తోందని మన పాలకులు చెప్పుకోవచ్చు గాక. కానీ అలాంటి 'కోతలు' బ్రిటిష్ పాలకులు కూడా కోస్తూండేవారు. కానీ అసలు నిజం – పేదల ప్రయోజనాలు మాత్రం స్వతంత్ర భారత ప్రభుత్వం కూడా నెరవేర్చడం లేదు. ఈ సత్యాన్ని మన పాలకులు హుందాగా అణకువతో ఒప్పుకుని తీరాలి"

– మహాత్మాగాంధీ (1947 డిసెంబర్)

"వెయ్యిన్నొక్క కత్తుల కన్నా ప్రజాభిప్రాయం అనేది అత్యంత బలమైన ఆయుధం. హైందవాన్ని క్షుద్ర పూజాదికాలతో రక్షించుకోలేము. పరాయి పాలన నుంచి విముక్తి పొందిన దేశం మనది. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కంటికి పాపలా కాపాడుకోవాలి. ఎలా? నీలో మానవత్వం, ధైర్య సాహసాలు, నిరంతర జాగరూకత ఉన్నప్పుడే నీ ధర్మం నీవు నెరవేర్చగలుగుతావు. ఈ అప్రమత్తత మనలో కొరవడిన నాడు, మనం అత్యంత ప్రేమతో సాధించుకున్న స్వాతంత్ర్యం కాస్తా చేజారిపోతుంది. కానీ దురదృష్టవశాత్తూ దేశంలో ప్రస్తుత అశాంతికి అంతటికీ కొందరు కారణమని వింటున్నాను. భారత దేశం హిందువులకు ఎంతగా పుట్టినిల్లో, ముస్లిములకూ అంతే పుట్టినిల్లు అని మరచిపోరాదు. అలాగే ఎవరికి వారు తమ మతమే గొప్పదనీ, అదే నిజమైనదనీ భావించడం తప్పు. ఈ భావననే చిన్నప్పటి నుంచీ పిల్లల్లో కూడా నూరిపోయడం వల్ల అదే నిజమన్న ధోరణిని వారిలో పెంచిన వారవుతున్నారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకునేదే నిజమైన ప్రజా ప్రభుత్వం. ప్రజల దారిద్ర్యాన్ని, నిరుద్యోగ పరిస్థితిని పట్టించుకోని పాలకులు ఒక్క రోజు కూడా అధికారంలో ఉండటానికి వీలు లేదు".

– మహాత్మాగాంధీ (అదే ఏడాది మరొక సందర్భంలో)

"దేశం కోసమే నా తపన అంతా. 365 రోజులూ పని చేస్తున్నా. నేను పునాది రాయి వేసిన ప్రాజెక్టులను నేనే ప్రారంభిస్తున్నా. ఇప్పుడు ఎన్నికలు లేకపోయినా అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం".

– ప్రధాని నరేంద్రమోదీ (19.11.2022)

'దేశం కోసమే నా తపనంతా..' అనేంతగా 'ఆత్మవిశ్వాసం' కొందరిలో పెల్లుబికి వస్తున్న తరుణంలో సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సందర్భంగా ఆయన నిర్మొహమాటంగా చేసిన ఒక ప్రకటన దేశ ప్రజల్ని, ప్రజాస్వామ్యవాదుల్ని ఆలోచింపజేసేదిగా ఉంది. జస్టిస్ చంద్రచూడ్ 2024 నవంబర్ 10 వరకు ఆ పదవిలో ఉంటారు. ఆ లోపుగా.. దేశం నేడు పాలక విధానాల వల్ల ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా దేశ దిశాగతిని మార్చడానికి ఆయన తన స్థాయిలో తోడ్పడగల నిర్ణయాలు చేసే అవకాశం ఉంది. ఆయన ప్రకటన సూచన ప్రాయంగా అదే తెలియజేస్తోంది. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన భరోసాను పాలకవర్గాలు హరించేస్తున్న సమయంలో చంద్రచూడ్.. 'ఆధార్' పత్రం పేరిట పాలకులు పౌరహక్కుల్ని కత్తిరించడానికి చేస్తున్న ప్రయత్నాలను ఏనాడో ఎదుర్కొని అడ్డుకట్ట వేశారు. 'ఆధార్' కార్డు పేరిట పౌరులకు ప్రశ్నించే హక్కును హరించడం ఎలా సాధ్యమో ఆయన నిరూపించారు. 'ఆధార్' కార్డు చెల్లుతుందంటూ ధర్మాసనంలోని మిగతా నలుగురు సభ్యులు మెజారిటీతో నిర్ణయించగా, అది ఎలా రాజ్యాంగ విరుద్ధమో నిరూపించి నెగ్గుకొచ్చిన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్! కనుకనే ఇప్పుడు దేశ ప్రధాన న్యాయమూర్తిగా చంద్రచూడ్ పదవీ స్వీకారం చేసిన రోజున కూడా 'సామాన్యుల సేవే తన తొలి ప్రాధాన్యమని' ప్రకటించారు. ఆ ప్రకటనలో ఆయన పాలకులకు చేదోడువాదోడుగా ఉపయోగపడే 'సీల్డ్ కవర్' తతంగానికి కోర్టులు స్వస్తి చెప్పించాలని కూడా సూచించారు. న్యాయ వ్యవస్థపై కూడా ప్రజల నమ్మకం సడలిపోతున్న సమయంలో ఆయన ఇస్తున్న భరోసా నమ్మకాన్ని కలిగిస్తోంది.

రెండో మాట



చంద్రచూడ్ ఎదుగుదలలో గాంధీ, నెహ్రూల ప్రజాస్వామ్య భావాల ప్రభావమే గాక వర్గరహిత సామాజిక వ్యవస్థ ప్రతిష్ఠాపన లక్ష్యంగా ప్రపంచ శ్రమజీవుల ప్రయోజనాల రక్షణకు కారల్ మార్క్స్ రూపొందించిన ప్రపంచ ప్రసిద్ధ మేనిఫెస్టో ప్రభావం కూడా ఉండి ఉండవచ్చు! కనుకనే చంద్రచూడ్ 'ప్రతి అంశంలోనూ సామాన్య పౌరుల ప్రయోజనాల పరిరక్షణే' తన ధ్యేయంగా బాహాటంగా ప్రకటించుకోగలిగారు.

ఎలాగంటే ధనికవర్గంలో జన్మించిన ఫ్రెంచి మహా రచయిత బాల్జాక్ ఫ్రెంచి సామాజిక పరిణామ క్రమాన్నే సామాన్య ప్రజల ప్రయోజనాల రక్షణ కోసం మార్చేసిన వాడు. అందుకే మార్క్స్ అతణ్ణి సమాజ వాస్తవిక పరిస్థితులకు అద్దంపట్టిన మహా రచయితగా వర్ణించాడు. ధనిక, పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలు క్రమంగా ఏ దారుణ పరిస్థితుల వైపుగా సామాజిక వ్యవస్థల్ని నడిపిస్తాయో తన రచనల ద్వారా ధనికుడైన బాల్జాక్ వర్ణించడాన్ని మార్క్స్ ప్రశంసించాడు.

అంతేగాదు, ధనిక వర్గ నాగరికతకూ, దాని అధీనంలో జరిగే నేరాలకూ మధ్య సంబంధ బాంధవ్యాలు ఎలా ఉంటాయో కూడా మార్క్స్ అనేక సదృశాలతో నిరూపించాడు. అలాంటి ధనిక వర్గ సమాజాల్లో 'ఎవరికివారే యమునాతీరే'గా ప్రజావసరాలతో నిమిత్తం లేకుండా జరిగే వస్తూత్పత్తి లాగానే నేరగాళ్లు వరుసగా నేరాలు సృష్టిస్తుంటారు. వాటితోపాటు నేర చట్టానికి దోహదం చేస్తారు. ఈ క్రమంలోనే నేర చట్టాన్ని గురించి ప్రొఫెసర్ గారు ఉపన్యాసాలు దంచేయడానికి ముందుకొస్తారు. ఆ తర్వాత ఆ ఉపన్యాసాలన్నింటినీ సంకలనం చేసుకుని ఓ గ్రంథం సిద్ధం చేసుకుని దాన్ని జనరల్ మార్కెట్‌లోకి ఓ ప్రత్యేక వస్తువు (కమొడిటీ)గా విడుదల చేస్తాడు. అమ్మి సొమ్ము చేసుకుంటాడు! అంతేనా, అలాంటి సమాజంలోని నేరగాడు మొత్తం పోలీస్ వ్యవస్థ సృష్టికి, తద్వారా క్రిమినల్ జస్టిస్, ఆ పిమ్మట జడ్జీలు, ఉరి తీసే తలార్లు, ఆ పిమ్మట జ్యూరీ వ్యవస్థ వగైరాల ఏర్పాటుకు కారణమౌతాడు. అటుపైన 'తాటి తోనే దబ్బనం' అన్నట్టుగా చిత్రహింసలు మొదలై, ఆ హింసాకాండ నిర్వహణకు గానూ అందుకు తగిన వృత్తి నిపుణుల సృష్టి అవసరం అవుతుంది (ఇలాంటివారు అవసరం అవబట్టే రా.వి. శాస్త్రి 'సారో కథలు', 'సారా కథలూ' రాయాల్సి వచ్చింది).

అందుకే మార్క్స్ అంటాడు: "శ్రామిక వర్గాలు, సంపన్న వర్గాలు భిన్న ధ్రువాలు. రెండూ ప్రైవేట్ ఆస్తుల సృష్టి కారకులే!" అని. అందువల్ల ఈ రెండు ఒకే నాణేనికి రెండు ముఖాలని సరిపెట్టుకుంటే చాలదు. ప్రైవేట్ ఆస్తి ప్రత్యేక సంపదగా తనకు తాను రక్షించుకొనక తప్పదు, అలాగే శ్రామిక జీవులూ తమను తాము రక్షించుకొనక తప్పదు. కనుకనే వారిది అమానుషమైన దుఃస్థితి. ఈ స్థితిలోనే ప్రైవేట్ ఆస్తిపరుడు స్వార్థపరుడు అవుతాడు, కాగా తన అమానుషమైన దుఃస్థితిని వదిలించు కోవాలనుకున్న శ్రమజీవి సమాజానికి శత్రువుగా కన్పిస్తాడు. కనుకనే శ్రమజీవిని దోచుకోవడంపై ఆధారపడిన ప్రైవేట్ ఆస్తి రద్దు అయితేనే శ్రమజీవులకు బతుకు. అయితే అసమ సమాజ వ్యవస్థలోని అమానుష జీవన పరిస్థితులు రద్దు కాకుండా మాత్రం శ్రామికులకు శాశ్వత విమోచనం దుర్లభమని మార్క్స్–ఎంగెల్స్‌లు నిరూపించారు (కలెక్టెడ్ వర్క్స్: వాల్యూమ్ 4).

అందువల్ల జస్టిస్ చంద్రచూడ్‌ను 'న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం కొనసాగేలా మీరు ఏం చర్యలు తీసుకొంటారన్న' ప్రశ్నకు 'చేతల్లోనే చూపిస్తానని' భరోసా ఇచ్చారు. అంతవరకూ ప్రజల అసమ్మతిని ప్రజాస్వామ్యం మనుగడకు రక్షణ కవచంగా ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టును నిరంతరం తీర్చిదిద్దగలరని ఆశిద్దాం. సామాన్యుడికే తన 'పెద్ద పీట' అని చాటిన చంద్రచూడ్ దేశ దిశాగతిని తీర్చిదిద్దేందుకు తనకు సంక్రమించిన అనితరసాధ్యమైన అవకాశాన్ని 2024 ఎన్నికల సంవత్సరాని కన్నా ముందస్తుగానే తగినట్టుగా ఉపయోగించుకోగలరని ఆశిద్దాం!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏది ముఖ్యం?!



అఫ్తాబ్ పూనావాలా, ప్రిన్స్ యాదవ్ ఇద్దరూ దుష్టత్వానికి రెండు ముఖాలు. వారు ఏ మతానికి చెందినవారో తెలుసుకోవాలని నాకు లేదు. వారు పాల్పడిన ఘోరమైన నేరానికి మాత్రం శిక్ష పడాల్సిందే! (ఢిల్లీలో అఫ్తాబ్ తరహాలో ప్రిన్స్ యాదవ్ అనే యూపీ యువకుడు తన స్నేహితురాలిని దారుణంగా హతమార్చడంపై.)

– అవినాశ్ సింగ్, సోషల్ ఆంత్రప్రెన్యూర్

మిమ్మల్నెలా నమ్మాలి?!



ఢిల్లీ జల మండలి నీళ్లకు బదులుగా మృత్యువును పంపిణీ చేస్తోంది. కేజ్రీవాల్, ఇకనైనా మీరు మీ ముఖంలో నన్నగిల్లిన ఆత్మవిశ్వాసపు అతి ప్రదర్శనను కట్టి పెట్టండి. ఢిల్లీ కాలుష్యంలో ఉంది. మీ మంత్రులు అవినీతిలో ఉన్నారు. ఇక మీరేమో దేశ ప్రజల్ని మభ్య పెట్టడానికి ఢిల్లీని వదిలి ఒక్కో రాష్ట్రంలో అబద్ధాల గాలి మేడలు నిర్మిస్తూ తిరుగుతున్నారు.

– రాఖీ సేథ్, మెడికో

రామన్ కాంతి



సరైన ప్రశ్నలు అడగండి. ప్రకృతి తన రహస్యాలకు తలుపు తెరుస్తుంది' అన్న సీవీరామన్ మాటలు మన శాస్త్రవేత్తలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం. ఆయన చేసిన కాంతి ప్రసరణ స్వభావ ఆవిష్కరణ భౌతిక శాస్త్ర రంగంలోనే ఒక మైలురాయి వంటి క్షణం. ఆయన పుణ్యతిథి సందర్భంగా నివాళులు.

– పెమా ఖండూ, అరుణాచల్ ప్రదేశ్ సీఎం

టెలీ-విజన్



దేశ భద్రత, శాంతి సామరస్యాలకు విఘాతం కలిగిస్తున్న బెదిరింపులను ప్రపంచం దృష్టికి తీసుకువెళ్లడంలో టెలివిజన్ ప్రాధాన్యం, ప్రభావం పెరుగుతూ వస్తోంది. ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి అవసరమైన విధాన నిర్ణయాలపై టీవీ చర్చలు అత్యవసరతను సంతరించుకుంటున్నాయి. హ్యాపీ 'వరల్డ్ టెలివిజన్ డే' (21 నవంబర్).

– మానస్ కృష్ణకాంత్, సివిల్ సర్వెంట్

అవును... అభివృద్ధికి అడ్డా ఆంధ్రప్రదేశ్

అభిప్రాయం



వి. వి. ఆర్. కృష్ణంరాజు

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అధోగతిపాలైందని, అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందని ప్రతిపక్ష నాయకులు, కొందరు కుహనా మేధావులు ఆరోపిస్తున్నారు. అయితే రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా వృద్ధి చెందుతోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెబు తోంది. 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్ 2021 – 2022' పేరుతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నవంబర్ రెండో వారంలో విడుదల చేసిన నివేదిక ప్రతిపక్షాలు, ఇతరులూ చేస్తున్న ఆరోపణలు అవాస్తవం అని తేల్చి చెప్పింది.

ఆంధ్రప్రదేశ్‌లో జగన్ నేతృత్వంలోని వైసీపీ 2019 మే 30వ తేదీన అధికారంలోకి వచ్చింది. తర్వాతి కొద్ది కాలానికే కోవిడ్ కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమయ్యాయి. అయితే ఈ కోవిడ్ సంక్షోభాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా అధిగమించిందనే చెప్పాలి. కోవిడ్‌తో దేశ జీడీపీ 7.3 శాతం క్షీణిస్తే ఏపీలో ఈ క్షీణత 2.58 శాతం మాత్రమే నమోదైంది. అయితే అనతి కాలంలోనే పుంజుకుని 2021–22లో భారత దేశం 8.7 శాతం వృద్ధి రేటు సాధించగా ఆంధ్రప్రదేశ్ 11.43 శాతంతో దేశంలో అత్యధిక ఆర్థికాభివృద్ధిని సాధించిన రాష్ట్రంగా ఎదిగింది. అంతేకాకుండా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో వరుసగా మూడేళ్ళపాటు మొదటి స్థానంలో ఉంది.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై సందేహాలు వ్యక్తం చేస్తున్న వారికి ఆర్‌బీఐ నివేదికలో సమగ్రమైన సమాధానాలు లభిస్తాయి. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న చివరి ఏడాదిలో సాధించిన అభివృద్ధినీ, జగన్ మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధినీ ఆర్‌బీఐ నివేదిక ఆధారంగా పరిశీలిస్తే రాష్ట్రంలో అన్ని రంగాల్లో సంతృప్తికరమైన పురోగతిని గమనించవచ్చు. ఉదాహరణకు 2018–19లో సామాజిక రంగానికి చంద్రబాబు ప్రభుత్వం రూ. 76,759 కోట్ల రూపాయలు వ్యయం చేస్తే, 2021–22లో జగన్ జగన్ ప్రభుత్వం రూ.1,13,434 కోట్లు వ్యయం చేసింది. సంక్షేమ ఫలాలను అందించే ఈ వ్యయం విషయంలో ఏపీ దేశంలో ఆరో స్థానంలో ఉంది.

స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 2020–2021లో రూ. 10,14,374 కోట్లు కాగా అది 2021–2022 నాటికి రూ. 12,01,736 కోట్లకు పెరిగింది. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం చంద్రబాబు సీఎంగా ఉన్న 2018–19లో రూ. 1,54,031 గా ఉంది. అది 2020–21 నాటికి రూ. 1,76,707కూ, 2021–22 నాటికి రూ. 2,07,717కు పెరిగింది. ఇదే సమయంలో దేశంలో తలసరి ఆదాయం రూ. 1,26,855 నుంచి రూ. 1,49,848 కు మాత్రమే పెరిగింది. అంటే జాతీయ స్థాయిలో ఈ పెరుగుదల రూ. 23,000గా ఉంటే... రాష్ట్రంలో రూ. 31,010 పెరిగిందన్న మాట! తలసరి ఆదాయం విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 9వ స్థానంలో ఉంది.

ఆర్థిక శాస్త్రంలో గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) అనే పదాన్ని రాష్ట్రం లేదా దేశంలోని ఆయా రంగాల వస్తు, సేవల ఉత్పత్తి విలువ లెక్కించడానికి వాడతారు. ఆంధ్రప్రదేశ్‌లో 2021–22లో జీవీఏ గ్రోత్ రేట్ 18.47 గా నమోదైంది. రాష్ట్ర విభజన తర్వాత ఇంత ఎక్కువ గ్రోత్ రేట్ నమోదు కావడం ఇదే మొదటి సారి. వ్యవసాయం, దాని అనుబంధ ఉత్పత్తుల జీవీఏలో పెరుగుదల 14.50 శాతం నమోదైంది. ఇది జాతీయ సగటు కన్నా ఎక్కువ. జీవీఏ ప్రాతిపదిక లెక్కన మొత్తం వ్యవసాయ రంగం విలువ చంద్రబాబు హయాంలో సుమారు రూ. 10 లక్షల కోట్లు ఉంటే జగన్ ప్రభుత్వ హయాంలో అది రూ. 15 లక్షల కోట్లకు పెరిగింది. పరిశ్రమల జీవీఏ 2018–19లో రూ. 18లక్షల కోట్లు ఉంటే అది 2021–2022 నాటికి రూ. 24 లక్షల కోట్లకూ పెరిగింది.

గత మూడేళ్ళుగా వ్యవసాయ రంగాభివృద్ధి కూడా సంతృప్తికరంగానే ఉందని ఆర్‌బీఐ నివేదిక తెలియజేస్తోంది. 2018–2019లో స్థూల సాగుభూమి 72.97 లక్షల హెక్టార్లు కాగా అది 2021–2022 నాటికి 74.07 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇదే కాలంలో 10,838 వేల టన్నుల నుంచి 11,299 వేల టన్నులకూ, నూనె గింజల ఉత్పత్తి 504 వేల టన్నుల నుంచి 804 వేల టన్నులకూ పెరిగాయి. చేపలు, గుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

ఆర్‌బీఐ నివేదిక ప్రకారం బాబు పాలన చివరి ఏడాదిలో సాధారణ ద్రవ్యోల్బణం 6.9 శాతం ఉంటే ప్రస్తుతం 5.2 శాతంగా ఉంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వేయి మందికి 45 మంది నిరుద్యోగులుంటే ఇప్పుడు వీరి సంఖ్య 33కి తగ్గింది. అలాగే పట్టణ ప్రాంతంలో గతంలో ప్రతి వేయి మందికి 73 మంది నిరుద్యోగులుంటే ఇప్పుడు వారి సంఖ్య 60కి తగ్గింది. 6234 ప్రభుత్వాసుపత్రులతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలోనూ, 86,721 ఆస్పత్రి పడకలతో దేశంలో రెండో స్థానంలోనూ ఉంది. 2018–19లో రాష్ట్రంలో విద్యుత్ లభ్యత 6,380 కోట్ల యూనిట్లు ఉండగా నేడు 6822 కోట్ల యూనిట్లకు పెరిగింది.

చంద్రబాబు పాలన ఆఖరి ఏడాదిలో రాష్ట్ర పన్నుల ఆదాయం రూ. 58,677 కోట్లుగా నమోదు కాగా అది ఈ ఏడాది



రూ. 85,265కు పెరిగింది. 2021–22లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రుణాలపై వడ్డీగా రూ. 22,740 కోట్లు చెల్లించగా... ఉత్తర ప్రదేశ్ రూ. 43 వేల కోట్లు, మహారాష్ట్ర రూ. 42 వేల కోట్లు, తమిళనాడు రూ. 41 వేల కోట్లు చెల్లించాయి.

దేశ ఎగుమతుల్లో 5.8 శాతం వృద్ధి ఉంటే, రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధి 19.4 శాతంగా నమోదైంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎగుమతుల్లో తొమ్మిదో స్థానంలో ఉన్న రాష్ట్రం నేడు నాల్గో స్థానానికి చేరుకుంది. నీతి ఆయోగ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ డీసెంట్ ఎకనమిక్ గ్రోత్ విభాగంలో రెండో ర్యాంక్, పేదరిక నిర్మూలన విభాగంలో 3వ ర్యాంక్, గుడ్ హెల్త్ విభాగంలో 2వ ర్యాంక్, క్లీన్ వాటర్, శానిటేషన్ విభాగంలో 6వ ర్యాంక్ సాధించింది.

జగన్ ప్రభుత్వం నగదు బదిలీ పథకం ద్వారా గత మూడేళ్ళుగా పేదలకు సుమారు లక్షా 90 వేల కోట్ల రూపాయలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. పథకంపై ప్రారంభంలో కొందరు సందేహాలు వ్యక్తం చేసినప్పటికీ క్రమంగా ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయి. పెద్ద ఎత్తున జరుగుతున్న నగదు బదిలీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి కూడా తోడ్పడుతోంది. కోట్లాది రూపాయల మేరకు బదిలీ అవుతున్న నగదును లబ్ధిదారులు కొద్ది రోజుల్లోనే వివిధ రకాల వస్తు, సేవల కొనుగోలుకూ, ఫీజుల చెల్లింపునకూ ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా వస్తు, సేవలకు గిరాకీ ఏర్పడడం, వస్తువుల తయారీ అవసరం ఏర్పడడం, దానికై ముడి సరకులు కొనుగోలు చేయడం, ఉపాధి లభించడం, వ్యాపారాలు వృద్ధి చెందడం జరుగుతోంది. వ్యాపార లావాదేవీలు పెరగడం వల్ల ప్రభుత్వానికి పన్నుల రాబడి కూడా పెరుగుతోంది.

ఒక అంచనా ప్రకారం ఒక లబ్ధిదారుడికి ప్రభుత్వం ఒక ఏడాదిలో లక్ష రూపాయలు బదిలీ చేస్తే ఆ మొత్తం ఏడాదిలో కనీసం 50 లావాదేవీల ద్వారా చేతులు మారుతోంది. ఫలితంగా అన్ని చోట్లా వస్తుసేవలకు గిరాకీ ఏర్పడి, క్రయ విక్రయాల ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రాబడి వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పన్నుల రాబడి పెరగడానికీ, ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరగడానికీ, వస్తు సేవలకు గిరాకీ ఏర్ప డటానికీ... ఫలితంగా రాష్ట్రాభివృద్ధికి ఈ నగదు బదిలీ కొంత కారణమవుతుంది. అయితే పెద్దఎత్తున నగదు ప్రజలకు ఇవ్వడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదముంటుందని కొందరు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో లక్షలాది కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి ప్రజలకూ, ప్రజల నుంచి మార్కెట్‌లోకీ వచ్చినప్పటికీ గతంతో పోలిస్తే ద్రవ్యోల్బణం 6.9 శాతం నుంచి 5.2 శాతానికి తగ్గడం గమనార్హం. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి జరుగుతున్న తరుణంలో రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షాలు, మీడియా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. అలా కాకుండా ఆర్‌బీఐ నివేదిక వెలువడిన తర్వాత కూడా మొండిగా అబద్ధాలు, అర్ధసత్యాలు ప్రచారం చేస్తే నవ్వుల పాలయ్యే ప్రమాదం ఉంది.

వ్యాసకర్త అధ్యక్షుడు ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్
మొబైల్: 95052 92299

ఎప్పటికేది ప్రస్తుతమో...

సర్వ కాల, సర్వావస్థల యందు ఓర్పు వహించటం సమంజసం కాదు. ఓర్పు అవసరమే కాని దానికీ ఒక పరిమితి ఉంటుంది. ఎప్పుడూ ఓర్పు వహించే వ్యక్తిని చూసి ఎవరూ భయపడరు. అతి మంచితనాన్ని అలుసుగా తీసుకుంటారు. పైగా, అవమానిస్తారు. పేర్లు పెడతారు. ఆర్థిక సంబంధ సంస్థలలో పనిచేసేవారు పై అధికారి అతి ఓర్పును చూసి అక్రమాలకు పాల్పడతారు. పై అధికారికి తెలిసినా ఏమీ అనరనే ధీమా ఉంటుంది.

జ్యోతిర్మయం

అలాగే, ఎప్పుడూ ప్రతాపాన్ని, కోపాన్ని చూపించినా అనర్థమే! ప్రతి చిన్న విషయానికీ అతిగా స్పందిస్తూ, కోపాన్ని వ్యక్తం చేస్తూ, తమ కంటే చిన్నవారికీ, తమ దగ్గర పని చేస్తున్నవారికీ కఠిన శిక్షలు వేస్తుంటే... వారిలో ఆ వ్యక్తి పట్ల వ్యతిరేకత, అనిష్టం పెరుగుతుంది. ఆ వ్యక్తంటే భయపడతారు కాని ప్రేమను చూపలేరు. స్నేహం చేయలేరు. తగిన అవసరం లేకుండా, ఎదుటివారిలో పొరపాటు లేకపోయినా తన కోపాన్ని ప్రదర్శించే వ్యక్తికి శత్రువు లెక్కువగా ఉంటారు. అతని కోపమే అతని శత్రువై పోతుంది.

కోపం వలన ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలకు హాని ఏర్పడుతుంది. ముక్కోపి తొందరపడి మాట అనేస్తాడు. గురువు నైనా నిందిస్తాడు. తల్లి తండ్రులనైనా అవమానిస్తాడు. ఎవరి పట్ల గౌరవం చూపలేడు. తన ఆత్మనాశనానికి కారణమవుతాడు. ఓర్పు గలవారు తమ సహనమనే నీటితో కోపమనే మంటను ఆర్పుతారు.

తనలోని కోపమనే శత్రువును, తద్వారా ఏర్పడిన బయట శత్రువులను జయించాలంటే తగు ఓర్పు అవసరం. అలాగే, అతి సహనంతో, ఇతరులలో పలచనై పోకుండా తమను గౌరవించేట్లు చేసుకోవటానికి అవసరమైనప్పుడు ప్రతాపాన్ని చూపాలి. సమయానుకూలంగా క్షమను, ప్రతాపాన్ని ప్రదర్శిస్తూ అందరితో మంచిగా మెలగగలిగేవారు విజ్ఞులు.

బలి చక్రవర్తికి, ప్రహ్లాదునికి మధ్య జరిగిన సంభాషణలోని ఈ విషయాలు ఇప్పటి తరం వారికీ అనుసరణీయాలే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి



గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.త్రయోదశి ఉ.7.01 వరకు, తదుపరి చతుర్దశి తె.5.58 వరకు (తెల్లవారితే బుధవారం), నక్షత్రం: స్వాతి రా.10.46 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం: తె.4.14 నుండి 5.48 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.11 వరకు, తదుపరి రా.10.27 నుండి 11.21 వరకు, అమృతఘడియలు: ప.2.01 నుండి 3.36 వరకు; రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు; యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు; సూర్యోదయం 6.12 : సూర్యాస్తమయం 5.20.

క్లుప్తంగా

కృష్ణ అస్థికలను కృష్ణా నదిలో కలిపిన మహేష్‌బాబు


అస్థికలు కలిపేందుకు కృష్ణా తీరానికి వచ్చిన మహేష్‌బాబు

తాడేపల్లి రూరల్: సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ అస్థికలను ఆయన కుమారుడు మహేష్‌బాబు సోమవారం కృష్ణానదిలో కలిపారు. ఉండవల్లి ప్రాంతంలోని కృష్ణా నదీ తీరంలో ఓ ప్రైవేటు గెస్ట్ హౌస్‌కి వచ్చి అక్కడి నుంచి బంధువులు, స్నేహితులతో కలిసి అస్థికలను నదిలో కలిపారు. మహేష్ బాబు వెంట దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఎంపీ గల్లా జయదేవ్, కృష్ణ సోదరుడు శేషగిరిరావు, బంధువులు ఉన్నారు.

హంస వాహనంపై వీణాపాణి


పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారు వీణాపాణిగా హంస వాహనంపై భక్తులను కటాక్షించారు. అమ్మవారిని వేకువనే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు 7 తలల పెద్దశేష వాహనంపై శ్రీ వైకుంఠ నారాయణుడి అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనల నడుమ అమ్మవారు మాడ వీధుల్లో ఊరేగారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వాహనసేవ సాగింది.

రత్నగిరికి భక్తుల తాకిడి


సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు


అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలో రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుని ఆలయానికి కార్తీక బహుళ ద్వాదశి, చివరి సోమవారం సుమారు లక్ష మంది భక్తులు వచ్చారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్వామి సన్నిధికి వేలాది వాహనాల్లో భక్తులు వస్తూనే ఉన్నారు. వ్రతాలు 9,956 జరిగాయి. ఇప్పటి వరకూ 2019 కార్తికంలో జరిగిన 1,30,087 వ్రతాలు రికార్డు. ఈ కార్తికంలో ఇంకా రెండు రోజులు మిగిలి ఉండగానే 1,39,165 వ్రతాలతో ఆ రికార్డును అధిగమించింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.కోటి ఆదాయం వచ్చిందని ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో 12 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి.సర్వ దర్శన టోకెన్లు లేని వారికి 20 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు పడుతోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 80,294 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ. 4.48 కోట్లు సమర్పించారు.

కర్ణాటకలో స్వధర్మ వాహిని ప్రచార యాత్ర

- ఆరు రోజుల పాటు నిర్వహించిన స్వాత్మానందేంద్ర


సామూహిక పూజల్లో పాల్గొని అనుగ్రహ భాషణం చేస్తున్న స్వాత్మానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం చేపట్టిన స్వధర్మ వాహిని ప్రచార యాత్ర 6 రోజుల పాటు కర్ణాటకలో సాగిందని పీఠం ప్రతినిధులు సోమవారం తెలిపారు. కోలార్, చింతామణి, కుంబలగుడు, మల్లేశ్వరం, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర సోమవారం సాయంత్రానికి ఏపీలోని అనంతపురం జిల్లా హిందూపురానికి చేరుకుంది. కర్ణాటకలో తెలుగు ప్రజలు అత్యధికంగా నివసించే ప్రాంతాలను స్వాత్మానందేంద్ర సందర్శించి అక్కడ ధర్మప్రచారం చేశారు. బ్రాహ్మణ అగ్రహారాల్లో బస చేశారు. కోలార్, చింతామణి, శంకర మఠాలను సందర్శించి చంద్రమౌళీశ్వరుల పీఠార్చన నిర్వహించారు. బెంగళూరు పాత్రికేయుల ఆహ్వానం మేరకు జాతి నిర్మాణంలో మీడియా పాత్ర అనే అంశంపై అనుగ్రహభాషణం చేశారు. శ్రీ యదుగిరి యతిరాజ మఠం, కెంగేరి మఠాలకు వెళ్లి మఠాధిపతులతో వైదిక అంశాలపై చర్చించారు. బెంగళూరులో ఆదిచుంచ నగరి మహా సంస్థానాధీశులు స్థాపించిన బీజీఎస్ విద్యా సంస్థలకు వెళ్లి అక్కడ సామాజిక సేవా కార్యక్రమాలను పరిశీలించారు.

అంతరించిపోతున్న అరుదైన జీవి



- నల్లమల అడవుల్లో మూషిక జింకలు
- ప్రపంచంలోనే అతి చిన్న జీవాలు
- రాత్రి వేళ మాత్రమే సంచారం
- పునరుత్పత్తి చేపట్టిన హైదరాబాద్ జూ పార్క్

దుష్టశిక్షణ..శిష్ట రక్షణ కోసం సాక్షాత్తు శ్రీమహావిష్ణువే నరుడు.. సింహం రూపాలతో నరసింహుడిగా అవతరించాడనేది పురాణ గాథ. నల్లమల అడవుల్లో మాత్రం మూషిక మొహం.. జింక దేహంతో ఓ బుల్లి ప్రాణి నరసింహుడి కంటే అంతకు ముందే అవతరించింది. ప్రపంచ జింక జాతుల్లో అతి చిన్న ప్రాణి అయిన దీనిని మూషిక జింక అంటారు. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం సుమారు 25 లక్షల నుంచి 30 లక్షల సంవత్సరాల క్రితమే పుట్టిన మూషిక జింక శరీర అమరికలో అప్పటినుంచి ఇప్పటివరకు ఎటువంటి మార్పులు జరగలేదట. అందుకే దీనిని సజీవ శిలాజంగా కూడా పరిగణిస్తారు.

పెద్దదోర్నాల (ప్రకాశం): మూషిక జింక.. ప్రపంచంలోనే అతి బుల్లి జింక. ఆంగ్లంలో మౌస్ డీర్ లేదా షెవ్రోటేన్‌గా పిలిచే ఈ జీవి గుండ్రని దేహం.. చిన్న చిన్న కాళ్లతో 25 నుంచి 30 సెంటీమీటర్ల పొడవు, 10 అంగుళాల ఎత్తు వరకు పెరుగుతుంది. నెమరు వేసుకునే జీవుల్లో పొట్టలో మూడు గదులుండే జీవి ఇదొక్కటే. ప్రపంచంలో క్రమేపీ అంతరించిపోతున్న మూగ జీవాలలో ఒకటైన మూషిక జింకలకు కొమ్ములు ఉండవు. నల్లమల అభయారణ్యంలో సంచరించే అత్యంత చిన్న జీవులు ఇవి. దక్షిణాసియా దేశాలైన భారత్, శ్రీలంక, దేశాలలోనే ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. గడ్డి పరకలు, ఆకులు, పండ్లను మాత్రమే ఆహారంగా తీసుకుని జీవిస్తాయి.

బరువు తక్కువ.. భయం ఎక్కువ

మూడు కిలోల వరకు బరువు పెరిగే ఈ జీవులు కొమ్ములు లేని కారణంగా పగలంతా గుబురు పొదల్లోనే దాగి ఉంటాయి. కేవలం రాత్రి పూట మాత్రమే అవి బయట సంచరిస్తుంటాయి. వీటి గర్భధారణ సమయం ఆరు నెలలు మాత్రమే ఉంటుంది. వీటి జీవిత కాలం కూడా ఆరేళ్లకు మించి ఉండదు. అడవిలో సంచరించే ఏ చిన్న మాంసాహార ప్రాణులైనా వీటిని అవలీలగా వేటాడే అవకాశం ఉంటుంది. ఆకాశంలో సంచరించే గద్దలు, గరుడ పక్షులు నుంచి కూడా వీటికి ఎక్కువగా ముప్పు ఉంటుంది. అవి అవలీలగా వీటిని నోటకరుచుకుని ఆకాశంలోకి ఎగిరిపోయే ప్రమాదం ఉన్నందున పగలు చెట్ల పొదల్లోనే దాగి రాత్రి పూట మాత్రమే అడవిలో సంచరిస్తుంటాయి.


నల్లమలలో సంచరిస్తున్న మూషిక జింకలు

నడుం బిగించిన కేంద్ర ప్రభుత్వం

అంతరించిపోతున్న వన్య ప్రాణుల జాతులను సంరక్షించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా కేంద్ర జంతు సాధికార సంస్థ అంతరించిపోతున్న ఒక్కో వన్యప్రాణి జాతిని సంరక్షించే బాధ్యతను ఒక్కో జంతు సంరక్షణ కేంద్రానికి అప్పగించింది. తిరుపతి జూ పార్క్‌కు అడవి కోడి, విశాఖపట్నం జూ పార్క్‌కు వైల్డ్‌డాగ్, హైదరాబాద్ జూ పార్కుకు మౌస్‌డీర్ సంరక్షణ బాధ్యతల్ని కేటాయించింది. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న మూషిక జింకలను సంరక్షించటంతో పాటు వాటి పునరుత్పత్తి ప్రక్రియను హైదరాబాద్ జూ పార్క్ 2010లో చేపట్టింది. నాలుగు ఆడ మూషిక జింకలు, రెండు మగ మూషిక జింకలతో హైదరాబాద్ జూ పార్క్‌లో వీటి సంరక్షణతో పాటు పునరుత్పత్తిని ప్రారంభించారు. ఇలా ప్రారంభించిన ఐదేళ్లలోనే వాటి సంఖ్యను భారీగా పెంచగలిగారు. పునరుత్పత్తిని విజయవంతంగా పూర్తి చేసి మూషిక జింకలను ఆమ్రాబాద్, అచ్చంపేట అడవుల్లో వదిలిపెట్టారు.

> **రాత్రి పూట మాత్రమే సంచరిస్తాయి**
>
> నల్లమల అభయారణ్యంలో వీటి సంచారం ఎక్కువగా ఉంది. మాంసాహార వన్యప్రాణులు, పక్షుల బారినుంచి కాపాడుకునేందుకు రాత్రి పూట మాత్రమే ఇవి అడవిలో సంచరిస్తుంటాయి. పగటి పూట చెట్ల పొదలోపల నివాసం ఉంటాయి. అంతరించిపోతున్న ఈ జాతిని సంరక్షించేందుకు గతంలో హైదరాబాద్ జూపార్క్ అధికారులు చర్యలు చేపట్టారు.
>
> – విశ్వేశ్వరావు, ఫారెస్ట్ రేంజి అధికారి

పట్టాలెక్కిన లారీ..!



పట్టాలపై వేగంగా రైళ్లు దూసుకుపోయేది చూస్తుంటాం.. ఇక్కడ రైలు పట్టాలపై టిప్పర్ లారీ ప్రయాణం చేస్తోంది. విజయవాడ-గూడూరు సెక్షన్ల మధ్య మూడో లైన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఒంగోలు సమీపం కరవది స్టేషన్ వద్ద లైన్‌కు ఇరువైపులా టిప్పర్ సాయంతో కంకర వేస్తున్నారు. గతంలో ఈ పనులకు కూలీలను వినియోగించేవారు.

ఫొటో: ఎం. ప్రసాద్, ఒంగోలు

పాలనా వికేంద్రీకరణతోనే అభివృద్ధి

785వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పాలనా వికేంద్రీకరణతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరిఢవిల్లుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 785వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సాహసోపేతమైన నిర్ణయాలతో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అమరావతి ఉద్యమం చతికిలపడటంతో డీలా పడిన చంద్రబాబు ఉద్యమం విడిచి పలాయనం చిత్తగించిన కులవాదులను రెచ్చగొట్టేందుకు ఆయనే నేరుగా రంగంలోకి దిగి రాష్ట్రంలో తిరుగుతూ ఆఖరి ఛాన్స్ ఇవ్వండంటూ అడుగుతుండటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పెద్దలకో న్యాయం, పేదలకో న్యాయం చేస్తూ రాజధాని ప్రాంతంలో తీరని అన్యాయం చేసి నిలువునా ముంచేశాడని మండిపడ్డారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కి బహుజనులు రుణపడి ఉన్నారన్నారు. మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

రచయిత 'ఇలపావులూరి' హఠాన్మరణం

- అద్దంకిలో గుండెపోటుతో మృతి
- 250 కథలు, 6 సీరియల్ నవలల రచన.. పలు అవార్డులు
- కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపిన సీఎం జగన్

అద్దంకి/సాక్షి, అమరావతి: కథా, నవలా రచయిత, రాజకీయ విశ్లేషకుడు ఇలపావులూరి మురళీమోహన్‌రావు(62) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. తన తండ్రి సుబ్బారావు రచించిన హనుమత్ శతకం మూడో ముద్రణ గ్రంథ ఆవిష్కరణకు, అన్న నాగేంద్ర మనోహర్ కుటుంబం, మురళీమోహన్‌రావు కుటుంబం ఆదివారం అద్దంకి వచ్చాయి. కార్తీక మాసం కావడంతో కొత్తపట్నం సముద్ర తీరానికి వెళ్లి సముద్ర స్నానం చేశారు. ఆ తర్వాత అద్దంకి పట్టణంలోని తన ఇంటికి వెళుతుండగా గుండెపోటు రావడంతో ఒంగోలు కిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ప్రాణాలు విడిచారు. మృతదేహాన్ని హైదరాబాద్‌లోని నివాసానికి తీసుకెళ్లి మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య శారద, కుమారుడు ప్రమోద్ ఉన్నారు. మురళీమోహనరావు స్వగ్రామం అద్దంకి మండలం వేలమూరిపాడు. అయితే అద్దంకి పట్టణంలో స్థిరపడ్డారు. తండ్రి సుబ్బారావు తెలుగు పండిట్‌గా పనిచేసి పలు గ్రంథాలు రచించారు.


మురళీమోహన్‌రావు (ఫైల్)

మురళీమోహనరావు.. 40 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి రేస్ కోర్టులో స్టెనోగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు.

నాలుగు సినిమాలకు కథలు..

మురళీమోహనరావు కథా, నవలా రచయితగా, సినీ మాటల రచయితగా ప్రఖ్యాతి పొందారు. హాస్యరస ప్రధాన కథలను ఎక్కువగా రాసేవారు. 250 కథలు, 6 సీరియల్ నవలలు రాసి పలు అవార్డులు పొందారు. ఆయన కథలు, నవలలు ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వివిధ పత్రికల్లో రాజకీయ, సాహిత్య, సినీ రంగాలకు సంబంధించి 1500 వరకు వ్యాసాలు రాశారు. కితకితలు, ఎలుకా మజాకా వంటి నాలుగు సినిమాలకు కథలు, సూర్యుడు సినిమాకు మాటలు అందించారు. ఆయన రాసిన 20 కథలను కన్నడలోకి అనువదించారు. 'సాక్షి'తో పాటు పలు టీవీ చానల్స్‌లో వక్తగా, చర్చా వేదికల్లో పాల్గొని రాజకీయ విశ్లేషకుడిగా పేరు ప్రఖ్యాతులు పొందారు.

సీఎం జగన్ సంతాపం

రాజకీయ విశ్లేషకుడు ఇలపావులూరి మురళీమోహన్ మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

టీడీపీ అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల


మాట్లాడుతున్న శ్రీనివాసులునాయుడు

మదనపల్లె : హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి బండమీదకమ్మపల్లె సర్వేనంబర్ 8/1లో 3.07 ఎకరాల స్థలంలో మాజీ ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా మదనపల్లె టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొమ్మలపాటిరమేష్ అక్రమంగా పార్టీ కార్యాలయం, మూడంతస్తుల భవన నిర్మాణం ఎలా చేస్తారని మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు ప్రశ్నించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శ్రీనివాసులు మాట్లాడుతూ.. మాజీ సైనికులకు, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటిరమేష్‌కు మధ్య చాలా కాలంగా స్థల వివాదం కోర్టులో నడుస్తున్నదన్నారు. చట్టప్రకారం నడచుకోవాల్సిందిగా కోర్టు ఇరువర్గాలను ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుత తహసీల్దార్ సీకే శ్రీనివాసులు, సీసీఎల్ఏ కోర్టులో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, టీడీపీ మాజీ ఎమ్మెల్యేతో లాలూచీ పడి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పేదవాడు చిన్న ఇల్లు కట్టుకుంటే నానా హంగామా చేసే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మాజీ ఎమ్మెల్యే మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తుంటే అడ్డుకోకపోగా, మున్సిపల్ కొళాయి కనెక్షన్, ఇతర సదుపాయాలు కల్పించడమేంటని నిలదీశారు. మాజీ సైనికుల సంఘం ఉపాధ్యక్షుడు యూసుఫ్, సెక్రటరీ రాయుడు, ట్రెజరర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన మావోయిస్టు లేఖలు


మావోయిస్టుల పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అయిన లేఖలు

కుక్కునూరు: సీపీఐ (మావోయిస్టు) పార్టీ లెటర్ హెడ్‌తో రాసిన లేఖలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెద్దరావిగూడెం పంచాయతీ శివారు అల్లిగూడెం గ్రామంలోని ఫారెస్ట్ నర్సరీ సమీపంలో ఓ చెట్టు వద్ద సోమవారం ఉదయం సీపీఐ మావోయిస్టు పార్టీ పేరుతో లేఖలున్నాయంటూ సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన వార్త కలకలం రేపింది. మావోయిస్టుల పేరుతో ఉన్న ఈ లేఖల్లో పోలవరం ప్రాజెక్ట్ పేరుతో కొన్ని భూములకు పరిహారం ఇచ్చి మిగులు భూములను వదిలేశారని, ఆర్అండ్ఆర్, ఇళ్లకు పరిహారం ఇవ్వకుండా గిరిజనులను, గిరిజనేతరులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని పేర్కొన్నారు. 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు 32 వేల ఎకరాల భూమిని సేకరించి ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కి పాల్పడి తన అనుయాయులకు ఆ భూములను కట్టబెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడని తెలిపారు. కాగా, ఈ విషయమై కుక్కునూరు ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా మావోయిస్టు లేఖలేమీ దొరకలేదని చెప్పారు.

హిరమండలం ఎత్తిపోతలకు శ్రీకారం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రలో వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-2 ఆయకట్టు రైతులకు ముందస్తు పూర్తిఫలాలు అందించడం, ఉద్దానం ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా హిరమండలం ఎత్తిపోతల పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ఎత్తిపోతల పనులకు రూ.135.85 కోట్ల అంచనా వ్యయంతో లంప్సమ్ ఓపెన్ విధానంలో టెండర్ నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని గడువు పెట్టింది. టెండర్ షెడ్యూలు దాఖలు చేయడానికి ఈ నెల 22 తుది గడువు. వంశధార ప్రాజెక్టు ఎస్ఈ 23న సాంకేతిక బిడ్‌ను తెరుస్తారు. 30న ఉదయం 11 గంటలకు ఆర్థిక బిడ్ తెరిచి, తక్కువ ధరకు కోట్‌చేసిన విలువనే అంచనాగా పరిగణించి అదేరోజు రివర్స్ టెండరింగ్ నిర్వహిస్తారు. తక్కువ ధరకు పనులు చేయడానికి ముందుకొచ్చిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించనున్నారు.

మరింత జాగ్రత్తగా రికార్డుల అప్‌డేట్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతిదశను పటిష్టంగా అమలు చేస్తున్నారు. రీసర్వే జరిగినప్పుడు వివిధ కారణాల వల్ల అందులో పాల్గొనని భూయజమానులు సర్వే పూర్తయ్యాక ఆర్‌వోఆర్ ప్రక్రియలో తమ రికార్డులను అప్‌డేట్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఏపీ సర్వే అండ్ బౌండరీ యాక్టు ప్రకారం సర్వే ముగిశాక అప్పీల్‌కు గడువు పూర్తయినా రైతులు, భూయజమానులు అప్పీల్ చేస్తే వాటిని స్వీకరించి విచారిస్తున్నారు. ఒకవేళ వారు సర్వే సమయంలో గ్రామంలో లేకపోతే వీడియో కాన్ఫరెన్స్, వాట్సాప్ వీడియోకాల్, జూమ్ వీడియోకాల్ వంటివాటి ద్వారా వారి స్టేట్‌మెంట్ తీసుకునే వెసులుబాటు ఉంది. విచారణ సమయంలో మొబైల్ మేజిస్ట్రేట్లు ఈ స్టేట్‌మెంట్లను పరిగణలోకి తీసుకోవాల్సిందేనని ప్రభుత్వం నిర్దేశించింది. సర్వే పూర్తయినట్లు 13 నోటిఫికేషన్ జారీచేసిన తర్వాత తమ హద్దులపై సంతృప్తి చెందకపోతే భూయజమానులు మధ్యవర్తిత్వం కోరే అవకాశం ఉంది. గ్రామసభలో తుది ఆర్‌వోఆర్ ప్రచురించిన తర్వాత కూడా ఏపీ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్ బుక్ చట్టం ప్రకారం రికార్డుల్లో నమోదైన వివరాలను సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నోటిఫికేషన్ ప్రచురించిన ఒక సంవత్సరం తర్వాత దిద్దుబాటు కోసం తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. తహశీల్దార్ ఇచ్చే ఆర్డర్‌పై 90 రోజుల్లో ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవచ్చు.

మరింత పక్కాగా అమలు చేయాలని సీసీఎల్ఏ సర్క్యులర్

రీసర్వేలో ప్రతిదశలోను రైతులు, భూయజమానుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండలా చూడాలనే మార్గదర్శకాలతో భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సర్క్యులర్ జారీచేశారు. ప్రతిదశలో రైతులు, భూస్వాములు వారి అవకాశాలను వినియోగించుకునేలా చేయాలని సూచించారు. ఈ అవకాశాల గురించి అందరికీ తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్దేశించారు. సర్వే ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను కూడా ప్రత్యేక ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేలా చూడాలని సూచించారు. సర్వే జరుగుతున్న గ్రామాల్లో నెలలో 15 రోజులు మొబైల్ మేజిస్ట్రేట్లు పర్యటించి పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ చేసేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇలా వచ్చే వినతులను గ్రామాల వారీగా జాబితాలు రూపొందించాలని సూచించారు. రాష్ట్ర, జిల్లాస్థాయి కమిటీలు ఈ దరఖాస్తులు నిర్దిష్ట గడువులోపు పరిష్కారమవుతున్నాయో లేదో పరిశీలిస్తాయని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం, ఆర్డీవోకి అప్పీలు వంటి వాటికోసం ప్రత్యేక ఐటీ అప్లికేషన్లు తీసుకురానున్నట్లు సర్క్యులర్‌లో తెలిపారు.

ధన బ్యాంక్ కేసులో 21 మందికి పదేళ్ల శిక్ష

- ఏలూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు తీర్పు
- రాష్ట్ర చరిత్రలో తొలిసారి డిపాజిటర్స్ యాక్ట్ కేసులో శిక్ష ఖరారు
- ఫలించిన 20 ఏళ్ల న్యాయ పోరాటం

ఏలూరు (టూటౌన్): డిపాజిటర్లకు రూ.3 కోట్లు ఎగవేసిన ఏలూరు ధన బ్యాంక్ కేసులో 21 మందికి పదేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ ఏలూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ సోమవారం తీర్పునిచ్చారు. దీంతోపాటు ఒక్కొక్కరికీ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో తొలిసారి డిపాజిటర్స్ యాక్ట్ కేసులో ముద్దాయిలకు శిక్షను ఖరారు చేస్తూ కోర్టు తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో 20 ఏళ్ల న్యాయపోరాటం ఫలించింది.

కేసు పూర్వాపరాలివీ..

జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ప్రత్యేక పీపీ లామ్ అజయ్ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2002లో ఏలూరు టూటౌన్ పరిధిలోని ధన బ్యాంక్ పలువురు డిపాజిటర్లకు రూ.3 కోట్లను చెల్లించకుండా మోసం చేసింది. అప్పట్లో ధన బ్యాంక్‌కు చెందిన మొత్తం 27 మందిపై ఎస్సై ఎం.సుధాకర్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ బి.పెద్దయ్య ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. మొత్తం 27 మంది ముద్దాయిల్లో ఐదుగురు చనిపోగా.. ఒకరు పరారీలో ఉండటంతో మిగిలిన 21 మందికి న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు. శిక్షపడిన వారిలో రావూరి సత్యసాగర్ (బ్యాంక్ చైర్మన్), తల్లాప్రగడ నాగేంద్రప్రసాద్, గోలి కృష్ణకుమారి, అమ్మనమంచి శివాజీ, రావిపాటి వీరవెంకట రామారావు, బాదంపూడి లక్ష్మీకుమారి, చింతా గిరి, కొవ్వూరి శ్రీనివాసరావు, ఇనుగంటి వెంకట సతీష్, బండారు నర్సింహమూర్తి, మామిడిబత్తుల నాగ శ్రీనివాస్, జక్కంపూడి శ్రీనివాస్, దాసరి బోసురాజు, గొల్ల భాస్కర సత్యనారాయణ ప్రసాద్, నక్కా శ్రీనివాసరావు, బోడ సాంబమూర్తి, రావూరి నాగ వెంకట సత్యనారాయణ, గుమ్మిడి వెంకట రమణమూర్తి, చెన్నకేశవులు రంగనాథ్, దుగ్గిరాల శేషసాయి సత్యశేఖర్, గద్దె ఉషారాణి ఉన్నారు. గుండాల గోపి అనే నిందితుడు ఇప్పటికీ పరారీలో ఉండగా.. దుగ్గిరాల రవికుమార్, పయ్యావుల దామోదరరావు, బాలనాగు సోమేశ్వరగుప్త, దళపతి కోటమరాజు, గద్దె రుష్యేంద్ర నాగవెంకటప్రసాద్ మృతి చెందారు.

'చేనేత బంధు' రామమూర్తి కన్నుమూత



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.రామమూర్తి(82) సోమవారం హైదరాబాద్‌లోని నివాసంలో మృతి చెందారు. ఆయన చేనేత కులాల ఐక్యతకు, బీసీ కులాల సంఘటితానికి కృషి చేశారు. ఆయన 1979-1980లో ఏపీ ఎన్‌జీవో ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగ సంఘాల ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారు. ఎన్నో కో-ఆపరేటివ్ బ్యాంకుల ఏర్పాటునకు మార్గనిర్దేశం చేసిన రామమూర్తి.. హైదరాబాద్‌లో స్వయంగా భావనా బ్యాంక్‌ను స్థాపించారు. రాష్ట్రస్థాయి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల ఫెడరేషన్‌కు అధ్యక్షుడిగా సేవలందించారు. బ్యాంకింగ్ ఫ్రాంటియర్స్ సంస్థ ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఇచ్చి సత్కరించింది. జర్నలిస్టుగా, ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బొమ్మన రామచంద్రరావు, శీరం శ్రీరామచంద్రమూర్తి వంటి చేనేత రంగ ప్రముఖులతో కలిసి 1992లో ఏపీ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. ఏపీ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ 2018లో రాజమహేంద్రవరంలో రామమూర్తిని 'చేనేత బంధు' పురస్కారంతో సత్కరించింది.

కోర్టులో నిందితుడి ఆత్మహత్యాయత్నం

సీతమ్మధార(విశాఖ ఉత్తర): విశాఖజిల్లా కోర్టులో ఓ నిందితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు వారెంట్‌పై అరెస్టు చేసి కోర్టుకు తీసుకురాగా అక్కడ తలపై రాయితో కొట్టుకుని తీవ్రంగా గాయపరుచుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం వెంకటేశ్వరకాలనీకి చెందిన శీరపు వెంకటరెడ్డి (29) బెదిరింపుల కేసులో 2018లో నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. రిమాండ్‌కు వెళ్లి వచ్చాడు. అయితే కోర్టు వాయిదాలకు రాకపోవడంతో అరెస్ట్ వారెంట్ జారీ అయింది. దీంతో సోమవారం ఉదయం పోలీసులు వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకుని ఫస్ట్ ఏసీఎం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్లారు. అయితే తనను జైలుకు పంపిస్తారన్న భయంతో.. వెంకటరెడ్డి అక్కడే ఉన్న రాయితో తలమీద బలంగా కొట్టుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో పోలీసులు వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. కాగా, మద్యంతో పాటు మత్తుపదార్థాలకు వెంకటరెడ్డి బానిస కావడంతో మానసిక పరిస్థితి దెబ్బతిని చికిత్స తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూజిలాండ్‌లో 16 ఏళ్లకే ఓటు హక్కు

వెల్లింగ్టన్: ఓటు హక్కు అర్హతను 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించే ప్రతిపాదనను పార్లమెంట్‌లో ప్రవేశ పెడతామని న్యూజిలాండ్ ప్రధాని జెసిండా ఆర్డెర్న్ చెప్పారు. దేశ సుప్రీంకోర్టు కూడా 16 ఏళ్ల వారికి ఓటు హక్కు కల్పించడంపై సానుకూలంగా స్పందించడంతో సోమవారం ఆమె ఈ ప్రకటన చేశారు. రాబోయే నెలల్లో ఈ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చిస్తామన్నారు. రాజ్యాంగం ప్రకారం ఇలాంటి వాటిపై పార్లమెంట్‌లోని 75% మంది సభ్యులు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అయితే, రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తుండటంతో '16 ఏళ్లకే ఓటు' ఇప్పట్లో కార్యరూపం దాల్చే అవకాశాల్లేవు. కాగా, 16 ఏళ్ల వారికీ ఓటు హక్కు కల్పించిన దేశాల్లో ఆస్ట్రియా, మాల్టా, బ్రెజిల్, క్యూబా, ఈక్వెడార్ ఉన్నాయి.

క్లుప్తంగా...

పాక్ ఆర్మీ చీఫ్‌కు... వేల కోట్ల అక్రమాస్తులు!



ఇస్లామాబాద్: పాక్ ఆర్మీ చీఫ్‌గా జనరల్ కమర్ జావెద్ బజ్వా బాధ్యతలు చేపట్టాక ఆయన కుటుంబం దేశ విదేశాల్లో రూ.1,270 కోట్ల మేర ఆస్తుల్ని పోగేసుకున్నట్లు 'ది ఫ్యాక్ట్ ఫోకస్' అనే వెబ్‌సైట్ వెల్లడించింది. ఈ నెలాఖరున జనరల్ బజ్వా పదవీ విరమణ చేయాల్సి ఉండగా వెలువడిన ఈ కథనం అధికార వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కథనంపై సైన్యం స్పందించనప్పటికీ, వ్యక్తిగత ట్యాక్స్ రికార్డులు అనధికారికంగా, చట్ట విరుద్ధంగా వెల్లడి కావడంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

'రాజీవ్' దోషుల విడుదలపై... త్వరలో సుప్రీంకు కాంగ్రెస్

న్యూఢిల్లీ: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసు దోషుల విడుదలను సమీక్షించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు ఈ వారమే పిటిషన్ దాఖలు చేయనున్నట్టు పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. రాజీవ్ కేసులో 30 ఏళ్లకు పైగా జీవితఖైదు అనుభవిస్తున్న నళినితో పాటు మొత్తం ఆరుగురు దోషులను విడుదల చేయాలంటూ నవంబర్ 11న సుప్రీంకోర్టు ఆదేశించడం తెలిసిందే.

ఈసీగా గోయల్ బాధ్యతలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర నూతన ఎన్నికల కమిషనర్ (ఈసీ)గా అరుణ్ గోయల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1985 పంజాబ్ కేడర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన గోయల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శిగా ఉన్న అరుణ్ గోయల్ ఈ నెల 18న స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం 19న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గోయల్‌ను ఎన్నికల కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే.

రౌత్‌కు రాహుల్ ఫోన్


ముంబై: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తనకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) వర్గం ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. ''ఆయన ఆదివారం ఫోన్ చేశారు. 110 రోజుల పాటు జైల్లో గడిపినందున నా ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. నేటి విద్వేష రాజకీయ పరిస్థితుల్లో ఇదో అరుదైన సుహృద్భావ చర్య. భారత్ జోడో యాత్రలో కూడా రాహుల్ ఇలాంటి ప్రేమ, ఆప్యాయతలనే రంగరిస్తున్నారు. అందుకే అది పెద్ద జనోద్యమంగా రూపుదిద్దుకుంటోంది'' అంటూ ప్రశంసలు కురిపించారు.

మరోసారి నేడు ఉద్యోగ మేళా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ మేళాలో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ 71 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు వివిధ మంత్రిత్వ శాఖలు పాల్గొంటాయి. ఈ సందర్భంగా కర్మయోగి ప్రారంభ్ మద్యూల్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ప్రధాని లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడతారు.

ప్రభుత్వం రైతుల హక్కుల్ని హరిస్తోంది: ఖర్గే

న్యూఢిల్లీ: పీఎం–కిసాన్ పథకంలో రైతు లబ్ధిదారుల సంఖ్య ఏటికేడు తగ్గిపోతుండటంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పీఎం–కిసాన్ యోజనతో 14.5 కోట్ల మంది రైతులకు లాభం కలుగుతోందంటూ బాకా ఊదుకుంటున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరోవైపు..దేశానికి అన్నం పెట్టే రైతన్నల హక్కుల్ని హరించివేస్తోందని దుయ్యబట్టారు. ఎవరికి లాభం కలిగిస్తున్నారంటూ ప్రధానిని ఆయన నిలదీశారు.



సైంటిస్ట్ సునాక్..

ఎరాస్‌మస్ డార్విన్ అకాడమీ డిజైన్ టెక్నాలజీ క్లాస్ విద్యార్థులకు సోల్డరింగ్‌లో సాయపడుతున్న బ్రిటన్ ప్రధాని రిషి సునాక్. ఇంగ్లండ్‌లోని బంట్‌వుడ్‌లో సోమవారం తీసిందీ ఫొటో.

చంద్రుని చెంతకు ఓరియాన్

చరిత్ర సృష్టించిన నాసా మిషన్



వాషింగ్టన్: పలు అడ్డంకుల్ని, బాలారిష్టాల్ని దాటుకుంటూ నాసా ఇటీవల ఎట్టకేలకు ప్రయోగించిన ఓరియాన్ స్పేస్‌క్రాఫ్ట్ చంద్రున్ని చేరి చరిత్ర సృష్టించింది. అది చందమామకు వెనకవైపుగా 128 కిలోమీటర్ల సమీపానికి వెళ్లిందని నాసా సోమవారం ప్రకటించింది. దీన్ని అత్యంత కీలకమైన ముందడుగుగా అభివర్ణించింది. నాసా విడుదల చేసిన వీడియోల్లో చంద్రుడు అతి భారీ పరిమాణంలో కనువిందు చేస్తూ కనిపిస్తున్నాడు. అత్యంత శక్తిమంతమైన ఆర్టెమిస్ రాకెట్ ద్వారా గత బుధవారం ఓరియాన్‌ను నాసా ప్రయోగించడం తెలిసిందే. ఇందులో మనుషులను పోలిన మూడు డమ్మీలను పంపారు. 50 ఏళ్ల క్రితం నాసా చేపట్టిన అపోలో మిషన్ తర్వాత చంద్రున్ని చేరిన తొలి అంతరిక్ష ప్రయోగం ఇదే. ఇది విజయవంతమైతే తర్వాతి మిషన్లో మనుషులను, 2024లో మూడో మిషన్లో వ్యోమగాములను పంపనున్నారు. సరిగ్గా ఓరియాన్ చంద్రునికి అత్యంత సమీపానికి చేరిన సమయానికే అరగంట పాటు దాన్నుంచి కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోవడంతో ఏం జరిగిందో తెలియక ఒక దశలో గందరగోళం నెలకొంది. అంతా అనుకున్నట్టుగా జరిగితే శుక్రవారం మరో ఇంజన్‌ను పేల్చడం ద్వారా ఓరియాన్‌ను చంద్రుని కక్ష్యలోకి పూర్తిగా ప్రవేశపెడతారు. చంద్రునిపై దిగకుండా దాదాపు వారంపాటు అది కక్ష్యలోనే గడుపుతుంది. అనంతరం డిసెంబర్ 11న భూమికి తిరిగి రావాలన్నది ప్లాన్.

'గగన్‌యాన్'లో ముందడుగు... పారాచూట్ల పరీక్ష సక్సెస్



న్యూఢిల్లీ: ఇస్రో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మానవసహిత అంతరిక్ష కార్యక్రమం 'గగన్‌యాన్'కు ఏర్పాట్లన్నీ చకచకా జరుగుతున్నాయి. మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లే మన ఆస్ట్రోనాట్లను సురక్షితంగా భూమ్మీదికి తిరిగి తీసుకొచ్చేందుకు వాడబోయే పారాచూట్లను విజయవంతంగా పరీక్షించారు. ఇంటిగ్రేటెడ్ మెయిన్‌పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ (ఐఎంఏటీ)గా పిలిచే ఈ పరీక్షను ఉత్తరప్రదేశ్‌లో ఝాన్సీ జిల్లాలోని బబీనా ఫీల్డ్ ఫైర్ రేంజ్ (బీఎఫ్ఎఫ్ఆర్) నుంచి విక్రం సారాబాయి స్పేస్ సెంటర్ పర్యవేక్షణలో శనివారం నిర్వహించారు. పరీక్షలో భాగంగా ఐదు వేల కిలోలున్న డమ్మీ పేలోడ్‌ను 2.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్–76 విమానం ద్వారా జారవిడిచారు. తర్వాత ప్రధాన పారాచూట్లను తెరిచారు. ''పేలోడ్ వేగాన్ని అవి సురక్షిత వేగానికి తగ్గించాయి. మూడు నిమిషాల్లోపే దాన్ని భూమిపై సురక్షితంగా లాండ్ చేశాయి. నిజానికి ప్రధాన పారాచూట్లలో ఒకటి సకాలంలో తెరుచుకోలేదు. ఇది కూడా మంచి ఫలితమేనని చెప్పాలి. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడే అంతిమంగా పూర్తిగా లోపరహితమైన పారాచూట్లను గగన్‌యాన్ కోసం సిద్ధం చేయగలుగుతాం'' అని సారాబాయ్ సెంటర్ పేర్కొంది. ''గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ వ్యవస్థలో మొత్తం 10 పారాచూట్లుంటాయి. ముందుగా అపెక్స్ కవర్ సపరేషన్ పారాచూట్లు రంగంలోకి దిగుతాయి. తర్వాత రాకెట్ వేగాన్ని బాగా తగ్గించడంతో పాటు దాని దిశను స్థిరీకరించే డ్రాగ్ పారాచూట్లు విచ్చుకుంటాయి. నిజానికి ఆస్ట్రోనాట్లు సురక్షితంగా దిగేందుకు రెండు ప్రధాన పారాచూట్లు చాలు. ముందు జాగ్రత్తగా మూడోదాన్ని కూడా సిద్ధంగా ఉంచనున్నాం'' అని ఇస్రో వివరించింది. డీఆర్‌డీఓతో కలిసి ఈ పారాచూట్లను రూపొందించారు.

ఇండోనేసియాలో భూకంపం



సియాంజూర్‌లో నేలమట్టమైన ఇళ్లు



సియాంజూర్ ఆస్పత్రి ఆవరణలోనే క్షతగాత్రులకు చికిత్స

162 మంది దుర్మరణం

- వందలాది మందికి గాయాలు
- రిక్టర్ స్కేల్‌పై 5.6 గా నమోదు

జకార్తా: ఇండోనేసియాలోని జావా ద్వీపం సోమవారం భారీ భూకంపం ధాటికి చిగురుటాకులా వణికిపోయింది. డజన్ల కొద్దీ భవంతులు పేకమేడల్లా నేల మట్టమయ్యాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. భవంతులు కూలిన ఘటనల్లో మొత్తంగా 162 మంది ప్రాణాలు కోల్పోయారని పశ్చిమ జావా గవర్నర్ రిద్వాన్ కమిల్ చెప్పారు. వందలాది మంది గాయాలపాలయ్యారు. మరణాల సంఖ్య భారీగానే ఉండొచ్చని గవర్నర్ అన్నారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులే ఉండటం అందర్నీ కలచివేస్తోంది. సియాంజుర్ పట్టణంలో ఇస్లామిక్ బోర్డింగ్ స్కూళ్లు, మసీదులు ఎక్కువ. ఇక్కడి ఇస్లామిక్ స్కూళ్లలో డే క్లాసులు పూర్తయ్యాక అదనపు క్లాసుల కోసం చాలా మంది విద్యార్థులు స్కూళ్లలోనే ఉండిపోయారు. అదే సమయంలో భూకంపం రావడంతో పాఠశాల భవంతులు కూలి ఎక్కువ మంది చిన్నారులు విగతజీవులయ్యారు. ప్రకంపనల ధాటికి జనం ఇళ్లు, కార్యాలయాలు వదిలి బయటకు పరుగులుపెట్టారు. చాలా మంది భవనాల శిథిలాల కింద చిక్కుకున్నారు. జాతీయ విపత్తు దళం వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యల్లో నిమగ్నమైంది. పెద్ద సంఖ్యలో ఉన్న క్షతగాత్రులను స్థానికులు పికప్ ట్రక్కులు, బైక్‌లపై ఆస్పత్రులకు తరలించారు. అధిక జనాభా ఉన్న జావా పట్టణంలో చాలా చోట్ల ప్రజలు రోడ్లపైకి చేరి భయంతో బిక్కుబిక్కుమంటూ కనిపించారు. ఆగకుండా వస్తున్న క్షతగాత్రులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులను రోడ్లపైనే పడుకోబెట్టి చికిత్స చేస్తున్నారు. ఆరుబయట పార్కింగ్ ప్రాంతాల్లోనే చికిత్సచేస్తున్నారు. రక్తమోడుతున్న చిన్నారులను ఆస్పత్రికి తీసుకొస్తున్న దృశ్యాలతో పరిస్థితి హృదయ విదారకంగా మారింది. ఆస్పత్రి, పాఠశాల సహా పలు భవంతులు నేలకూలాయి. ఆస్పత్రి కూలి ఎక్కువ మంది చనిపోయారని వార్తలొచ్చాయి. సోమవారం మధ్యాహ్నం వేళ రిక్టర్ స్కేల్‌పై 5.6 తీవ్రతతో వచ్చిన భూకంపం పశ్చిమ జావాలోని సియాంజూర్ రీజియన్‌లో భూమికి 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని ఆ దేశ జాతీయ విపత్తు సంస్థ వెల్లడించింది. సియాంజూర్‌లో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. 'మూడుసార్లు భూమి కంపించింది. మొదటిసారి ఆగకుండా పది సెకన్లపాటు కుదిపేసింది' అని స్థానికురాలు దేవి రిస్మా చెప్పారు. 'భవంతి ఊగిపోతున్నప్పుడు 14వ అంతస్తులో ఉన్నాను. మెట్లు దిగి కిందికొచ్చేటప్పుడు పై ప్రాణాలు పైనే పోయాయి' అని మహిళా లాయర్ మయాదిత చెప్పారు. భూకంపం తర్వాత సైతం 1.8 నుంచి 4 తీవ్రతతో దాదాపు 25 సార్లు ప్రకంపనలు కనిపించాయని ఆ దేశ భూకంపాలు, జియోఫిజిక్స్ ఏజెన్సీ తెలిపింది. ఇళ్లు ధ్వంసమై నిరాశ్రయులైన 13,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సిజేదిల్ గ్రామంలో శిథిలాల కింద 24 మంది చిక్కుకుని సాయంకోసం అర్థిస్తున్నారు. 27 కోట్ల జనాభా గల ఇండోనేసియాలో భూకంపాలు, అగ్నిపర్వతాలు బద్దలవడం, సునామీలు సర్వసాధారణం. 2004లో హిందూ మహా సముద్రం అడుగున ఏర్పడి విలయం సృష్టించిన భారీ భూకంపం వెనువెంటనే సునామీ ధాటికి 2.3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు.

సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తికి... రూ.2.11 కోట్లు, కారు



రోహ్‌తక్: ధర్మపాల్ అలియాస్ కాలా.. హరియాణా రాష్ట్రం రోహ్‌తక్ జిల్లా చిరీ గ్రామ వాస్తవ్యుడు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రజల విజ్ఞప్తి మేరకు పోటీ చేశాడు. కేవలం 66 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యాడు. ఈ ఓటమి గ్రామస్తులను కదిలించింది. ఆయనకు మద్దతుగా నిలిచారు. ధర్మపాల్‌ను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించారు. అందరూ కలిసి రూ.2.11 కోట్ల విరాళాలు సేకరించారు. గ్రామంలో ప్రత్యేకంగా సభ ఏర్పాటు చేసి, ధర్మపాల్‌ను ఘనంగా సత్కరించి, రూ.2.11 కోట్ల నగదు అందజేశారు. అంతేకుండా ఖరీదైన స్కార్పియో కారు కూడా బహూకరించారు. ఈ సన్మాన సభలో చిరీలోని అన్ని కులాల పెద్దలు పాల్గొన్నారు. ధర్మపాల్ ఒంటరివాడు కాదని, ఓటమితో కుంగిపోవాల్సిన అవసరం లేదని తెలియజెప్పడానికే నగదు, కారు అందజేశామని కులపెద్ద భలేరామ్ చెప్పారు. గ్రామస్తుల ఔదార్యాన్ని చూసి ధర్మపాల్ కళ్లు చెమర్చాయి. జనం కోసమే తాను జీవిస్తానని, వారి బాగు కోసం కృషి చేస్తానని చెప్పాడు. ఆయన గతంలో లఖాన్ మాజ్రా బ్లాక్ సమితి చైర్మన్‌గా పనిచేశాడు.

తల్లీబిడ్డలను వేరుచేస్తున్నారు

- గిరిజనులను నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ
- గుజరాత్ ప్రచార సభలో రాహుల్



మహువా: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తొలిసారిగా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వంలో అడుగుపెట్టారు. రాష్ట్ర అధికార బీజేపీపై విమర్శలు ఎక్కుపెట్టారు. సోమవారం ఆయన సూరత్ జిల్లాలోని మహువాలో జరిగిన భారీ బహిరంగ సభలో గిరిజనులనుద్దేశిస్తూ ప్రసంగించారు. 'బీజేపీ మిమ్మల్ని తాత్కాలిక వనవాసులు అంటోంది. కానీ, గిరిపుత్రులే అడవికి అసలైన యజమానులు. రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు అటవీభూములను ధారాదత్తంచేస్తూ గిరిజనులను తమ అడవి తల్లికి దూరంచేస్తోంది. ఇక్కడ మీ బాగోగులను ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. దీంతో ఆధునిక విద్య, వైద్యానికి మీ పిల్లలు దూరమవుతున్నారు. మీ పిల్లలు ఇంగ్లిష్ మాట్లాడుతూ వైద్యులు, ఇంజనీర్లు, పైలట్లు కావడం బీజేపీ సర్కార్‌కు ఇష్టంలేదు' అని రాహుల్ దుయ్యబట్టారు. రాజ్‌కోట్‌లో జరిగిన మరో ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

బీజేపీతోనే రైతులకు కష్టాలు

మహారాష్ట్రలో కర్షకులు, యువత, గిరిజనులను పట్టిపీడిస్తున్న కష్టాలకు అసలు కారణం బీజేపీయేనని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలో 380 కిలోమీటర్ల పొడవునా కొనసాగిన భారత్ జోడో యాత్రనుద్దేశిస్తూ రాహుల్ సోమవారం ఒక ప్రకటన విడుదలచేశారు. పంటల బీమా పథకాల వైఫల్యం కారణంగా రైతులు కష్టాలు పడుతున్నారని వాపోయారు.

అధికారం కోసమే జోడో యాత్ర



సురేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అధికారం కోల్పోయినవారు మళ్లీ గద్దెనెక్కడానికి పాదయాత్ర సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. వారిని చాలా ఏళ్ల క్రితమే ప్రజలు గద్దెదింపారని చెప్పారు. మోదీ సోమవారం గుజరాత్‌లోని సురేంద్రనగర్, నవసారి, జంబూసార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి గురించి మాట్లాడకుండా, తన(మోదీ) ఔకత్(స్థాయి) ఏమిటో బయటపెడతామని సవాళ్లు విసురుతున్నారని ఆక్షేపించారు. వారి అహంకారాన్ని ప్రజలు గమనించాలని కోరారు. వారు(కాంగ్రెస్ పెద్దలు) రాజకుటుంబం నుంచి వచ్చారని, తాను కేవలం ఒక సేవకుడినని, తనకు పెద్ద స్థాయి లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు గతంలో తనను దిగజారుడు భాషలో దూషించారని గుర్తుచేశారు. స్థాయిల సంగతి పక్కనపెట్టి అభివృద్ధి గురించి మాట్లాడుకుందామని ప్రతిపక్షానికి హితవు పలికారు. తన దృష్టి మొత్తం దేశ ప్రగతి పైనే ఉందని.. అవమానాలు, దూషణలను జీర్ణించుకుంటానని చెప్పారు.

గుజరాత్ ఉప్పు తింటూ అవమానిస్తున్నారు

నర్మదా ప్రాజెక్టును అడ్డుకొని, గుజరాత్ గొంతెండిపోయేలా చేసినవారిని పక్కన పెట్టుకొని పాదయాత్ర చేస్తున్నారని రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ మండిపడ్డారు. నర్మదా ప్రాజెక్టును వ్యతిరేకించిన వారికి గుజరాత్ ప్రజలు బుద్ధిచెప్తారని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అప్పట్లోనే తాను గట్టిగా వాదించానని, ఇప్పుడు ఈ లాభాలు కళ్లముందే కనిపిస్తున్నాయని వివరించారు. పాదయాత్ర చేస్తున్న వారికి వేరుశనగ పంటకు, పత్తి పంటకు మధ్య తేడా తెలియదని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కొందరు వ్యక్తులు గుజరాత్‌లో తయారవుతున్న ఉప్పు తింటూ గుజరాత్‌నే అవమానిస్తున్నారని తప్పుపట్టారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం ఉప్పులో గుజరాత్ వాటా 80 శాతం ఉందని గుర్తుచేశారు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను కొన్ని స్థానాల్లో గెలిపించడం ద్వారా సురేంద్రనగర్ జిల్లా ప్రజలు పొరపాటు చేశారని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు.

పట్టాలు తప్పి ప్లాట్‌ఫాంపైకి గూడ్స్



ఎఫ్‌ఓబీ పైకి దూసుకుపోయిన రైలు

భువనేశ్వర్: గూడ్స్ రైలు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో పట్టాలు తప్పిన ఖాళీ బోగీలు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లాయి. ఈ ఘటనలో రైలు కోసం ఎదురుచూస్తున్న ముగ్గురు మహిళా ప్రయాణికులు మృతి చెందారు. మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఒడిశాలోని జజ్‌పూర్ జిల్లా కొరాయ్ రైల్వేస్టేషన్‌లో సోమవారం సంభవించింది. ఖాళీ బోగీలతో వెళ్తున్న గూడ్స్ రైలు డ్రైవర్ రైల్వే స్టేషన్ వద్ద సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో 8 వ్యాగన్లు పట్టాలు తప్పాయి.

అత్యవసర ఔషధాల జాబితాలో కరోనరీ స్టెంట్లు

న్యూఢిల్లీ: కరోనరీ స్టెంట్లను అత్యవసర ఔషధాల జాతీయ జాబితా(ఎన్ఎల్ఈఎం–2022)లో చేరుస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది.

నిపుణుల కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. మెటల్ సెంట్లు(బీఎంఎస్), మందు పూత పూసిన స్టెంట్లు(డీఈఎస్)ను ఈ జాబితాలో చేర్చారు. ఇన్నాళ్లూ 'పరికరాల' జాబితాలో ఉన్న స్టెంట్లను ఔషధాలుగా అత్యవసర ఔషధాల జాబితాలో చేర్చడం వల్ల ఎంబీఎస్, డీఈఎస్‌తోపాటు బీవీఎస్, బయోడిగ్రేడబుల్ సెంట్ల ధరలు తగ్గనున్నాయి. ధరలపై నేషనల్ ఫార్మాస్యూటికల్, ప్రైసింగ్ అథారిటీ(ఎన్‌పీపీఏ) తుది నిర్ణయం తీసుకోనుంది. దేశంలో కరోనరీ ఆర్టరీ వ్యాధులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో స్టెంట్ల ధరల తగ్గుదల వల్ల బాధితులకు ఎంతో ఉపశమనం కలుగనుంది. అత్యవసర ఔషధాల జాతీయ జాబితాలో 2015లో 376 ఔషధాలు ఉండేవి. ఇప్పుడు వీటి సంఖ్య 384కు చేరింది. ఎన్ఎల్ఈఎంలో ఉన్న మందులను ఎన్‌పీపీఏ నిర్దేశించిన ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించడానికి వీల్లేదు.

వారసుల పైనే ఆశలు!

- ఒకేదారిలో కాంగ్రెస్, బీజేపీ
- 13 మంది వారసులకు కాంగ్రెస్, ఏడుగురికి బీజేపీ టికెట్లు

గుజరాత్ సమరం

వారసత్వ రాజకీయాలు.. దేశాన్ని పట్టిపీడిస్తున్న జాడ్యమని కేవలం ప్రజాస్వామ్యవాదులే కాదు, సాక్షాత్తూ రాజకీయ పార్టీలు సైతం నిందిస్తుంటాయి. ఆచరణలో మాత్రం అన్ని పార్టీలదీ అదే వరుస. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని చెప్పే పార్టీలు చివరకు గెలుపు గుర్రాల పేరుతో వారసులకే పట్టం కడుతున్నాయి. రాజకీయాల్లో వారసత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించే అధికార బీజేపీ గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో అదే బాటలో సాగుతోంది. గుజరాత్ ఎన్నికల్లో చాలాచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల పుత్రరత్నాలే అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రంలో 182 అసెంబ్లీ స్థానాలుండగా, దాదాపు 20 స్థానాల్లో వారసులకే పార్టీలు టికెట్లిచ్చాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ 13 మందికి, బీజేపీ ఏడుగురికి టికెట్లు ఇవ్వడం గమనార్హం.



ప్రోత్సాహం ఇందుకే..

ఆర్థికంగా బలవంతులు కావడం, ఎన్నికల్లో ప్రత్యర్థులను ఢీకొట్టే సామర్థ్యం ఉండడం, కొన్ని సందర్భాల్లో ప్రత్యామ్నాయంగా మరో అభ్యర్థి లేకపోవడం వంటి కారణాలతో పార్టీలు వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పదిసార్లు విజయం సాధించిన గిరిజన నేత మోహన్ సిన్హ్ రాథ్వా ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు. బీజేపీ అధిష్టానం ఆయన కుమారుడు రాజేంద్ర సిన్హ్ రాథ్వాకు ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన చోటా ఉదయ్‌పూర్ టిక్కెట్ కేటాయించింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా రైల్వే శాఖ మాజీ సహాయ మంత్రి నరాన్‌బాయి రాథ్వా కుమారుడు సంగ్రామ్ సిన్హ్ రాథ్వా పోటీ చేస్తుండడం గమనార్హం. సనంద్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే కరణ్ సిన్హ్ పటేల్ కుమారుడు కానూ పటేల్ పోటీకి దిగుతున్నారు. థాస్రా నియోజకవర్గంలో బీజేపీ టిక్కెట్‌ను కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే రామ్ సిన్హ్ పర్మార్ కుమారుడు యోగేంద్ర పర్మార్ దక్కించుకున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

వారసత్వం.. మా హక్కు

అన్ని పార్టీల్లో కొన్ని కుటుంబాలు రాజకీయాలను తమకు దక్కిన వారసత్వంగా భావిస్తున్నాయని రాజకీయ విశ్లేషకుడు రవీంద్ర త్రివేది చెప్పారు. తమ నియోజకవర్గాలపై పట్టు నిలుపుకుంటున్నాయని పేర్కొన్నారు. చాలాచోట్ల ప్రత్యామ్నాయం లేకపోవడంతో పార్టీలు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో వారసత్వాన్ని అంగీకరించాల్సి వస్తోందని వెల్లడించారు. బలమైన నేతలు ఉన్న నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు మరొకరు సాహసించడం లేదని చెప్పారు. ఫలితంగా అక్కడ వారసులే పాగా వేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఒకవేళ నేతలను పక్కనపెట్టాల్సి వస్తే ఎన్నికల్లో పోటీ చేయడానికి వారి కుమారులు, కుమార్తెలు, భార్యలే పార్టీలకు దిక్కవుతున్నారని తెలియజేశారు.

మాజీ సీఎం కుమారుడికి మళ్లీ చాన్స్

దనిలీమ్డా స్థానంలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మనూబాయి పర్మార్ కుమారుడు శైలేశ్ పర్మార్‌కు ఆ పార్టీ నుంచి టికెట్ లభించింది. బయాడ్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి శంకర్‌సిన్హ్ వాఘేలా కుమారుడు, మాజీ ఎమ్మెల్యే మహేంద్రసిన్హ్ వాఘేలా మరోసారి పోటీ చేస్తున్నారు. 2019లో బీజేపీలో చేరిన మహేంద్రసిన్హ్ వాఘేలా గత నెలలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గుజరాత్ మాజీ సీఎం అమర్‌సిన్హ్ చౌదరీ కుమారుడైన తుషార్ చౌదరీ బార్డోలీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

రష్యాలో ఒళ్లు విరుచుకున్న అగ్నిపర్వతాలు



మాస్కో: రష్యాలో రాజధాని మాస్కోకు 6,600 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో కంచట్కా ద్వీపకల్పంలో రెండు అగ్నిపర్వతాలు నిద్రాణ స్థితి నుంచి మేల్కొని ఒళ్లు విరుచుకున్నాయి. భారీ పరిమాణంలో లావాను వెదజల్లుతున్నాయి. వాటినుంచి వెలువడుతున్న లావా, ధూళి మేఘాలు సుదూరాల దాకా కన్పిస్తున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. అతి త్వరలో పూర్తిస్థాయిలో బద్దలయ్యే ప్రమాదముందన్నారు. శనివారం సంభవించిన గట్టి భూకంపమే ఇందుకు కారణమట. వీటిలో క్లుచెవ్‌స్కయా సోప్కా అగ్నిపర్వతం నుంచి గంటకు ఏకంగా పదిసార్లు భారీ పేలుళ్లు వెలువడుతున్నాయట! 4,754 మీటర్ల ఎత్తులో ఉన్న ఇది యురేషియాలోకెల్లా అత్యంత ఎత్తైన అగ్నిపర్వతం. కంచట్కా ద్వీపకల్ప ప్రాంతం ఏకంగా 30కి పైగా చురుకైన అగ్నిపర్వతాలకు నిలయం!

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 22 । నవంబర్ । 2022



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గాంధీనగర్: మునిసిపల్ స్కూల్స్ హెచ్ఎంలకు డీడీఓ పవర్స్ ఇవ్వడంపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. విజయవాడలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



బెజవాడ రైల్వే ఉద్యోగికి కాంస్యం

విజయవాడ డివిజన్ మెకానికల్ విభాగం ఉద్యోగి శ్రీనివాసులు ఉదయకుమార్ ఆల్ ఇండియా రైల్వే బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించారు. -8లో▸



ఈత కొలనులో పతకాల పంట

జగ్గయ్యపేట అర్బన్: నేపాల్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి ఈత పోటీల్లో జగ్గయ్యపేట స్విమ్మర్లు పతకాల పంట పండించారు. 19 స్వర్ణం, రెండు రజిత, ఒక కాంస్య పతకంతో సత్తాచాటారు.

న్యూస్‌రీల్

ఆలయాల్లో కార్తిక సందడి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం చివరి సోమవారాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువ జామునే పుణ్య స్నానాలు ఆచరించి శైవక్షేత్రాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం వేళ శివాలయాల ప్రాంగణాల్లో దీపారాధనలు నిర్వహించారు. విజయవాడ వన్‌టౌన్ శివాలయం దీపాల వెలుగుల్లో కాంతులీనింది.

మహిళ హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

విజయవాడ స్పోర్ట్స్: భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ ఐదో అదనపు జిల్లా కోర్టు జడ్జి ఐ.శైలజాదేవి సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడ కొత్తపేటకు చెందిన మహిళకు సింగ్‌నగర్‌కు చెందిన చిల్లా వెంకటేష్‌రెడ్డితో 2007లో వివాహం జరిగింది. వెంకటేష్‌రెడ్డి పెళ్లి నాటి నుంచి అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఉండేవాడు. 2017 జనవరి 20వ తేదీన భార్యను గొంతు కోసి హత్య చేశాడు. ఈ కేసులో 18 మంది సాక్షులను న్యాయమూర్తి విచారించారు. బాధితుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్.విష్ణువర్ధన్ కోర్టుకు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వెంకటేష్‌రెడ్డికి జీవిత కాల కఠిన కారాగార శిక్ష, రూ.7 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కల్లాల్లో ధాన్యం మిల్లులకు తరలింపు



రామవరప్పాడు(గన్నవరం): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సివిల్ సప్లయిస్ డీఎం పి.శివరామమూర్తి సోమవారం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, గుణదల ప్రాంతాల్లో పర్యటించారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఖరీఫ్‌లో రైతులు కష్టపడి పండించిన పంటను నష్టపోకుండా హుటాహుటిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఎనికేపాడులోని వీరయ్య మిల్లు, నైనవరంలోని శ్రీ సత్యనారాయణ మిల్లులకు సుమారు 2,500 క్వింటాళ్ల ధాన్యాన్ని దగ్గరుండి తరలించారు. రామవరప్పాడు సొసైటీ రైతులకు గన్నీ బ్యాగులతో పాటు ట్రాన్స్‌పోర్టు, హమాలీ సౌకర్యాలు కల్పించి, మిల్లులకు ధాన్యం తరలించేందుకు సహకరించింది. ఈ సందర్భంగా శివరామమూర్తి మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సొసైటీ చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, ఏఓ రంగనాథ్, ఆర్బీకే, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బొట్టు బొట్టునూ లెక్కిద్దాం

- విజయవాడలో 24/7 నీటి సరఫరాకు కసరత్తు
- హెడ్ వాటర్ వర్క్స్ నుంచి పూర్తిస్థాయి సరఫరాకు ఏర్పాట్లు
- స్కాడా వ్యవస్థను ఆధునికీకరిస్తున్న వీఎంసీ
- ప్రధాన పైపులైన్లకు మీటర్ల ఏర్పాటు
- లీకేజీలు లేకుండా నిరంతర పర్యవేక్షణ

నీటి వృథాను అరికట్టేందుకు వీఎంసీ చర్యలు



విజయవాడలోని హెడ్ వాటర్ వర్క్స్

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడలో తాగునీటి సరఫరాలో అవాంతరాలను అధిగమించేందుకు నగరపాలక సంస్థ (వీఎంసీ) చర్యలు చేపట్టింది. శివారు ప్రాంతాల్లో కొద్దిసేపు మాత్రమే నీటి సరఫరా అవుతోందని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ విశాఖపట్నం తాగునీటి సరఫరా వ్యవస్థ మాదిరి విజయవాడలోని 64 డివిజన్లలో నిరంతరాయంగా తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం రిజర్వాయర్లు, పైపులైన్ల సామర్థ్య గణన చేపడుతున్నారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, మధురానగర్, రామకృష్ణపురం, పటమట వంటి శివారు ప్రాంతాలతోపాటు చిట్టినగర్, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, విద్యాధరపురం, గుణదల, మాచవరం వంటి కొండప్రాంతాల్లో నీటిని పంపింగ్ చేసేందుకు బూస్టర్ల సామర్థ్యాన్ని మరింత పెంచేలా చర్యలు చేపడుతున్నారు. దీనికోసం కృష్ణా నదిలోని హెడ్ వాటర్ వర్క్స్ వద్ద 16 ఎంజీఎల్‌డీ (మిలియన్ గ్యాలన్ లీటర్ పర్ డే)సంప్‌ను సిద్ధం చేస్తున్నారు. రామలింగేశ్వనగర్‌లోని 10 ఎంజీడీ, అజిత్‌సింగ్‌నగర్, ఆటోనగర్, విద్యాధరపురం, ప్రాంతాల్లో ప్రధాన రిజర్వాయర్లు ఉన్నా నిత్యం సగటున వ్యక్తికి 160 లీటర్ల డిమాండ్ ఉండగా 120 లీటర్లు సప్లై చేస్తున్నారు. డిమాండ్‌కు తగి నట్లు నిరంతర నీటిసరఫరాకు చర్యలు చేపట్టారు.

నీటి వృథాను అరికట్టేలా..

నగరంలో పైపులైన్ల లీకేజీ వల్ల వేలలీటర్ల నీరు వృథాగా పోతోంది. దీంతో ఆయా ప్రాంతాలకు డిమాండ్ మేరకు నీటి సరఫరా జరగటం లేదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ పథకంలో భాగంగా నగరంలోని స్కాడా (సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఎక్విజిషన్)లో సమూల మార్పులు చేస్తున్నారు. కొంతకాలంగా ఈ విధానంలో నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అవాంతరాలు చోటుచేసుకోవటంతో ఆధునికీకరణ చేస్తున్నారు.

ట్యాంకర్ల అవసరం లేకుండా..

ప్రాంతాల వారీగా నీటి కనెక్షన్లు, సరఫరా విధానం, కొండ ప్రాంతాల్లో అవసరాలను పరిగణనలోకి తీసుకుని ట్యాంకర్ల వ్యవస్థ లేకుండా మొత్తం పైపులైన్ల ద్వారా కుళాయి కనెక్షన్ల నుంచి నిరంతరాయ సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి వీధిలో తాగునీటి సరఫరా పైప్‌లైన్లకు మీటర్లు ఏర్పాటు చేసి అక్కడ డిమాండ్‌ను బట్టి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. ఈ మీటర్ల ద్వారా సగటున రోజుకు ఎన్ని లీటర్ల వినియోగం అవుతున్నదీ లెక్కించి.. డిమాండ్ బట్టి సరఫరా జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

అన్ని డివిజన్లకు 24 గంటల సరఫరా..

నగరంలోని అన్ని డివిజన్లకు త్వరలోనే 24 గంటల నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. శివారు ప్రాంతాల్లో పాతలైన్లను మరమ్మతులు చేయటంతోపాటు నూతన లైన్లు కూడా వేస్తున్నాం. నీటి సరఫరా మానిటరింగ్‌కు స్కాడాను ఆధునికీకరిస్తున్నాం.

– ఎం. ప్రభాకర్, సీఈ, వీఎంసీ

నీటి వృథాకు చెక్..

నగరంలోని 64 డివిజన్లలో తాగునీటి సరఫరా ఉండే రిజర్వాయర్లు, వాటర్‌ట్యాంకులు సరఫరా పైపులకు మీటర్లను అమర్చటం ద్వారా ప్రతినీటి బొట్టును లెక్కించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. లీకులకు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టవచ్చని, నిరంతరాయంగా నీటి సరఫరా చేయటం వినియోగదారులు కూడా నీటి వినియోగం తగ్గించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఆయా మీటర్లను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తే ఎప్పటికప్పుడు తాగునీటి సరఫరాను పర్యవేక్షించి, అవాంతరాలను అధిగమించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

పోలీసులకు నగదు రివార్డ్‌లు



నగదు రివార్డులు అందజేస్తున్న సీపీ టి.కె.రాణా

భవానీపురం(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా నగదు రివార్డ్‌లతో అభినందించారు. ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదయిన పలు దొంగతనం కేసుల్లో తక్కువ సమయంలో నేరస్తులను పట్టుకోవడంతోపాటు చోరీ సొత్తును రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించిన 30 మంది క్రైమ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సోమవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగదు రివార్డ్‌లను అందజేశారు. అడిషనల్ డీసీపీ (క్రైమ్) పి.వెంకటరత్నం, ఏసీపీ(క్రైమ్) చలసాని శ్రీనివాసరావు, ఏసీపీ (క్రైమ్) బి.ఆదినారాయణ, ఇన్‌స్పెక్టర్లు పి.కృష్ణ, ఎం.రామ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్లు జి.కృష్ణారావు, ఎస్.ఫ్రాన్సిస్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు బి.వి.స్వామి, సీహెచ్.సత్యనారాయణ, డి.ప్రభాకర్, హెడ్ కానిస్టేబుల్స్ కె.ప్రవీణ్‌కుమార్, ఎం.ప్రకాష్‌రావు, కె.గౌరీశంకర్‌బాబు, కానిస్టేబుల్స్ జి.శ్రీధర్, జి.సురేష్, ఎం.పూర్ణచంద్రరావు, ఎం.నాగేశ్వరరావు, కె.ఫణిరాజు, ఆర్.వి.ఎస్.అనిల్ కుమార్, ఎ.వి.సుబ్బారావు, వై.రమేష్ కుమార్, జి.సత్తిబాబు, ఎ.దుర్గాకుమార్, పి.రాంబాబు, సీహెచ్.ఎం.ఎస్.నారాయణ, జి.సురేష్, ఎ.అవినాష్, అబ్దుల్ వాహెద్, పి.రమేష్ నాయుడు రివార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ డి.మేరీప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్య సిరి

- రెండు జిల్లాల్లో ఆరోగ్య శ్రీ డిసిప్లినరీ కమిటీలు
- రోగుల వద్ద డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు
- సేవలు నిరాకరిస్తే నెట్‌వర్క్ జాబితా నుంచి ఆస్పత్రుల తొలగింపు
- రోగులు సంతృప్తి చెందేలా మెరుగైన వైద్య సేవలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తోంది. ఈ పథకంలో అందించే సేవలను సైతం ఇటీవల మరింత విస్తరించింది. ప్రస్తుతం 3,255 ప్రొసీజర్లలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలను నిరాకరించినా, ఈ పథకం కింద చికిత్స పొందుతున్న రోగుల వద్ద డబ్బులు వసూలు చేసినా కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే ప్రభుత్వం హెచ్చరించింది. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో డిసిప్లినరీ (క్రమశిక్షణ) కమిటీలను ఏర్పాటు చేసింది.

రెండు జిల్లాల్లో డిసిప్లినరీ కమిటీలు

ఆరోగ్య శ్రీ సేవలపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించేందుకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో డిసిప్లినరీ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో కలెక్టర్‌తో పాటు, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా ఆరోగ్య శ్రీ సమన్వయకర్త, మరో నామినేటెడ్ సభ్యుడు ఉంటారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరంను సభ్యుడిగా నామినేట్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటైన తర్వాత తొలిసారి ఆరోగ్య శ్రీ క్రమశిక్షణా సంఘం సమావేశం ఇటీవల జరిగింది. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

ఆరోగ్య శ్రీ రోగులకు సేవలు అందించేందుకు ఇబ్బందులకు గురిచేసినా, డబ్బులు వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటారు. ఏ ఆస్పత్రిలో అయినా ఆరోగ్య శ్రీ రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే, ఆ మొత్తానికి పందింతల జరిమానాను క్రమశిక్షణ సంఘం విధిస్తుంది. ఆరోగ్య శ్రీ కార్డు తీసుకుని వస్తే పూర్తిగా ఉచిత సేవలు అందించాల్సిందేనని నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులకు అధికారులు తేల్చిచెప్పారు. రోగులకు వైద్య చేసే విషయంలో నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకోనున్నారు.

వైద్యం నిరాకరిస్తే గుర్తింపు రద్దు

ఆరోగ్య శ్రీలో వర్తించే వ్యాధులకు వైద్యం చేసేందుకు నిరాకరించే ఆస్పత్రులపై కొరడా ఝులిపిస్తారు. వైద్యం చేసేందుకు నిరాకరించినట్లు ఫిర్యాదు వస్తే అలాంటి ఆస్పత్రులను ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ జాబితా నుంచి తొలగిస్తారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన సహాయం అందించేందుకు ఆరోగ్య మిత్రలు అందుబాటులో ఉంటారు. రోగికి ఎలాంటి సమాచారం కావాలన్నా వారు అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..
ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు : 198
ప్రైవేటు ఆస్పత్రులు : 61
డెంటల్ ఆస్పత్రులు : 33
ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రులు : 2
సీహెచ్‌సీ, ఏరియా, పీహెచ్‌సీలు :102
మొత్తం ఆరోగ్యశ్రీ కార్డులు : 13.50 లక్షలు

మెరుగైన వైద్యమే లక్ష్యం



ఆరోగ్య శ్రీ పథకంలో ప్రతి రోగికీ మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. అందులో భాగంగా జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎవరైనా వైద్య సేవలు అందించేందుకు డబ్బులు డిమాండ్ చేసినా, సేవలు నిరాకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే జిల్లా క్రమ శిక్షణా సంఘం సమావేశంలో కలెక్టర్ హెచ్చరించారు. ఆరోగ్యమిత్రలు ప్రతి ఆస్పత్రిలో అందుబాటులో ఉండి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటారు.

– డాక్టర్ జి.సుమన్, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త

మిస్‌మిసలు



జూనియర్ ఇంటర్మీడియెట్ విద్యార్థినులు ర్యాంప్‌పై క్యాట్ వాక్‌తో సందడి చేశారు. తమ వేషధారణతో ఆకట్టుకున్నారు. క్రిస్మస్ ఫెట్ డే వేడుకలు స్టెల్లా కళాశాలలో సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ ఈ వేడుకలను ప్రారంభించారు. మిస్ బ్లాక్, మిస్ బ్లూ ఫ్యాషన్ షోలో విద్యార్థినులు హొయలొలికించారు. మిస్ బ్లూ పోటీల్లో అర్పిత, మోక్షజైన్, తబస్సు, మిస్ బ్లాక్ పోటీల్లో అనుష్క, దయానా, కీర్తి వరుసగా తొలిమూడు స్థానాల్లో నిలిచారు.

– పటమట(విజయవాడతూర్పు)

పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించాలి

మచిలీపట్నం: కృష్ణా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మంగళ, బుధవారాల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించాలని డీఈఓ తాహెరా సుల్తానా ఆదేశించారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. డీఈఓ మాట్లాడుతూ.. అన్ని ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌కు సంబంధించిన ప్రదర్శనలు నిర్వహించాలని స్పష్టం చేశారు. పర్యావరణ హిత పదార్థాలు, ఆరోగ్యం – పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ – యాప్‌లు, పర్యావరణం – వాతావరణంలో మార్పులు, గణితం వంటి అంశాల్లో విద్యార్థులతో ప్రాజెక్టులను తయారు చేయించాలని సూచించారు. డిసెంబర్ 12,13 తేదీల్లో మండల స్థాయిలో జరిగే పోటీలకు ప్రతి అంశం నుంచి అత్యుత్తమైన ఐదు ప్రాజెక్టులను పంపించాలన్నారు. జనవరి 27,28 తేదీల్లో జిల్లా స్థాయి, ఫిబ్రవరి 27,28 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకిర్ అహ్మద్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మత్స్యకారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. చేపల వినియోగాన్ని పెంచేందుకు జిల్లాలో ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం పాల్గొన్న జాతీయ మత్స్య దినోత్సవం కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాకు చెందిన మత్స్యకారులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో కృష్ణానది పరీవాహక ప్రాంతం ఉందన్నారు. ప్రకాశం బ్యారేజీ రిజర్వాయర్ పరిధిలో 1400 మంది లైసెన్స్ కలిగిన మత్స్యకారులు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. 85 మత్స్య సహకార సంఘాల ద్వారా 4,326 మంది సభ్యులు జీవనోపాధిని పొందుతున్నారని వివరించారు. మత్స్య సంపదకు మార్కెట్ సౌకర్యం కల్పించి మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు.

రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు

జిల్లాలో ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు, ఫిష్ రిటైల్ మార్కెటింగ్ హబ్‌లు, ఫిష్ కిస్కా, ఐస్ బాక్స్‌లతో కూడిన టూవీలర్, త్రీ వీలర్ మోటార్ సైకిళ్ల పంపిణీ, లైవ్ ఫిష్ విక్రయ కేంద్రాల ఏర్పాటు వంటి పథకాలకు సబ్సిడీపై ఆర్థిక సహాయం అందిస్తున్నామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఫిష్ ఆంధ్ర కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న మత్స్య సంపదను పెంచేలా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. విజయవాడలో లైవ్ ఫిష్ విక్రయాలపై ప్రజలు మక్కువ చూపుతున్నారని, వారిని ఆకర్షించేలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మత్స్యకారులకు పెన్షన్, వేట నిషేధ భృతి


జిల్లాలో 50 సంవత్సరాలు పైబడిన 1,262 మంది మత్స్యకారులకు నెలనెలా రూ.2,500 చొప్పున పెన్షన్ అందజేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఈ ఏడాది కృష్ణానదిలో 15 లక్షల చేప పిల్లలను వదులుతామని పేర్కొన్నారు. వేట నిషేధ భృతి కింద జిల్లాలో 409 మంది మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమైందని వివరించారు. చేపల వేటలో ఉండగా ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలేనికి చెందిన పి.వీర్రాజు, కృష్ణలంకకు చెందిన టి.వాసు ప్రమాదవశాత్తు మృతి చెందగా, వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించామని తెలిపారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వాయుగండం

- వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో మార్పులు
- ఓ మోస్తరు జల్లులతో రైతుల్లో ఆందోళన
- పంటను కాపాడుకునే యత్నాల్లో అన్నదాతలు



కంకిపాడు మండలం ఈడుపుగల్లులో పనలపై ఉన్న వరి పంట



కంకిపాడు మండలం ఉప్పలూరులో కోతకొచ్చిన వరిచేలు

కంకిపాడు(పెనమలూరు): వాయుగుండం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారటంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదివారం నుంచే ఆకాశం మేఘావృతమై చలిగాలులు వీచాయి. ఆదివారం రాత్రి నుంచి తెరిపి లేకుండా ఓ మోస్తరు వాన కురుస్తూనే ఉంది. సోమవారం కూడా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది

అన్నదాతలో అలజడి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాజిల్లాలో 3.95 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఈ నెల రెండో వారం నుంచి జిల్లాలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం, పరిసరాల్లో వరి కోతలు చేపట్టారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వరి కోత యంత్రాలతో కోత కోయించి ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా మిల్లులకు తరలించేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో అల్పపీడన ద్రోణి కాస్తా తీవ్ర అల్పపీడనంగా, ఆ తరువాత వాయుగుండంగా మారిందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ ప్రకటన రైతులను ఆందోళనకు గురిచేసింది. ఆదివారం నుంచి వాతావరణం మారిపోయింది. ఆకాశం పూర్తిగా మబ్బులతో నిండింది. పగటి పూట సైతం తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి జల్లులతో కూడిన మోస్తరు వర్షం పడుతుండటంతో రైతుల వెన్నులో వణుకు మొదలైంది. ఇప్పటికే పెనమలూరు నియోజకవర్గ పరిసరాల్లోని గ్రామాల్లో వరి కోతలు మొదలై పంట మార్కెట్‌కు చేరుతోంది. తేమ శాతం తగ్గించేందుకు కల్లాలు, రోడ్డు మార్జిన్‌లు, రియల్ ఎస్టేట్ వెంచర్లలో ధాన్యం ఆరబోసి మద్దతు ధర దక్కించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే వాయుగుండం రూపంలో కురుస్తున్న వర్షం, తీవ్రమైన చలిగాలి తేమను ఆరకుండా చేస్తున్నాయి. తేమ ఎక్కువైతే ధాన్యం నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ధాన్యం తడవకుండా టార్పలిన్ పట్టాలు కప్పడంతోపాటు, ధాన్యం బస్తాలను ఇళ్లకు, గోదాములకు తరలిస్తున్నారు.

అండగా నిలిచిన యంత్రాంగం

వాయుగుండం ప్రభావంతో పంట ఎక్కడ చేతికి అందకుండా పోతుందోనన్న భయంతో రైతులు వణుకుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. చాలా గ్రామాల్లో పంట కోత పూర్తయ్యి ధాన్యం ఆరబోసి సిద్ధంగా ఉందన్న సమాచారంతో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలతో సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. హుటాహుటిన మిల్లుల యజమానులతో సంప్రదించి లారీలను గ్రామాలకు పంపారు. కోతలు పూర్తయిన గ్రామాల్లో ధాన్యం తేమ శాతం నిబంధనతో సంబంధం లేకుండా కాటా వేయించి మిల్లుకు ధాన్యం తరలించేలా చర్యలు చేపట్టారు. 17 శాతం కంటే అదనంగా ఉన్న తేమ శాతానికి ఒక్కో శాతాన్ని లెక్కకట్టి రైతులకు ధర అందేలా చూస్తామని అవగాహన కల్పిస్తుండటంతో రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

వ్యక్తిని హతమార్చి శ్మశానంలో పూడ్చి..

- దొంగల ముఠాలో తలెత్తిన వివాదాలే హత్యకు కారణం
- నిందితులు పలు చోరీ కేసుల్లో నిందితులు
- మృతుడిది పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గొరిజవోలు
- నిందితులు గుంటూరు జిల్లా మంగళగిరి వాసులు



బొమ్ములూరు శ్మశానవాటికలో మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు



మృతుడు జంగం చంటి (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన ఓ వ్యక్తిని హతమార్చి కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరులోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న శ్మశానవాటికలో పూడ్చిపెట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. దాదాపు ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చిన ఈ ఉదంతంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చోరీ ముఠాలో సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలే హత్యకు కారణంగా తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్లితే.. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామానికి చెందిన జంగం చంటి (28), గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన రాయపాటి వెంకన్న, తుమ్మా సుబ్రహ్మణ్యం, షేక్ సుభాని అలియాస్ సిద్ధు, ముత్యాల నవీన్, పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన షేక్ నాగుల్ మీరా అలియాస్ బిల్లాతో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో గతేడాది కేరళలో దొంగతనం చేసిన ఈ ముఠా సభ్యులు భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు అపహరించారు. దీనిలో కొంత బంగారం విక్రయించేందుకు జంగం చంటికి ఇవ్వగా, విక్రయించిన మొత్తాన్ని తిరిగి ముఠా సభ్యులకు చెల్లించకపోవటంతో వీరి మధ్య వివాదం ఏర్పడింది. దీంతో చంటిని హతమార్చేందుకు పథకం రచించిన రాయపాటి వెంకన్న, ఇతర ముఠా సభ్యులు గత ఏడాది నవంబర్ 16వ తేదీన నమ్మకంగా అతనిని ఇంటి నుంచి తీసుకువెళ్లారు. అదే రోజు చంటి కుమారుడి అన్నప్రాసన కావటంతో పార్టీ ఇవ్వమని కోరటంతో మిత్రులతో కలిసి వెళ్లాడు. ఆ తర్వాత విజయవాడలోని ఓ హోటల్‌లో రూం తీసుకుని చంటిని ఇతర ముఠా సభ్యులు చితకబాదారు. అనంతరం కారులో ఎక్కించుకుని క్యారీ బ్యాగ్‌తో ముఖానికి ముసుగు వేసి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చారు. మృతదేహాన్ని పూడ్చివేసేందుకు అనువైన ప్రదేశం కోసం వెతుకుతూ జాతీయ రహదారి పక్కన బొమ్ములూరులో శ్మశానవాటిక కనిపించటంతో అక్కడ రాత్రి వేళలో పూడ్చిపెట్టి పరారయ్యారు. జంగం చంటి కనిపించటం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వ్యక్తి అదృశ్యం కేసు నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేశారు. పోలీసుల విచారణలో భాగంగా చంటిని ఇంటి నుంచి బయటకు తీసుకువెళ్లిన తోటి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారించటంతో క్రమంగా వాస్తవాలు బయటకు వచ్చాయి. జంగం చంటిని హత్యచేసి బాపులపాడు మండలం బొమ్ములూరులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న శ్మశానవాటికలో పూడ్చిపెట్టినట్లు పోలీసులకు చెప్పటంతో నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కర్, చిలకలూరిపేట సీఐ వై.అచ్చయ్య సోమవారం సంఘటనాస్థలికి చేరుకున్నారు. బాపులపాడు తహసీల్దార్ టి.మల్లికార్జునరావు, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్ సమక్షంలో సమాధిని తవ్వి జంగం చంటి మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతుని సోదరుడు జంగం బాజీ, ఇతర కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగి, కొద్ది సేపు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు నచ్చజెప్పటంతో ఆందోళన విరమించారు.

• కొంగొత్తగా గోరుముద్ద

విద్యార్థులకు పోషక విలువలతో కూడిన 'గోరుముద్ద'ను ప్రభుత్వం సోమవారం నుంచి కొత్త మెనూతో అందిస్తోంది. విజయవాడ ఏకేటీపీ ప్రభుత్వ పాఠశాలలో మిడ్ డే మీల్స్ లో వెజ్ బిర్యానీ, కోడిగుడ్డు, బంగాళాదుంప కర్రీతో పాటు చిక్కీని అందించారు. విద్యార్థినీ విద్యార్థులు సంతోషంగా 'గోరుముద్ద'ను ఆరగిస్తున్న దృశ్యాలను 'సాక్షి' కెమెరాతో క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



రుచికరమైన ఆహారాన్ని చూస్తూ ఆనంద పరవశం





వెజ్ బిర్యానీ, బంగాళాదుంప కర్రీ, గుడ్డు, చిక్కీ



భోజనం కోసం లైన్లో వేచి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు

15 నాటికి భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

కృష్ణా కలెక్టర్ రంజిత్‌బాషా



మచిలీపట్నంటౌన్: జిల్లాలోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను డిసెంబరు 15 నాటికి పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. తన బంగ్లాలో సోమవారం డ్వామా పీడీ, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సిమెంటు, ఇసుక, స్టీలు అందుబాటులో ఉన్నప్పటికీ భవన నిర్మాణాల పురోగతిలో అధికారులు వెనుకబడ్డారన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు అధికారులు సాధించిన పురోగతిని పరిశీలించుకోవాలన్నారు. లక్ష్య సాధనలో పురోగతి లేకపోవటం పట్ల అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 44 గ్రామ సచివాలయాలు, 120 రైతు భరోసా కేంద్రాలు, 99 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణ పనులు ప్రారంభం కాని దశలో ఉన్నాయన్నారు. ఈ నిర్మాణాలను బేస్‌మెంట్ లెవల్‌కు తీసుకురావాలని అదే సమయంలో శ్లాబు దశకు చేరుకున్న నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. డ్వామా పీడీ, పీఆర్ ఎస్ఈ, జెడ్పీ సీఈవో ముగ్గురు కలిసి మండలాలను సందర్శిస్తూ గ్రామసర్పంచులు, కాంట్రాక్టర్లతో చర్చించి నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ప్రతి శనివారం రిపోర్టును సమర్పించాలని సూచించారు. భవన నిర్మాణాలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి ఉన్నారు.

క్షయవ్యాధి రహిత జిల్లాగా చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్షయ వ్యాధిని సమూలంగా నివారించి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణకు నిర్వహిస్తున్న ని–క్షయ్ మిత్రల ఏర్పాటుపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, టీబీ కంట్రోల్ అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ ఢిల్లీరావు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. ఇందులో భాగంగా క్షయ వ్యాధి నివారణకు ని–క్షయ్ మిత్రలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కోవిడ్ ప్రభావంతో ప్రజలలో రోగనిరోధక శక్తి తగ్గి టీబీ కేసులు బయటపడుతున్నాయన్నారు. జిల్లాలో 2 వేల మంది క్షయవ్యాధి బారిన పడినట్లు వైద్యాధికారుల నివేదికలో వెల్లడైందన్నారు. క్షయ వ్యాధి నివారణ మందులను కొనుగోలు చేసే వ్యాధిగ్రస్తుల వివరాలను మందుల షాపు యజమానులు తప్పనిసరిగా స్థానిక వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. వ్యాధి గ్రస్తుల వివరాలు ఇవ్వని మందుల షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తుడిని దత్తత తీసుకున్న కలెక్టర్

ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణకు నిర్వహిస్తున్న ని–క్షయ్ మిత్రల ఏర్పాటులో తొలి ని–క్షయ్ మిత్రగా జిల్లా కలెక్టర్ నిలిచారు. కలెక్టర్ ఒక క్షయ వ్యాధిగ్రస్తుడిని దత్తత తీసుకుని అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. తాను దత్తత తీసుకున్న వ్యాధిగ్రస్తుడికి పౌష్టికాహారం, మందులు అందించి పూర్తిగా వ్యాధి నయం అయ్యేవరకు బాధ్యతలు తీసుకుంటానన్నారు. జిల్లాలో ఒక్కో అధికారి ని–క్షయ్ మిత్రగా మారి కనీసం ఒక్కరినైనా దత్తత తీసుకోవాలని, ఆరు నెలల పాటు వారికి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ప్రత్యక్షంగా వ్యాధిగ్రస్తులకు సహకారం అందించలేని వారు నెలకు రూ.700 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సమావేశంలో డీఎంఅండ్ హెచ్ఓ ఎం.సుహాసిని, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఉషారాణి, ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.సమరం, డీఆర్వో కె.మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో బెజవాడ రైల్వే ఉద్యోగికి కాంస్యం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇటీవల సౌత్ ఈస్టర్న్ రైల్వేలోని చక్రధర్‌పూర్‌లో జరిగిన ఆల్ ఇండియా రైల్వే బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ డివిజన్‌లో మెకానికల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులు ఉదయకుమార్ కాంస్య పతకం సాధించాడు. దక్షిణ మధ్య రైల్వే బాడీ బిల్డింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీనివాసులు ఉదయకుమార్ 90 కేజీల విభాగంలో ఈ పతకం సాధించాడు. గత ఏడాది చెన్నైలో జరిగిన ఇండియా రైల్వే బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో కూడా ఇదే విభాగంలో ఆయన కాంస్య పతకం సాధించాడు. దీంతో ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న ఇండియన్ బాడీ బిల్డింగ్ కోచింగ్ స్పెషల్ క్యాంప్‌కు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం విజయవాడ రైల్వే డీఆర్ఎం శివేంద్రమోహన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బాడీ బిల్డింగ్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చినందుకుగాను డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర్ బిటి, ఇతర అధికారులు శ్రీనివాసులు ఉదయ కుమార్‌కు అభినందనలు తెలిపారు.



కాంస్య పతకం సాధించిన శ్రీనివాసులు ఉదయకుమార్

రోడ్డుప్రమాదంలో మెకానిక్ మృతి

తిరువూరు: స్థానిక అష్టలక్ష్మీ దేవాలయం వద్ద ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ మెకానిక్ షేక్ జానీ బాషా (38) మృతి చెందారు. కల్లూరు నుంచి తిరువూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్న జానీ బాషా కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పి పడిపోయారు. తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతిచెందారు. జానీబాషా మృతదేహానికి తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

పురుగు మందు తాగి వ్యాపారి ఆత్మహత్య

ఉయ్యూరు: ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన ఎస్.కోటమరాజు (46) ఉయ్యూరులో వస్త్ర వ్యాపారం చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దుకాణంలో ఈనెల 15న పురుగు మందు తాగాడు. అతన్ని వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించగా వైద్యం పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి



ఆటో ఢీకొని మృతిచెందిన వృద్ధురాలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆటో ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటనపై ఎస్ఎన్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం అక్షింతల సాయిబాబా కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణపురం, జనార్దనరావు వీధిలో నివాసముంటున్నారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో అతని తల్లి అక్షింతల శకుంతల(72) పచారి సరుకులు తీసుకొచ్చేందుకు బయటకు వెళ్లారు. భగత్‌సింగ్ రోడ్డు యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతుండగా గవర్నమెంటు ప్రెస్ నుంచి ఫుడ్ జంక్షన్ వైపునకు వేగంగా దూసుకొచ్చిన ఆటో వృద్ధురాలిని ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధురాలు ఎగిరి కొంత దూరంలో పడటంతో తలకు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీనిపై స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆమె కుమారుడు సాయిబాబు ఘటనా స్థలానికి చేరుకుని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎన్ పురం పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవరును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

అర్జీదారులకు న్యాయం చేయండి

స్పందనలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. ప్రజలు ఏ సమస్యపై అర్జీ సమర్పించారో క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందనలో వచ్చిన అర్జీల్లో 50 శాతానికి పైగా అక్కడిక్కడే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. స్పందన పోర్టల్‌లో గడువు తీరిన అర్జీలు ఉండకూడదన్నారు. మండల స్థాయిలో అధికారులు స్పందన అర్జీలకు పరిష్కారం చూపకపోవడంతో అధిక స్థాయిలో అర్జీలు పునరావృతం అవుతున్నా యని ఆయన వివరించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్

స్పందనలో 85 అర్జీలు

స్పందనలో 85 అర్జీలు అదాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 36, పోలీస్ 11, మునిసిపల్, పంచాయతీ రాజ్ శాఖల పరిధిలో ఏడు చొప్పున, విద్య – వైద్యం, సర్వే అండ్ సెటిల్‌మెంట్ పరిధిలో మూడేసి, మిగిలినవి వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలని కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, అసిస్టెంట్ డెప్యూటీ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖతీఫ్ కౌసర్ బానో, డ్వామా పీడీ జె.సునీత, డీఈఓ సి.వి.రేణుక, ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి, గ్రామ/వార్డు సచివాలయ జిల్లా అధికారి కె.అనురాధ, డీఎస్ఓ పి.కోమలి పద్మ, హౌసింగ్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రెడిటేషన్ నిబంధనలు సడలించాలి

ఏపీయూడబ్ల్యూజే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జర్నలిస్టు అక్రెడిటేషన్‌లపై ప్రభుత్వం విధించిన నిబంధనలను సడలించాలని ఏపీయూడబ్ల్యూజే విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సోమవారం రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయకుమార్ రెడ్డిని ఏపీయూడబ్ల్యూజే నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది కఠినతరమైన నిబంధనలు ప్రవేశపెట్టడం ద్వారా చాలామంది అర్హులైన జర్నలిస్టులు అక్రెడిటేషన్‌కు నోచుకోక ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని వివరించారు. ఇప్పటికైనా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. యూనియన్లకు తగిన ప్రాతినిధ్యం ఇస్తూ అక్రెడిటేషన్ కమిటీలో స్థానం కల్పించాలన్నారు. హెల్త్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని, జర్నలిస్టులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాద బీమా, వెల్ఫేర్ ఫండ్‌ను పునరుద్ధరణ చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఉపాధ్యక్షుడు కె.జయరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, విజయవాడ అర్బన్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దాసరి నాగరాజు ఉన్నారు.



సమాచార శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

క్లుప్తంగా

స్విమ్మర్లకు అభినందనలు



పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు అసోంలోని గౌహతిలో జరిగిన పారా జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో విజేతలను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం స్విమ్మర్లు మర్యాదపూర్వకంగా కమిషనర్‌ను కలిశారు. జింఖానా గ్రౌండ్స్‌లోని సర్‌విజ్జి స్విమ్మింగ్‌పూల్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు పారా జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో మొత్తం 10 బంగారు, 5 వెండి పతకాలు సాధించారని డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ శ్రీనివాసరావు కమిషనర్‌కు వివరించారు. వారిలో వీఎంసీ స్విమ్మింగ్ కోచ్ ఎ.అంకేశ్వరరావు మూడు బంగారు పతకాలు, ఎండీ కరిముల్లా రెండు బంగారు, ఒక వెండి పతకం, జితేంద్ర ఒక బంగారు, ఒక వెండి పతకం, షేక్ సాల్మా ఒక వెండి పతకం సాధించారని, మరో ఇద్దరికి చోరో రెండేసి బంగారు పతకాలు సాధించారని తెలిపారు. పతకాలు పొందిన వారిని కమిషనర్ స్వప్నిల్ అభినందిస్తూ భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించి నగరానికి మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు వినికిడి, మాట్లాడటం, చదవడం, రాయడం అనే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐలెట్స్, టోఫెల్ ట్రైనర్ షారోన్ ఏంజెల్ అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యాన సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై అతిథి ప్రసంగం జరిగింది. షారోన్ ఏంజెల్ మాట్లాడుతూ విద్యార్థులు భావ వ్యక్తీకరణ మెరుగుపరుచుకునే పద్ధతిని వివరించారు. మృదువైన నైపుణ్యాలు అంటే వారి ప్రవర్తన, ఎదుటివారితో ఎలా ఉండాలి, ఎలా ప్రవర్తించాలని, ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య ఆహారంలో పోషక విలువలు అపారం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మత్స్య ఆహార వంటకాల్లో పోషకాలు అపారంగా ఉంటాయని సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి ప్రాధికార సంస్థ రాష్ట్ర సహాయ సంచాలకుడు జి.రామర్ చెప్పారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా సోమవారం పీబీ సిద్ధార్థ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. రామర్ మాట్లాడుతూ మత్స్య వంటకాలను తింటే కొవ్వు నిల్వలు పేరుకోవని చెప్పారు. ఇతర మాంసాహారంతో పోల్చుకుంటే చాలా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న మత్స్య ఆహారం లభిస్తోందన్నారు. జంక్షన్‌లోని మూల్పూరి ఆక్వా ప్రాసెసింగ్ ఎండీ రవికృష్ణ మాట్లాడుతూ మత్స్య సంపద మనుగడకు మడ అడవుల పెంపకం కీలకమన్నారు. మత్స్య సంపద ప్రాధాన్యత తెలిసేలా నిర్వహించిన పత్ర సమర్పణ, క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర స్థాయి క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ



గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సామాజిక విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కామేశ్వరప్రసాద్ అన్నారు. గుణదల సోషల్ సర్వీస్ సెంటర్‌లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి సోమవారం రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న 39 మంది విద్యార్థులు హాజరయ్యారు. కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారితో కలిగే అనర్థాల కారణంగా సమాజంలో జరిగే నష్టాన్ని తెలియజేస్తూ ఎయిడ్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు వివరించారు. వీటికి 13 జిల్లాల నుంచి 39 మంది రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యారని తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు అందించినట్లు చెప్పారు. పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన ఎస్. లిమ్రా సలిత్ విద్యార్థిని మొదటి బహుమతి పొందినట్లు తెలిపారు. రెండో బహుమతి నెల్లూరు జిల్లాకు చెందిన వి. అంజనికుమార్, మూడో బహుమతి చిత్తూరు జిల్లాకు చెందిన సాయిఅఖిల్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కిషోర్, డిప్యూటి డైరెక్టర్ సౌమ్య, సాయికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు

- 18వ డివిజన్‌లో రోడ్లు, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ పనులు ప్రారంభం
- శంకుస్థాపనలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దేవినేని అవినాష్, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): అభివృద్ధి, సంక్షేమ పథకాలను రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. సోమవారం ఆయన రాణిగారితోట, 18వ డివిజన్‌లోని వైట్‌హౌస్ సెంటర్‌లో దాదాపు రూ.1.50 కోట్ల వ్యయ అంచనాతో సీసీ రోడ్లు, వాటర్ సప్లై వర్క్స్, ఎలక్ట్రికల్ అభివృద్ధి పనులకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ ఫ్లోర్‌లీడర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డివిజన్‌ను నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో శంకుస్థాపనలు చేసి ప్రచారాలు చేసుకోవడమేగానీ ఒక్క పని కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వెంటనే పనులు ప్రారంభించి నాణ్యతా లోపం లేకుండా త్వరగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రతి పనిని వీలైనంత త్వరగా చేసి డివిజన్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలో 'స్పందన' సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. 15 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగంపై- 3, ఇంజినీరింగ్ విభాగంపై -3, ప్రజారోగ్య విభాగంపై-1, పట్టణసాధికార విభాగంపై-4, రెవెన్యూ విభాగంపై -2, ఎస్టేట్స్ విభాగంపై-2 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో వించిపేట కూరగాయల మార్కెట్‌లో తమకు షాపు కేటాయించాలని పంజాసెంటర్‌కు చెందిన యూసబ్‌ఖాన్ అర్జీ ఇవ్వగా, సీతారాంపురంలో రోడ్డు వెంట ఆక్రమణలను తొలగించాలని జి.మురళి ఫిర్యాదు చేశారు. తమకు మౌలిక వసతులు కల్పించాలని పాత ఆర్‌ఆర్‌పేటకు చెందిన ఇ.విజయలక్ష్మి అర్జీ పెట్టగా, ఉమ్మడి రోడ్డు ఆక్రమణపై క్రీస్తురాజపురానికి చెందిన శాంతకుమారి ఫిర్యాదు చేశారు. వీటిపై స్పందించిన కమిషనర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో అదనపు కమిషనర్(జనరల్)ఎం.శ్యామల, అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సాధికారాభివృద్ధి విభాగం ప్రాజెక్టు అధికారి శకుంతల, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, అమృత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేబీఎస్ఎస్ లత, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో

మూడు సర్కిళ్ల పరిధిలో జరిగిన స్పందనలో పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో ఇంజినీరింగ్‌పై-1, పట్టణప్రణాళిక విభాగంపై-1 అర్జీలు రాగా సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో రెవెన్యూపై ఒక అర్జీ వచ్చింది. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో అర్జీలు రాలేదని అధికారులు తెలిపారు.

ప్రభుం ప్రాణనాథం విభుం విశ్వనాథం



దుర్గాఘాట్‌లో భక్తుల కార్తిక పుణ్యస్నానాలు



శివగిరిలో శివలింగం వద్ద పూజలు చేస్తున్న మహిళలు, అయ్యప్పలు

పటమట(విజయవాడతూర్పు): స్థానిక గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో (దత్తపీఠం) జరుగుతున్న కార్తిక ఉత్సవాలు సోమవారం ముగిశాయి. గంగాధరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి రుద్రాభిషేకం, మహా మృత్యుంజయ హోమం, సూర్య మంత్ర పూర్వక మహామంత్ర అనుష్టానంతో హోమాన్ని చేశారు.

శివగిరిపై కార్తిక పూజలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక శ్రీవాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం (శివగిరి) కొండపై కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 36 అడుగుల శివలింగం, నాగపడగ, నాగ దేవత, శివపరివారం విగ్రహాల వద్ద మహిళలు, అయ్యప్పలు, విద్యార్థులు దీపాలను వెలిగించారు. శివలింగానికి అభిషేకాలు చేశారు.రుద్రాభిషేకం, రుద్ర హోమం, సాయంత్రం ప్రదోషపూజ, శివ కల్యాణం జరిగాయి. శివగిరిపై స్వామి వారి ఉత్సవ మూర్తులను సోమవారం సాయంత్రం రాణిగారి తోట పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు.



పాత శివాలయంలో బారులు తీరిన భక్తులు



దుర్గాఘాట్‌లో.. ఉండమ్మా బొట్టు పెడతా..

బాలలు, మహిళలపై జరిగే హింసకు పేదరికమే కారణం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్ర



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు వినీత, చిత్రంలో రాజేంద్ర, తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజంలోని ఇతర రకాల సమస్యలతో పాటు పేదరికం బాలలు, మహిళలపై జరిగే అన్ని రకాల హింసలకు దారి తీస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్ర పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని హోటల్ ఐలాపురంలో హెల్ప్, విముక్తి సంయుక్త ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్(సీబీఆర్) పై వీఎల్‌సీపీలు, పీఆర్‌ఐల సెన్సిటైజేషన్' కార్యక్రమం జరిగింది. డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ అక్రమ రవాణా బాధితులు తిరిగి రవాణాకు గురికాకుండా వారి అవసరాలను తీర్చడానికి సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో ప్రయత్నాలు చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ తరఫున తమ మద్దతు అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు వినీత మాట్లాడుతూ పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలు, బాలల భద్రత, సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. హెల్ప్ సెక్రటరీ రామ్ మోహన్ నిమ్మరాజు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్ ఆవశ్యకత, ప్రాముఖ్యతను వివరించారు. విముక్తి అధ్యక్షురాలు అపూర్వ మాట్లాడుతూ రెండో తరం బాలల అక్రమ రవాణాను నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. వార్డు సచివాలయ మహిళా పోలీసులు, సంక్షేమ కార్యదర్శులు, పంచాయతీ రాజ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కేబీఎన్‌లో రాష్ట్రస్థాయి సారస్వత పోటీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల డిబేటింగ్ అండ్ క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న 42వ రాష్ట్రస్థాయి సారస్వత పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల ఆధ్వర్యంలో 41 సంవత్సరాలుగా విద్యార్థులకు వివిధ రకాల సారస్వత పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిబేట్, వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళాలు



ఆలయ ఈవో భ్రమరాంబకు విరాళం అందచేస్తున్న దాతలు



దాతలకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం వేర్వేరుగా రూ. లక్ష చొప్పున విరాళాన్ని అందజేశారు. విజయవాడ నాగార్జున నగర్‌కు చెందిన రామనాథం వెంకటేశ్వరరావు, నాగరత్నకుమారిలు రామనాథం రామమోహనరావు, పుణ్యవతి దంపతుల పేరిట నిత్యాన్నదానానికి రూ. 1,00,116, విజయవాడకు చెందిన పులి సాయి సింధూర కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని, గుంటూరు జిల్లా ఫిరంగిపురం గుండలపాడు గ్రామానికి చెందిన యర్రమాను శివ రామకృష్ణ పేరిట అన్నదానం చేయడానికి వై.శ్రీలక్ష్మి రూ.1,00,116 ఆలయ ఈఓ భ్రమరాంబకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

ఎక్సెల్ ప్లాంట్ పనుల్లో వేగం పెంచండి



ఎక్సెల్‌ప్లాంట్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆయన వీఎంసీ అధికారులతో సోమవారం ప్లాంట్ ఆవరణలోని ప్రధాన ద్వారాలు, శానిటరీ ఆఫీసు బిల్డింగ్, స్టోర్ రూమ్, డ్రైవర్స్ టాయిలెట్స్(రెస్ట్ రూమ్) నిర్మాణాలపై ఆరా తీశారు. ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న రోడ్ల పనులను పదిహేను రోజుల్లో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐకానిక్ పార్కులో జరుగుతున్న పనుల్లో వేగం పెంచి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, ఈఈ ఏఎస్ ఎస్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ సంక్షేమం



4వ డివిజన్‌లో స్థానికురాలితో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదల 4వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగానే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ప్రతిష్టాత్మకంగా జరుగుతోందని వివరించారు. టీడీపీ హయాంలో ఎన్టీఆర్ కాలనీని పట్టించుకోలేదని, ఇప్పుడు మోడల్ కాలనీగా మారిందన్నారు. కులమతాలకతీతంగా అభివృద్ధి జరుగుతోందనడానికి నిదర్శనం ఈ కాలనీ అన్నారు. గద్దె రామ్మోహన్ మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. సుమారు నాలుగు కోట్ల నిధులతో ఎన్టీఆర్ కాలనీ అభివృద్ధి చేశామని వివరించారు. అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వివరించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, 3, 5వ డివిజన్ల కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేడ్కర్, ఎన్టీఆర్ కాలనీ ప్రెసిడెంట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి సంగీత మహోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీవీఎస్ ప్రసాద్, గౌరీనాథ్, హరిప్రసాద్, సుబ్రహ్మణ్యం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో ఈ నెల 24 వ తేదీ నుంచి వారం రోజుల పాటు దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో 29వ వార్షిక సంగీత మహోత్సవాలను నిర్వహిస్తునట్లు సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ తెలిపారు. సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేశ విదేశాల్లోని సంగీత విద్వాంసులు కచేరీలు నిర్వహిస్తారన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ 24న సంతాన గోపాలన్ గాత్ర కచేరి, 25న అర్చన, ఆరతిల గాత్రయుగళం, 26న రామకృష్ణమూర్తి గాత్రం, 27న పాహి రామా ప్రభో సంగీత రూపకం, 28న కృతి భట్ గాత్రం, 29న అభిషేక్ రఘురాం గాత్రం, 30న ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులకు సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేస్తునట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బి.హరిప్రసాద్, సంస్థ కోశాధికారి వీఆర్ సుబ్రహ్మహ్మణ్యం పాల్గొన్నారు. అతిథులు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

హిజ్రాలు.. సమాజంలో భాగమే

వీఎంసీ అధికారులు సత్యవతి, శకుంతల



హిజ్రాలతో కలిసి ఆన్‌లైన్‌లో ఫీడ్‌బ్యాక్ పొందుపరుస్తున్న వీఎంసీ అధికారులు

పటమట(విజయవాడతూర్పు): సమాజంలో హిజ్రాలు కూడా భాగమేనని, వారిపై వివక్ష చూపొద్దని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్)కె.వి. సత్యవతి, వీఎంసీ పట్టణ సాధికారాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి శకుంతల అన్నారు. సోమవారం రాజీవ్‌గాంధీ పార్కులో హిజ్రాలతో మమేకమయ్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. హిజ్రాలను కూడా తోటి మనుషులుగా చూడాలని, వారి పట్ల ఎవరూ అమానవీయంగా ప్రవర్తించొద్దని, అలాచేస్తే చట్టపరంగా కూడా చర్యలు ఉంటాయని తెలిపారు. ఈసందర్భంగా వీరిద్దరూ వారితో కొంతసేపు ఆటపాటలతో గడిపారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి గృహకల్ప శాఖ నిర్వహిస్తున్న ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్(ఈవోఎల్)-2022లో అందరూ ఆన్‌లైన్‌లో తమ అభిప్రాయాన్ని పొందుపరచి జాతీయ స్థాయిలో విజయవాడ నగరాన్ని మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలని కోరారు. వీరు హిజ్రాలతో కలిసి ఈవోఎల్-2022 బ్రోచర్‌ను ఆవిష్కరించి వారి అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో పొందుపరచారు. కార్యక్రమంలో సీడీవో జగదీశ్వరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ప్రత్యేక దృష్టి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ లో సోమ వారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది.


క్రీడా సామాగ్రి కొనుగోలుకు టెండర్ల గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఏకలవ్య ఆదర్శ పాఠశాలల క్రీడోత్సవాల కోసం క్రీడా సామాగ్రి కొనుగోలుకు టెండర్ల గడువు ఈ నెల 24 వరకు పొడిగించినట్లు ఏపీ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ తెలిపింది. ఆసక్తిగల బిడ్డర్లు ఈ నెల 24లోపు ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో బిడ్‌లు సమర్పించాలని గురుకుల విద్యాలయాల సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

వివేకా హత్య కేసు దర్యాప్తు బదిలీపై తీర్పు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు బదిలీ చేయాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వాయిదా వేసింది. హత్య కేసులో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిలు రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ సందర్భంగా నవంబరు 28న వివేకా హత్యకేసు దర్యాప్తు బదిలీపై తీర్పు వెలువరిస్తామని, అదే రోజు ఎర్ర గంగిరెడ్డి బెయిలు రద్దు పిటిషన్‌పై కూడా విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.


కొనసాగుతున్న వాయుగుండం



వాయుగుండం ఉపగ్రహ ఛాయాచిత్రం

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. ఇది గంటకు 25 కిలోమీటర్ల వేగంతో వాయవ్యదిశగా కదులుతోంది. ఇది సోమవారం అర్ధరాత్రి త ర్వాత నుంచి పశ్చిమ వాయవ్యదిశగా పయనిస్తూ దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు వైపు పయనిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. మంగళవారం ఉదయానికి అల్పపీడనంగా బలహీనపడి దక్షిణాంధ్ర, తమిళనాడు, పుదుచ్చేరి మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల, ఉత్తర కోస్తాంధ్రలో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ భారీవర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి.

మహిళా ఓటర్లే అధికం



సాక్షి, అమరావతి

రాష్ట్రంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ప్రతీ వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,025 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 1.96 కోట్ల పురుష ఓటర్లుండగా 2.01 కోట్లు మహిళా ఓటర్లు ఉన్నారు. 26 జిల్లాలకు గాను 24 జిల్లాల్లో మహిళా ఓటర్లే నిర్దేతలుగా ఉన్నారు. విశాఖపట్టణం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మాత్రమే మహిళల కన్నా పురుష ఓటర్లు ఎక్కువగా ఉండగా మిగతా 24 జిల్లాల్లో మహిళా ఓటర్లదే పైచేయిగా ఉంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 9.65 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత అత్యధికంగా కర్నూలు జిల్లాలో 9.60 లక్షలు, అనంతపురం జిల్లాలో 9.56 లక్షలు, విశాఖ జిల్లాలో 9.38 లక్షలు, శ్రీకాకుళం జిల్లాలో 9.10 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం సాధారణ ఓటర్లలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 19.12 లక్షల ఓటర్లు ఉండగా ఆ తరువాత అనంతపురం జిల్లాలో 19.11 మంది, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 18.98 లక్షల ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా బాపట్ల జిల్లాలో 12.61 లక్షల ఓటర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 7.68 లక్షలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7.15 లక్షల ఓటర్లు ఉన్నారు.

జిల్లాల వారీగా సాధారణ ఓటర్ల సంఖ్య..

జిల్లా	పురుషులు	మహిళలు
శ్రీకాకుళం	9,05,085	9,10,542
విజయనగరం	7,52,231	7,66,238
పార్వతీపురం మన్యం	3,76,072	3,91,912
అల్లూరి సీతారామరాజు	3,46,822	3,68,855
విశాఖపట్టణం	9,42,231	9,38,414
అనకాపల్లి	6,20,996	6,47,846
కాకినాడ	7,87,362	8,01,746
డాక్టర్ అంబేద్కర్ కోనసీమ	7,40,966	7,43,794
తూర్పుగోదావరి	7,56,380	7,84,833
పశ్చిమగోదావరి	7,15,248	7,39,961
ఏలూరు	7,79,508	8,06,437
కృష్ణా	7,28,924	7,63,447
ఎన్టీఆర్	8,11,573	8,35,850
గుంటూరు	8,35,788	8,84,549
బాపట్ల	6,17,264	6,43,949
పల్నాడు	8,32,247	8,59,695
ప్రకాశం	8,84,048	8,87,646
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు	9,32,536	9,65,750
కర్నూలు	9,51,599	9,60,158
నంద్యాల	6,57,761	6,74,811
అనంతపురం	9,54,705	9,56,784
శ్రీ సత్యసాయి	6,70,560	6,65,555
వైఎస్సార్	7,78,393	8,02,308
అన్నమయ్య	6,66,422	6,80,480
చిత్తూరు	7,57,488	7,68,823
తిరుపతి	8,47,640	8,81,888

'ఆర్‌బీఐ' టాప్ టెన్ రాష్ట్రాల్లో ఏపీ

- పునరుత్పాదక విద్యుత్ మొత్తం స్థాపిత సామర్థ్యంలో రాష్ట్రం ఘనత
- 2029–30 నాటికి 'పునరుత్పాదక' వాటా 18 శాతం నుంచి 44 శాతం వరకు పెరుగుతుందని అంచనా
- ఆ లక్ష్యానికి చేరువగా దాదాపు 37 శాతంతో ముందంజలో రాష్ట్రం
- గణాంకాల హ్యాండ్‌బుక్ 2021–22ను విడుదల చేసిన ఆర్‌బీఐ



సాక్షి, అమరావతి : దేశ వ్యాప్తంగా గ్రిడ్–ఇంటరాక్టివ్ పునరుత్పాదక విద్యుత్ మొత్తం స్థాపిత సామర్థ్యంలో రాష్ట్రాల జాబితాను ప్రకటిస్తూ గణాంకాల హ్యాండ్‌బుక్ 2021–22ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తాజాగా విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సౌర, పవన, జల వంటి పునరుత్పాదక విద్యుదుత్పత్తికి ప్రభుత్వం ఇస్తున్న అత్యధిక ప్రాధాన్యతకు గుర్తింపుగా ఆర్‌బీఐ తన తాజా నివేదికలో మొదటి పది రాష్ట్రాల్లో ఏపీకి స్థానం కల్పించింది. దేశంలో 2040 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం.. ఈ ఏడాది చివరి నాటికి 175 గిగావాట్లు పూర్తి చేయాలనుకుంటోంది. ఇందుకోసం 2023–2030 మధ్య 24.61 శాతం నుంచి 43.33 శాతం వరకూ రెన్యువబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్‌పీవో)ను పెంచుతోంది. ఈ చర్యలతో పునరుత్పాదక రంగం 2030 నాటికి 1 ట్రిలియన్, 2070 నాటికి 15 ట్రిలియన్ డాలర్ల టర్నోవర్‌కు చేరుకుంటుందని కేంద్రం అంచనా వేస్తోంది. దీనికి తోడ్పాటునందిస్తున్న మొదటి 12 రాష్ట్రాల్లో ఏపీ(ఆరో స్థానం)తో పాటు కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఉన్నాయి. కాగా ఏపీలో పునరుత్పాదక విద్యుత్ స్థాపిత సామర్థ్యం 10,825.28 మెగావాట్లకు చేరింది. ఇందులో 4,096.65 మెగావాట్లు పవన, 4,390.48 మెగావాట్లు సౌర, 1,610 మెగావాట్లు భారీ జల విద్యుత్, 566.04 మెగావాట్లు బయో పవర్, 162.11 మెగావాట్లు చిన్న జల విద్యుత్, 900.72 మెగావాట్లు ఇతర పునరుత్పాదక ప్రాజెక్టులున్నాయి.

ఇప్పటికే ప్రాధాన్యం

2029–30 నాటికి, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి వాటా 18 శాతం నుంచి 44 శాతం వరకు పెరుగుతుందని, థర్మల్ పవర్ 78 శాతం నుంచి 52 శాతం వరకు తగ్గుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఇటీవల(సీఈఏ) అంచనా వేసింది. కేంద్రం నిర్దేశం మేరకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కంలు) కొనుగోలు చేసే విద్యుత్‌లో పునరుత్పాదక విద్యుత్ వాటా 18 శాతం ఉండాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) నిర్ణయించింది. గతేడాది ఇది 17 శాతంగా ఉండేది. 2026–27 నాటికి మొత్తం విద్యుత్‌లో 24 శాతం పునరుత్పాదక విద్యుత్ ఉండాలని ఏపీఈఆర్‌సీ ఇటీవల ప్రకటించిన ఆర్‌పీవో నిబంధనల్లో వెల్లడించింది. కానీ రాష్ట్రంలోని మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యంలో పునరుత్పాదక విద్యుత్ వాటా సుమారు 37 శాతంతో ఏపీ ఇప్పటికే ముందంజలో ఉంది.

• తెలంగాణ

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల విధ్వంసం

- దబ్బకొంట పోలీస్ క్యాంప్‌పై రాకెట్ లాంచర్లతో దాడి
- కాంకేర్ జిల్లాలో బస్సు దహనం
- నాలుగు సెల్ టవర్లకు నిప్పు

దుమ్ముగూడెం/చర్ల: తెలంగాణ సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు విధ్వంసం సృష్టించారు. సుకుమా జిల్లా దబ్బకొంట ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ క్యాంప్‌పై మావోయిస్టులు రాకెట్ లాంచర్లతో సోమవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. మావోయిస్టుల అణచివేతే లక్ష్యంగా దండకారణ్య ప్రాంతంలో పోలీసులు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో దబ్బకొంటలో ఏర్పాటు చేస్తున్న క్యాంపుపై మావోయిస్టులు దాడి చేయడంతో తేరుకున్న భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి.

ఆదివారం రాత్రి మూడు జిల్లాల్లో..

మావోయిస్టులు ఆదివారం రాత్రి కూడా వరుస దాడులకు పాల్పడ్డారు. కాంకేర్ జిల్లా కోయిలిబెడ సమీపాన ప్రయాణికులతో వెళ్తున్న బస్సును నిలిపేసిన మావోయిస్టులు ప్రయాణికులను దించేసి, డీజిల్ ట్యాంకర్‌ను పగులగొట్టి అదే డీజిల్‌ను బస్సుపై చల్లి నిప్పంటించారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఇక జాంకీనగర్, జిరామత్రాయ్, అంతఘర్ సమీపాన సిర్సంగితో పాటు భద్రంగిలో ప్రైవేట్ కంపెనీలకు చెందిన నాలుగు సెల్ టవర్లకు నిప్పుపెట్టారు. కోయిలిబెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కనార్‌లో జేసీబీ సహా మూడు వాహనాలకు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయాయి. అంతఘర్ – నారాయణపూర్ స్టేట్ హైవే, కోయిలిబెడ – మర్ద మార్గంలో పెద్దసంఖ్యలో చెట్లను నరికి వేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మూడు జిల్లాల పరిధిలో ఎనిమిది చోట్ల ఈ ఘటనలకు పాల్పడడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. కాగా, మావోయిస్టు నేతలు దర్శన్, జగేష్ బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ మంగళవారం కాంకేర్, నారాయణ్‌పూర్, కొండగాయ్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. దీనికి ముందస్తు హెచ్చరికగానే ఈ ఘటనలకు పాల్పడినట్లు తెలుస్తోంది. బంద్‌ను విజయవంతం చేయాలని మావోయిస్టులు బ్యానర్లు కట్టడంతో పాటు కరపత్రాలు కూడా అక్కడక్కడా వదిలారు.

టికెట్ ఎందుకు బుక్ చేశారు?

- సింహయాజీతో మీకున్న సంబంధం ఏంటి?
- ఎమ్మెల్యేలకు ఎర కేసులో న్యాయవాది శ్రీనివాస్‌ను ప్రశ్నించిన సిట్
- ఓ జాతీయ పార్టీకి చెందిన పలువురి పేర్లు వెల్లడి
- బ్యాంక్ లావాదేవీలపైనా ఆరా
- సుదీర్ఘంగా 8 గంటలపాటు సాగిన విచారణ

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలకు ఎర కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును వేగవంతం చేసింది. దర్యాప్తు పురోగతి నివేదికను సీల్డ్ కవర్‌లో ఇవ్వాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సిట్ పలువురికి 41–ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమీప బంధువు, కరీంనగర్‌కు చెందిన న్యాయవాది భూసారపు శ్రీనివాస్ సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరయ్యారు. సిట్ సభ్యులైన సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కల్మేశ్వర్, నల్లగొండ ఎస్పీ రెమా రాజేశ్వరీ, రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్ వేర్వేరుగా సాయంత్రం 6:30 గంటల వరకూ ఆయనను సుమారు 8 గంటలపాటు విచారించారు. శ్రీనివాస్ ఫోన్ కాల్‌డేటాతో పాటు, ఆయన బ్యాంక్ ఖాతా వివరాలను పరిశీలించి, వాటిపై పలు సందేహాలు లేవనెత్తినట్లు సమాచారం. గత నెల 26న నలుగురు ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డిలతో హరియాణాకు చెందిన రామచంద్రభారతి, హైదరాబాద్ వ్యాపారి నందుకుమార్, తిరుపతి స్వామి సింహయాజీలు రహస్య మంతనాలు జరుపుతుండగా.. పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. అదేరోజు మధ్యాహ్నానికి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు ఎయిర్ ఇండియా విమాన టికెట్‌ను బుక్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అసలు సింహయాజీతో మీకున్న సంబంధం ఏంటని అధికారులు శ్రీనివాస్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. సింహయాజీతో పూజలు చేయించడం కోసమే ప్రత్యేకంగా టికెట్ బుక్ చేశానని ఆయన సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అలాగే శ్రీనివాస్ ఫోన్‌లోని యూపీఐ లావాదేవీల జాబితాను ముందు పెట్టి విచారించారు. కాగా, విచారణలో శ్రీనివాస్ ఓ జాతీయ పార్టీకి చెందిన పలువురు నేతల పేర్లు వెల్లడించినట్లు సమాచారం. దీంతో వారికీ 41–ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసి విచారించే అవకాశం ఉంది.

అరగంట ఫోన్‌లో ఏం మాట్లాడారు?

నోటీసులు జారీ చేసిన నలుగురిని విచారించేందుకు 16, 17 అంతస్తుల్లో ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. విచారణకు హాజరయ్యే వారి ప్రతి కదలిక, హావభావాలు, విచారణ సమయంలో సిట్ ప్రశ్నలు, రాబట్టే సమాధానాలు, వారి స్పందన.. ఇలా అన్ని అంశాలూ స్పష్టంగా రికార్డయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు నందుకుమార్ ఫోన్‌ను విశ్లేషించగా.. గత నెల 26 కంటే ముందు అరగంట సేపు సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. ఆ సమయంలో ఏం మాట్లాడారు? 26న టికెట్లు బుక్ చేయాలని ఎవరైనా కోరారా? అని లోతుగా విచారించినట్లు సమాచారం.

శివారు గ్రామాల్లోనూ సేవలందించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- ఫ్యామిలీ ఫిజీషియన్లకు సత్కారం



ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ఉత్తమ సేవలందించిన వైద్యులను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని శివారు గ్రామాలకు విస్తరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వైద్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో పీహెచ్‌సీ స్థాయిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్న వైద్యులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో అకింత భావంతో వైద్యులు మెరుగైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. సంపన్న వర్గాలకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ సేవలను పేదలకు అందించాలని సీఎం వైఎస్ జగన్ ఈ విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నేరుగా పేదల గడప వద్దే వైద్యం అందుతోందన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులను ఏర్పాటు చేయడం జరిగిందని, వారిలో ఒకరు ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, మరొకరు గ్రామీణ స్థాయిలో ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 239 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ విధానం ద్వారా ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో వైద్యులు, సిబ్బంది 104 వాహనం ద్వారా ఇంటింటికి వైద్య సేవలు అందిస్తారన్నారు. 67 రకాల మందులు అందుబాటులో ఉంచారని, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో ఎ.కొండూరు మండలంలోని తండాలలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తూ ముందంజలో ఉన్న ఇబ్రహీంపట్నం, జూపూడి, రెడ్డిగూడెం మండలం రంగాపురం, మైలవరంలోని చంద్రాల, ఎ.కొండూరు మండలం కోడూరు, జి. కొండూరు మండలం చెరువు మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు సుధా ప్రసూజ, సందేష్, నరేష్, దివిజ, కార్తీక్‌లను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, డీఎంహెచ్‌ఓ ఎం.సుహాసిని, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ నళినిదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ సుమ పాల్గొన్నారు.

ధాన్యాన్ని సత్వరం మిల్లులకు తరలించండి

- సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్



మాట్లాడుతున్న సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్

కంకిపాడు: ధాన్యం సత్వరం మిల్లులకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్ సూచించారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలోని కోలవెన్ను ఆర్‌బీకేను సోమవారం ఆయన సందర్శించారు. ఆర్‌బీకే, స్థానిక పీఏసీఎస్ గోదాము వద్ద నిల్వ ఉంచిన ధాన్యం రాశులను, బస్తాలను పరిశీలించారు. తేమ శాతంతో సంబంధం లేకుండా కోసిన పంటను వెంటనే మిల్లుకు తరలించి, సొమ్ము అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఓ పీఎం కిరణ్‌లు పునాదిపాడు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఆయా గ్రామాల్లో కోతలు పూర్తి చేసిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఈత కొలనులో పతకాల పంట



జాతీయ పతాకంతో పతకాలు సాధించిన జగ్గయ్యపేట స్విమ్మర్స్ అసోసియేషన్ క్రీడాకారులు

- అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో జగ్గయ్యపేట స్విమ్మర్ల సత్తా
- వివిధ కేటగిరీల్లో 19 స్వర్ణాలు సహా 22 పతకాలు

జగ్గయ్యపేట అర్బన్: అంతర్జాతీయ స్థాయి ఈత పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట స్విమ్మర్లు పతకాల పంట పండించారు. నేపాల్‌లో ఈనెల 16 నుంచి 19 వరకు జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేటకు చెందిన డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ క్రీడాకారులు 22 పతకాలను సాధించి విజయదుందుభి మ్రోగించారు. వయస్సుల వారీగా నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 19 స్వర్ణం, 2 రజిత, 1 కాంస్య పతకాలతో మొత్తం పతకాలతో సత్తా చాటారు. భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడించారు. ఈ సందర్భంగా సోమవారం డ్రీమర్స్ అసోసియేషన్ కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు, టీమ్ మేనేజర్ ఎ.కల్యాణ్, అధ్యక్ష, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, కలాలి నరేష్ మీడియాతో మాట్లాడుతూ పతకాల వివరాలను తెలిపారు. నేపాల్‌లోని పోఖ్రాలో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్(ఎస్‌బీకేఎఫ్) 7 వ ఇంటర్నేషనల్ గేమ్స్‌ను ఇందుశ్రీ ఆర్గనైజేషన్ స్పాన్సర్‌షిప్‌తో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో నలుగురు మహిళలు, ఏడుగురు పురుషులు కలిపి మొత్తం 11 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న స్విమ్మర్లకు కేసీపీ సిమెంట్స్ ముక్త్యాల యూనిట్ యాజమాన్యం క్రీడాకారులకు పూర్తి ఖర్చులను ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక చొరవ చూపి క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందజేశారని, వారికి తమ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విజేతలకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ ఫౌండర్ సీఐ మోటపోతుల కిషోర్ బాబు, అధ్యక్షుడు పిన్నెల్లి పాండురంగారావు అభినందనలు తెలిపారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ జట్లు ఎంపిక



పోటీల్లో గెలుపొందిన క్రీడాకారుడిని అభినందిస్తున్న పెనమలూరు సీఐ గోవిందరాజు

పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ సెలక్షన్ పోటీలు ఆదివారం రాత్రి కానూరులో నిర్వహించారు. కృష్ణాజిల్లా పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాల నుంచి దాదాపు 100 మంది బాడీ బిల్డర్లు పోటీల్లో పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ఈ నెల 26, 27వ తేదీల్లో 3వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలను క్రీడాకారులను ఎంపిక చేశామని జిల్లా బాడీ బిల్డింగ్ గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు ఈదా రాజేష్, బత్తుల మనోహర్ తెలిపారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన బాడీ బిల్డర్లు...

50–55 కేజీల విభాగంలో సిహెచ్.దుర్గాప్రసాద్, ఆర్.సుదీప్, 55–60 కేజీల విభాగంలో పి.రామ్‌సాయి, ఆర్.రాఘవయ్య, 60–65 కేజీల విభాగంలో ఎం.నాగేశ్వరరావు, ఎస్.కె.హర్ష, ఎస్‌డి.జావిన్‌లను ఎంపిక చేశారు. 65–70 కేజీల విభాగంలో వై.శ్రీకాంత్, ఆర్.యశ్వంత్, పి.అభిలాష్, 70–75 కేజీల విభాగంలో కె.కొండలు, ఆర్.గోపికృష్ణ, వై.సందీప్, 75–80 కేజీల విభాగంలో కల్యాణ్, డి.వంశీ, సీహెచ్.గోపీచంద్, 80–85 కేజీల విభాగంలో కె.వి.కోటేశ్వరరావు, 85–90 కేజీల విభాగంలో పి.గోపీకృష్ణ, బి.రాజేష్, ఎం.తేజలను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర పోటీలకు తీసుకు వెళతామని సంఘ కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రధానం..

బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు, సీబీసీఐడీ సీఐ పెద్దిరాజు, పోటీలో జడ్జిలు గల్లా శ్రీను, పోలయ్య, బాబి, విజయ్, పలువురు పాల్గొని బహుమతులు క్రీడాకారులకు అందచేశారు.

ఎవరికేం చేశావని అసెంబ్లీకి పంపాలి బాబూ..!

- పంపకపోతే రాష్ట్రానికి వచ్చిన నష్టమేం లేదు
- ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ఏ వర్గానికి ఏం మేలు చేశావని నిన్ను అసెంబ్లీకి పంపించాలో చెప్పాలని ఏపీ ముదిరాజ్ డెవలప్‌మెంట్, వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కొర్ను వెంకట నారాయణ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుని ప్రశ్నించారు. నువ్వు అసెంబ్లీకి వెళ్లనంత మాత్రాన రాష్ట్రానికి వచ్చిన నష్టమేమీ లేదని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి అడ్డం పడటం తప్ప అంటూ ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బీసీ సంక్షేమ భవన్‌లో ఆయన సోమవారం మాట్లాడారు. ముఖ్యంగా బీసీల సంక్షేమానికి, అభ్యున్నతికి ఏం చేశారో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజికంగా వెనుకబడిన బీసీలకు చేసిన అన్యాయం, మోసాల ఫలితమే ఈ రోజు చంద్రబాబుకు, ఆ పార్టీకి పట్టిన ఖర్మ అన్నారు. ఎవరు చేసిన పాపానికి వారే ఖర్మ అనుభవించాలన్న నానుడి చంద్రబాబు పట్ల నిజమైందన్నారు. ఆయన చేసిన పాపానికి ఆ పార్టీ మొత్తం ఖర్మ అనుభవించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 20 లక్షలకుపైగా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయమంటే అయ్యన్న పాత్రుడు, అచ్చెన్నాయుడు ఏపీలో మీరెక్కడ ఉన్నారయ్యా అంటూ ఎద్దేవ చేశారని గుర్తు చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరులో బీసీ గర్జన సభలో ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాటను నెరవేర్చిన ప్రజా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబుకు వయసుతో పాటు అసహనం పెరిగి నోటికి ఏది వస్తే అది వాగుతున్నాడని విమర్శించారు. రాష్ట్రానికి, ప్రజలకు చంద్రబాబు చేసిన అన్యాయానికి గరుడ పురాణంలోని శిక్షలన్నీ విధించినా మోక్షం రాదని ఎద్దేవా చేశారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ పార్క్‌లో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలోని ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూసేలా సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. సోమవారం విజయవాడ పోలీసు కంట్రోల్‌రూం వద్ద ఉన్న వైఎస్సార్ పార్క్‌లో ఆమె మున్సిపల్ ఉపాధ్యాయులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డీడీఓ పవర్స్ ఇస్తూ జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉద్యోగుల తరపున సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కల్పలతారెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందాలనే లక్ష్యంతో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు డీడీఓ పవర్స్ కల్పిస్తూ జీవో 180 జారీ చేసి ఉద్యోగుల చిరకాల కోరిక నెరవేర్చారన్నారు. గతంలో వచ్చిన ఏ ఒక్క ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించలేదన్నారు. డీడీఓ పవర్స్ లేక మున్సిపల్ ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. తన ఎన్నికల ప్రచారంలో డీడీఓ పవర్స్ కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని, హామీని నెరవేర్చిన సీఎం వైఎస్‌జగన్‌కు మున్సిపల్ ఉపాధ్యాయులు రుణ పడి ఉంటారన్నారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తూ వైఎస్ జగన్ ముందుకు వెళుతున్నారన్నారు. డీఎస్సీ 98, 2008, డీడీఓ పవర్స్, ఇలా చెప్పుకుంటూ పోతే మూడేళ్ల కాలంలో ఉపాధ్యాయులకు ఎన్నో విధాలుగా మేలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను, నగర అధ్యక్షుడు యిప్పల వెంకటరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తక్కువ ధరలో నాణ్యత గల జనరిక్ మందులు

ఉమ్మడి జిల్లా డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ కోట అనీల్‌కుమార్



మాట్లాడుతున్న ఔషధ నియంత్రణ మండలి ఏడీ కోట అనీల్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారం 35 శాతం మంది ప్రజలు మందులు కొనలేని స్థితిలో ఉన్నారని, ఈ నేపథ్యంలో జనరిక్ మందులను ప్రజలకు చేరువ చేసినట్లు జిల్లా ఔషధ నియంత్రణ మండలి అసిస్టెంట్ డైరెక్టర్ కోట అనీల్‌కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో 61వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల పూర్వ విద్యార్థి అయిన కోట అనీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నవంబరు మూడో వారంలో సమాజంలో ఫార్మసీ పట్ల అవగాహన కలిగించేందుకు, ఆ ఏడాదిలో వచ్చిన నూతన ఫార్మసీ ఆవిష్కరణల గురించి విద్యార్థుల అవగాహన కోసం జాతీయ ఫార్మసీ వారోత్సవాలు జరుపుకుంటామన్నారు. విద్యార్థులు వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జన ఔషధి పేరుతో వస్తున్న జనరిక్ మందులు నాణ్యతలో బ్రాండెడ్ మందులతో అన్ని విధాల సమానమన్నారు. మందుల తయారీ , ఎగుమతిలో మన దేశం ఎన్నో మైలురాళ్లను సాధించి ప్రపంచంలోనే 3వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత, ఫార్మాస్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా జనరిక్ మెడిసిన్‌పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పలు కూడళ్లలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.



'ఒక్క బాల్‌తో జీవితం అంటే ఏమిటో తెలుసుకున్నాను' అంటాడు ఒక ప్రసిద్ధ ఫుట్‌బాల్ ఆటగాడు.

'ఫుట్‌బాల్ అనేది జీవితాన్ని కూడా అర్థం చేయిస్తుందా?' అనే ప్రశ్నకు 'అవును' అని జవాబు చెప్పడానికి రాజస్థాన్‌లోని ఎన్నో గ్రామాలు సిద్ధంగా ఉన్నాయి.

ఇల్లు దాటి బయటికి రాని అమ్మాయిలు, ఫుట్‌బాల్ వల్ల గ్రౌండ్‌లోకి రాగలిగారు. ఆటలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎదగడమే కాదు అనేక కోణాల్లో జీవితాన్ని అర్థం చేసుకున్నారు. బాల్య వివాహాలను బహిష్కరించే చైతన్యం పొందారు...

గేమ్ ఛేంజర్



రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు సమీపంలో చబియావాస్, హిసియావాస్‌లాంటి ఎన్నో గ్రామాలలో బాల్యవివాహాలు అనేవి సర్వసాధారణం. హిసియావాస్ గ్రామానికి చెందిన నిషా గుజ్జార్, కిరణ్‌లకు పెద్దలు పెళ్లి నిశ్చయించారు. అప్పుడు నిషా వయసు పది సంవత్సరాలు. కిరణ్ వయసు పన్నెండు సంవత్సరాలు.

కొంతకాలం తరువాత...

నిషా ఊళ్లోని ఫుట్‌బాల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో పేరు నమోదు చేసుకుంది. రోజూ రెండు గంటల పాటు ఆట నేర్చుకునేది. చబియావాస్ గ్రామానికి చెందిన పదమూడు సంవత్సరాల మమతకు గత సంవత్సరం నిశ్చితార్థం అయింది. అయితే ఆ వయసులో పెళ్లి చేసుకోవడం తనకు ఎంత మాత్రం ఇష్టం లేదు. అలా అని అని ఇంట్లో ఎదురు చెప్పే ధైర్యమూ లేదు.

మరో గ్రామానికి చెందిన నీరజకు చిన్న వయసులోనే పెళ్లి అయింది. అత్తారింటికి వెళితే పనే లోకం అవుతుంది. తనకు చదువుకోవడం అంటే చాలా ఇష్టం. నిషాలాగే మమతా, నీరజ ఇంకా ఎంతో మంది అమ్మాయిలు శిక్షణా కేంద్రంలో పేరు నమోదు చేసుకొని ఫుట్‌బాల్ ఆడడం మొదలుపెట్టారు.

ఇప్పుడు...

'పద్దెనిమిది సంవత్సరాలు దాటితేగానీ పెళ్లి చేసుకోను' అని పెద్దలకు ధైర్యంగా చెప్పేసింది నిషా. వాళ్లు ఒప్పుకున్నారు. 'ఇప్పుడే పెళ్లి వద్దు, అబ్బాయి కుటుంబ నేపథ్యం గురించి నేను తెలుసుకోవాలి. నా చదువు పూర్తి కావాలి' అని ధైర్యంగా చెప్పింది మమత. వాళ్లు కూడా ఒప్పుకున్నారు.

'పెళ్లి ఇప్పుడే వద్దు. నాకు చదువుకోవాలని ఉంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేయాలనేది నా కల' అని ఇంట్లో వాళ్లకు చెప్పింది నీరజ.

ఇంత మార్పు ఎలా వచ్చింది? నీరజ మాటల్లో చెప్పాలంటే...

'ఫుట్‌బాల్ ఆడడం వల్ల ఎంతో ఆత్మవిశ్వాసం, నా మనసులోని మాటను బయటికి చెప్పే శక్తి వచ్చింది'

ఫుట్‌బాల్ ఆడడంతో పాటు అమ్మాయిలందరూ ఒక దగ్గర కూర్చొని మాట్లాడుకునేవారు. అందులో ఎక్కువమంది చిన్న వయసులోనే పెళ్లి, నిశ్చితార్థం అయిన వారు ఉన్నారు. మాటల్లో చిన్న వయసులోనే పెళ్లి ప్రస్తావన వచ్చేది. 'ఎవరో కాదు మనమే అడ్డుకుందాం. మన జీవితాన్ని మనమే తీర్చిదిద్దుకుందాం' అనే చైతన్యం వారిలోకి వచ్చి చేరింది.

'ఒకప్పుడు సంప్రదాయ దుస్తులు తప్ప వేరే దుస్తులు ధరించే అవకాశం లేదు. స్కూలుకు పంపడమే గొప్ప అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు స్పోర్ట్స్‌వేర్‌లో నన్ను నేను చూసుకుంటే గర్వంగా ఉంది. ఒకప్పుడు ఆటలు అంటే మగపిల్లలకు మాత్రమే అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు మాత్రం పెద్దల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది' అంటుంది స్వప్న.

'మహిళా జన్ అధికార్' అనే స్వచ్ఛందసంస్థ రాజస్థాన్‌లో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో ఆడపిల్లలకు ఫుట్‌బాల్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాలను మొదలుపెట్టింది. అయితే ఈ ఫుట్‌బాల్ శిక్షణా కేంద్రాలు కాస్తా చైతన్య కేంద్రాలుగా మారాయి. 'వ్యూహాత్మకంగానే గ్రామాల్లో ఫుట్‌బాల్ శిక్షణా కేంద్రాలు ప్రారంభించాం. దీనివల్ల అమ్మాయిలు ఈ ఆటలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో ఆడడం ఒక కోణం అయితే, సామాజిక చైతన్యం అనేది మరో కోణం. ఆట గురించి మాత్రమే కాకుండా మహిళల భద్రత, మహిళల హక్కులు, లింగ సమానత్వం... మొదలైన ఎన్నో అంశాల గురించి బోధిస్తున్నాం' అంటోంది 'మహిళా జన్ అధికార్' బాధ్యురాలు ఇందిరా పంచోలి.

టాక్ షోలకు జేజమ్మ



నివాళి

భారతదేశపు మాటల మాంత్రికురాలిగా ఆమెను అభివర్ణించవచ్చు మాటతో మనిషిని మార్చవచ్చని వినోదం పంచవచ్చని అంతరంగాలు బహిర్గతం చేయవచ్చని అనుభవాలను పాఠాలుగా తర్వాతి తరాలకు అందజేయవచ్చని సీనియర్ టెలివిజన్ పర్సనాలిటీ తబస్సుమ్ నిరూపించింది ఇటీవలి ఆమె మరణంతో ఒక గొప్ప వాక్ ఆకర్షణకు ముగింపు పడ్డట్టయింది. తబస్సుమ్‌ని తలచుకోవడమంటే గడిచిపోయిన పసిడి కాలాన్ని స్మరణ చేసుకోవడం

బాలీవుడ్ వాళ్ల వెంట ఇంటర్వ్యూ చేస్తామని వెంటపడేవాళ్లు ఇప్పుడు ఎక్కడ పట్టినా ఉన్నారు. కాని ఒకప్పుడు బాలీవుడ్ హేమాహేమీలంతా మమ్మల్ని ఇంటర్వ్యూ చేయమని ఒకే ఒక హోస్ట్ వెంట పడేవారు.

ఆ హోస్ట్ తబస్సుమ్... దూరదర్శన్ వచ్చిన కొత్త. అప్పటికే రేడియో షోలతో పేరు గడించిన తబస్సుమ్ దూరదర్శన్‌లో 'ఫూల్ ఖిలే హై గుల్షన్ గుల్షన్' అనే షో మొదలుపెట్టింది. బాలీవుడ్ దిగ్గజాలను ఇంటర్వ్యూ చేసే షో అది. 1972 అక్టోబర్‌లో ముంబైలో దూరదర్శన్ తన ప్రసారాలు మొదలెట్టింది. అదే నెల మొదటి వారంలోనే తబస్సుమ్ షో 'ఫూల్ ఖిలే హై గుల్షన్ గుల్షన్' ప్రారంభమైంది. ఎన్నాళ్లు నడిచిందో తెలుసా? 21 ఏళ్లు. 1993 వరకు.

అప్పటికి శాటిలైట్ చానల్స్ లేకపోవడం వల్ల, ఎలక్ట్రానిక్ దృశ్య ప్రసార మాధ్యమాలు వేరేవి లేకపోవడం వల్ల తబస్సుమ్ మొదలెట్టిన షో సూపర్ డూపర్ హిట్ అయ్యింది. బాలీవుడ్‌లో కొత్తగా అడుగుపెట్టిన తారలు తబస్సుమ్ వెంట తిరుగుతూ తమను ఇంటర్వ్యూ చేయమని అడిగేవారు. ఎందుకంటే ఎన్ని సినిమాల్లో నటించినా తబస్సుమ్ షోలో వస్తేనే వారికి అసలైన స్టార్‌డమ్ వచ్చినట్టు.

బేబీ తబస్సుమ్



తబస్సుమ్ షో ఎందుకంటే ప్రాచుర్యం పొందింది అంటే ఆమెకు బాలీవుడ్ అంతా కొట్టిన పిండి. 1944లో ఆమె జన్మిస్తే మూడేళ్ల వయసు నుంచే అంటే 1947 నుంచే నటన మొదలు పెట్టింది. మొదటి సినిమా పారితోషికం వెయ్యి రూపాయలు. ఆ తర్వాత 12 వందలు. పదేళ్ల వయసు వచ్చే సరికి బాలనటిగా బేబీ తబస్సుమ్‌గా 1955 నాటికి సినిమాకు ఆరు నుంచి ఎనిమిది వేలు తీసుకునేది. ఆలోచించండి 1955లో నెల జీతం 20 రూపాయలు ఉండేది మామూలు ఉద్యోగిది. ఆమె స్టార్‌డమ్ అలాంటిది. హిందీ సినిమాల్లో ఆ రోజుల్లో కథ హీరో బాల్యం, హీరోయిన్ బాల్యం చూపించి ఆ తర్వాత యుక్త వయసులో కొనసాగేది. అందువల్ల బేబీ ఆర్టిస్టులకు డిమాండ్. తబస్సుమ్ తన మాటకారితనం వల్ల, చక్కటి ఉచ్చారణ వల్ల, ముద్దొచ్చే రూపం వల్ల మీనా కుమారి, మధుబాల, సురయ్యా వంటి స్టార్‌లకు బాలనటిగా నటించేది. ఆ నటనలో భాగంగా మీనాకుమారి, మధుబాల వంటి స్టార్లకు ఎంతో మాలిమి అయ్యింది. 'మొఘల్-ఎ-ఆజమ్'లో కూడా తబస్సుమ్ ఒక సీన్‌లో కనిపిస్తుంది. అందుకే తబస్సుమ్ అడిగితే ఎంతటి స్టార్ కూడా వచ్చి టాక్‌షోలో పాల్గొనేవారు. అలా ఆమె టాక్‌షోలతో సూపర్‌హిట్ సాధించింది.

అసలుపేరు కిరణ్‌బాల

తబస్సుమ్ తండ్రి అయోధ్యనాథ్ సచ్‌దేవ్ పంజాబీ హిందూ. తల్లి అస్గరీ బేగం ముస్లిం. తల్లి మతాన్ని గౌరవించడానికి తండ్రి తన కూతురికి 'తబస్సుమ్' (చిర్నవ్వు) అని పెట్టుకుంటే తండ్రి మతాన్ని గౌరవించడానికి తల్లి తన కూతురికి కిరణ్‌బాల అని పెట్టింది. ఆమె అకడెమిక్ రికార్డుల్లో కిరణ్‌బాల అనే ఉంటుంది. రామాయణంలో రాముడుగా వేసిన అరుణ్ గోవిల్ సోదరుడు విజయ్ గోవిల్‌ను ఈమె వివాహమాడింది. ఈమెకు ఒక కొడుకు హోషంగ్ గోవిల్.

తొలి అడుగు

తబస్సుమ్ తల్లిదండ్రులిద్దరూ జర్నలిస్టులుగా పని చేశారు. పత్రిక కూడా నడిపారు. తండ్రి ద్వారా హిందీ, తల్లి ద్వారా ఉర్దూ నేర్చుకున్న తబస్సుమ్ చక్కటి సంభాషణను ఏ భాషలోనైనా అనర్గళంగా నిర్వహించే సామర్థ్యం గడించింది. అందువల్ల రేడియో, టెలివిజన్ ప్రెజెంటర్‌గా మారింది. ఆమె గొంతుకు, శ్రోతలతో ప్రేక్షకులతో సంభాషించే పద్ధతికి విశేషమైన అభిమానులు ఏర్పడ్డారు. దాంతో ఆమె ఒక ట్రూప్‌ను తీసుకుని స్టేజ్‌షోస్ చేసేది. వాటికి జనం పోటెత్తేవారు. ఇవాళ మనం చూస్తున్న సుమ వంటి వ్యాఖ్యాతలందరికీ తబస్సుమ్‌ను జేజమ్మగా చెప్పుకోవచ్చు. కరణ్ జోహార్ ఆమెను చూసే తాను కూడా పెద్దయ్యాక ఇంటర్వ్యూలు చేయాలి అని అనుకున్నాడు. ఆ విధంగానే 'కాఫీ విత్ కరణ్' చేశాడు. తబస్సుమ్ దేశంలో 'స్టార్ ఇంటర్వ్యూయర్' ధోరణిని ప్రవేశపెట్టింది. అంటే తానే ఒక స్టార్‌గా ఉంటూ మరో స్టార్‌ని ఇంటర్వ్యూ చేయడం.



మేకప్‌కు మించిన వ్యసనం లేదు

'ప్రపంచంలో అన్ని వ్యసనాల కంటే మేకప్పే అసలైన వ్యసనం' అని మధుబాల తబస్సుమ్ షోలో చెప్పింది. ఒక్కసారి ముఖానికి మేకప్ పడ్డాక ఆ భూతం దిగదని ఆమె చెప్పడాన్ని తబస్సుమ్ గుర్తు చేసుకుంటుంది. ఆమె మన తెలుగువాడైన జానీ లీవర్‌కు సాయం చేసింది. గల్లీల్లో మిమిక్రీ చేస్తున్న జానీ లీవర్‌ను గుర్తించి తాను చేసే స్టేజ్ షోలలో మిమిక్రీ చేసే అవకాశం ఇచ్చింది. దాంతో అతను మిమిక్రీ స్టార్ అయ్యాడు. సునిధి చౌహాన్‌ను కూడా తబస్సుమ్ గుర్తించి తన షోలతో పాపులర్ చేసింది.

తబస్సుమ్ తన చివరి రోజుల్లో 'తబస్సుమ్ టాకీస్' అనే యూట్యూబ్ చానల్ తెరిచి ఆనాటి ముచ్చట్లు చెప్పేది. ఆమె ఎప్పుడూ తెల్లజుట్టుతో మేకప్ లేకుండా కనిపించలేదు. అందమైన గొంతు, ప్రెజెన్స్‌తో ఉంటూ అలానే కనుమరుగైంది.

సాగుబడి

అనూరాధ కార్తె: డిసెంబర్ 2 వరకు



రసాయనాలతో సాగు చేసిన పత్తి చేనులో వెంకయ్య

ప్రకృతి సేద్యంలో సాగైన పత్తి చేనులో వెంకటేశ్వరరెడ్డి

ప్రకృతి పత్తి భళా!

- నికరాదాయం ఎకరాకు రూ.1.2 లక్షలు
- అబ్బురపరుస్తున్న యువ రైతు అనుభవాలు
- పక్క పొలంలోనే రసాయనిక సేద్యంలో తండ్రికి నష్టం

పంట ఏదైనా ప్రకృతి వ్యవసాయంలో పండించటం ఎంతో శ్రేయస్కరమని ఓ యువ రైతు అనుభవ పూర్వకంగా చెబుతున్నారు. రెండున్నర ఎకరాల్లో రసాయనిక సేద్య పద్ధతిలో గత ఏడాది మిర్చి సాగు చేసి నల్లతామర బారిన పడ్డారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అనుసరించిన తర్వాత మిర్చి పంట కోలుకొని మోస్తరు దిగుబడినివ్వటంతో ఈ పద్ధతిపై ఆయనకు గురి కుదిరింది. ఈ ఏడాది పంట మార్పిడి చేసి పత్తి సాగు చేశారు. 2.5 ఎకరాలకు ఇప్పటి వరకు రూ. 50 వేలు ఖర్చయ్యింది. 25 క్వింటాళ్ల పత్తి తీశారు. మరో 12 క్వింటాళ్లు వస్తుందని, ఎకరానికి రూ. 1.2 లక్షల నికరాదాయం వస్తుందని యువ రైతు ఘంటాపథంగా చెబుతున్నారు. పక్కనే ఆయన తండ్రి రసాయనిక సేద్యంలో సాగు చేసిన పత్తి ఎకరానికి 3-4 క్వింటాళ్ల దిగుబడితో నష్టాలు మిగిల్చింది.

వారిద్దరూ తండ్రీ కొడుకులు. తండ్రి వెన్నా వెంకయ్య. కొడుకు వెంకటేశ్వరరెడ్డి. వీరిది ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలోని గొబ్బూరు గ్రామం. వెంకయ్య తనకు ఉన్న 5 ఎకరాల పొలంలో కుమారుడు వెన్నా వెంకటేశ్వరరెడ్డికి 2.5 ఎకరాలు పంచి ఇచ్చారు. గతంలో ఇద్దరూ రసాయన ఎరువులనే నమ్ముకొని వ్యవసాయం చేసేవారు. వెంకటేశ్వరరెడ్డి డిగ్రీ వరకు చదువుకున్నారు. ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకొని గత ఏడాది తొలుత మిరప పంటపై ప్రయోగం చేశారు. ఏపీ రైతు సాధికార సంస్థ విస్తరణ సిబ్బంది చక్రపాణిరెడ్డి, సత్యారెడ్డి సూచనల మేరకు ప్రకృతి సేద్యం చేపట్టారు.

చెరి రెండున్నర ఎకరాల భూమిలో డబుల్ బీటీ పత్తి పంట జూలై ఆఖర్లో విత్తారు. ప్రకృతి వ్యవసాయాన్ని నమ్ముకున్న కుమారుడు పత్తి తొలి రెండు కోతల్లోనే 25 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించారు. మంచి ఫలితాలు రావటంతో ఈ ఏడాది పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. మంచి ఫలితాలు సాధించడంతో పాటు గ్రామంలో ఆదర్శ రైతుగా నిలిచారు. రసాయన ఎరువులు, పురుగు మందులను నమ్ముకున్న తండ్రి మాత్రం రెండున్నర ఎకరాల్లో 10-11 క్వింటాళ్ల లోపు దిగుబడితో సరిపెట్టుకొని ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఇతర రైతులకు కూడా ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత ఏమిటో అర్థమవుతోంది.

– నూరుద్దీన్, సాక్షి, యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా

పెట్టుబడి కూడా చేతికి రాలేదు



రెండున్నర ఎకరాల్లో విత్తుకున్న డబుల్ బీటీ పత్తి పంటలో అధిక దిగుబడి సాధించేందుకు పాత పద్ధతిలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడాను. వీటికే దాదాపు రూ. లక్ష ఖర్చయింది. తొలి విడతలోనే దిగుబడి తగ్గింది. పేనుబంక, ఎర్రనల్లి, తామర పురుగు సోకాయి. పంటను కాపాడుకోవటానికి చాలా కష్టపడ్డాను. అయినప్పటికీ ఫలితం కనిపించలేదు. రెండు కోతల్లో ఎకరాకు 3-4 క్వింటాళ్ల ప్రకారం మొత్తం 10-11 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. చేనుకు సోకిన ఎర్ర తెగులు దెబ్బతీసింది. పెట్టుబడులు చేతికందే పరిస్థితి కనిపించకపోవడంతో పంటను వదిలేశాను. ప్రకృతి వ్యవసాయం చేసి ఉంటే మంచి దిగుబడులు వచ్చి ఉండేవని ఇప్పుడు అనిపిస్తోంది.

- వెన్నా వెంకయ్య (96036 33100), పత్తి రైతు, గొబ్బూరు, పెద్దారవీడు మండలం, ప్రకాశం జిల్లా

ప్రకృతి సేద్యం వల్లే పత్తిలో లాభాలు



గత సంవత్సరం రెండున్నరెకరాల్లో మిరప పంట వేశాను. తీవ్రంగా నష్టపోయాను. నల్లతామర సోకింది. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడుతున్నప్పటికీ ఫలితం కనిపించలేదు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఇచ్చిన సలహా మేరకు వేప కషాయం, పులిసిన మజ్జిగ పిచికారీ చేస్తే నల్లి ఉధృతి బాగా తగ్గింది. దీని వలన ఖర్చు బాగా తగ్గడంతోపాటు ఎకరాకు 25 క్వింటాళ్ల మిరప దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం పంట మార్పిడి చేసి ప్రకృతి వ్యవసాయంలో పత్తి విత్తుకున్నాను. ప్రక్క పొలంలో మా నాన్న కూడా పత్తి విత్తారు. నేను పూర్తిగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాను. ముందుగా పొలం బాగు చేసుకొని 20 రకాల ధాన్యాలు ఎకరాకు 20 కిలోల ప్రకారం పొలంలో తొలకరి మొదట్లోనే చల్లాను. అవి మొలకెత్తిన 45 రోజుల తరువాత రొటొవేటర్‌తో కలియదున్నాను. 20 రోజుల తర్వాత డబుల్ బీటీ పత్తి విత్తనాలను బీజామృతంలో శుద్ధి చేసుకొని విత్తాను. 15 రోజులకోసారి మూడు దఫాలుగా జీవామృతం పిచికారీ చేశాను. 45 రోజుల తరువాత దోమ ఆశించకుండా వేప గింజల కషాయం, పులిసిన మజ్జిగ రెండు సార్లు పిచికారీ చేశాను. పొలం దున్నకం నుంచి ఇప్పటి వరకు రెండున్నర ఎకరాలకు కేవలం రూ. 50 వేలు ఖర్చయింది. రెండు కోతల్లోనే 25 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. ప్రస్తుతం పంటకు నీటి తడి పెడుతున్నాం. మరో 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, ఎకరానికి రూ. 1.2 లక్షల వరకు నికరాదాయం రావచ్చని ఆశిస్తున్నాను.

- వెన్నా వెంకటేశ్వరరెడ్డి (98481 32923), పత్తి రైతు., గొబ్బూరు, పెద్దారవీడు మం., ప్రకాశం జిల్లా

'నిశ్శబ్ద మహమ్మారి'కి కళ్లెం





యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎ.ఎం.ఆర్.) ప్రపంచ వ్యాప్తంగా ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారింది. అందుకే దీన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'నిశ్శబ్ద మహమ్మారి'గా అభివర్ణించింది. వ్యవసాయంలో, పశుపోషణలో, కోళ్ల పెంపకంలో, ఆక్వా సాగులో మితిమీరిన రసాయనాల వాడకం ఈ సమస్యకు మూలం. ఈ రసాయనాలకు క్రిమికీటకాలు నిరోధకతను పెంచుకోవటం వల్ల ఆపత్కాలంలో యాంటీబయాటిక్స్ వంటి ప్రాణరక్షక ఔషధాలు అసమర్థంగా మారుతున్నాయి.

అంటు వ్యాధులకు గురైన మనుషులకు, పశువులకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడటం రోజురోజుకూ కష్టతరంగా మారుతోంది. ఎ.ఎం.ఆర్. ప్రజల ఆరోగ్యంతో పాటు, జీవనోపాధి, ఆర్థిక వ్యవస్థలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఈ సమస్యపై జనబాహుళ్యానికి అవగాహన కల్పించేందుకు నవంబర్ 18-24 వరకు వారోత్సవాలు జరుగుతున్నాయి. 'అందరం కలసికట్టుగా యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్‌ను నిరోధిద్దాం'.. ఇదీ ఈ ఏడాది వారోత్సవాల థీమ్.

● వ్యవసాయ, అనుబంధ రంగాలే కీలకం

'యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ ఓ ఆరోగ్య సమస్య. మనుషుల ఆరోగ్యం.. పాలు-మాంసం-గుడ్ల ఉత్పత్తి కోసం పెంచే ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కుందేళ్లు, పందులు వంటి పశువులు-కోళ్ల ఆరోగ్యం.. రొయ్యలు, చేపల సాగుతో పాటు పంటల సాగులో రసాయనిక క్రిమి కీటక నాశనుల దుర్వినియోగం / మితిమీరిన వాడకం వంటి కారణాల వల్ల ఈ 'నిశ్శబ్ద మహమ్మారి' చాపకింద నీరులా విస్తరిస్తోంది. రసాయనిక వ్యవసాయ పొలాలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రుల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలు, మురుగు నీరు పర్యావరణాన్ని కలుషితం చేస్తూ ఎ.ఎం.ఆర్. వ్యాప్తికి తోడ్పడుతున్నాయి.

● పశువ్యాధులకు మూలికా చికిత్స మేలు

పాడి పరిశ్రమ ఆధునీకరణలో భాగంగా సంకర జాతి పాడి పశువుల పెంపకంపై దృష్టి కేంద్రీకరించడం వల్ల పాల ఉత్పత్తి పెరిగింది, ఈ క్రమంలోనే వ్యవసాయ రసాయనాల వినియోగం పెచ్చుమీరింది. ప్రపంచవ్యాప్తంగా పొదుగు వాపు, పారుడు వంటి సాధారణ పశు వ్యాధులకు యాంటీబయాటిక్స్ వాడకం విస్తృతంగా ఉంది. ఇది యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ ముప్పును పెంపొందిస్తోంది.

పశువుల వ్యాధుల చికిత్సలో యాంటీబయాటిక్స్‌కు బదులుగా మూలికల మిశ్రమాలను ఉపయోగించటం ద్వారా తక్కువ ఖర్చుతోనే సత్ఫలితాలను సాధిస్తుండటం విశేషం. దీన్నే 'ఎత్నోవెటరినరీ మెడిసిన్ (ఇ.వి.ఎం.)' అని పిలుస్తున్నారు. జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్.డి.డి.బి.) ఈ సాంప్రదాయ పద్ధతులపై లోతైన పరిశోధనలు నిర్వహిస్తున్న బెంగళూరులోని టిడియు వర్సిటీ తోడ్పాటుతో పాడి సహకార సంఘాల ద్వారా దేశవ్యాప్తంగా ఈ పద్ధతులను ప్రోత్సహిస్తోంది. ప్రాంతీయ భాషల్లోనూ 30కి పైగా పశు వ్యాధులను సమర్థవంతంగా నివారించే మూలికా చికిత్సలపై పుస్తకాలు, యూట్యూబ్ వీడియోలను అందుబాటులోకి తెచ్చింది.

● 87% తగ్గిన యాంటీబయోటిక్స్ వాడకం

ఎన్.డి.డి.బి. గణాంకాల ప్రకారం.. గత ఐదేళ్లలో 5,56,000 పశువులకు సోకిన వ్యాధులు, సగటున 82 శాతం హెర్బల్ మెడిసిన్‌తో నయమయ్యాయి. డెయిరీ రంగంలో యాంటీబయాటిక్స్, ఇతర పశువైద్య ఔషధాల వినియోగాన్ని తగ్గించడంలో చిన్న, పెద్ద రైతులకు నేచురల్ లైవ్‌స్టాక్ ఫార్మింగ్ ఫౌండేషన్ (ఎన్.ఎల్.ఎఫ్.) శిక్షణ ఇస్తోంది. మన దేశంలో 30 వేల మంది రైతులకు, 2 వేల మంది పశువైద్యులకు శిక్షణ ఇచ్చింది. రెండేళ్లలో యాంటీబయాటిక్స్ వాడకం 87% తగ్గింది. పాల నాణ్యత బాగా మెరుగైంది. పాలలో యాంటీబయాటిక్ అవశేషాలు 8% తగ్గింది. రైతుల ఆదాయం 33% పెరిగింది. దూడల మరణాలు 60 శాతం తగ్గాయని ఎన్.ఎల్.ఎఫ్. తెలిపింది.

● ఆరోగ్యం ఒక్కటే

మన ఆరోగ్యం, జంతువుల ఆరోగ్యం, సహజ వనరుల ఆరోగ్యం.. ఈ మూడూ వేర్వేరు కాదు. అన్నీ పరస్పరాధారితాలే. అందువల్లనే 'ఆరోగ్యం ఒక్కటే (ఒన్ హెల్త్)' అన్న నినాదంతో అన్ని రంగాల సమష్టి ప్రయత్నాల ద్వారా ఎ.ఎం.ఆర్. సమస్యను సమగ్రంగా పరిష్కరించాలి. మనుషులకు, పశువులకు సుస్తీ చేసినప్పుడు రసాయనాల వాడకాన్ని తగ్గించటంతోపాటు ఆయుర్వేద మూలికలు, హోమియో వంటి ప్రత్యామ్నాయ ఔషధాలు వినియోగించటం ద్వారా 'నిశ్శబ్ద మహమ్మారి'ని పారదోలవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కోళ్ల పెంపకంలో, ఆక్వా సాగులోనూ రసాయనాలకు ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలి. వ్యర్థాల నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందిస్తే ఎ.ఎం.ఆర్.ను నివారించవచ్చు.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

26, 27 తేదీల్లో ప్రకృతి సేద్యంపై నెల్లూరులో ఉచిత శిక్షణ

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఎన్జీఆర్ సంస్థ సహకారంతో ఈ నెల 26, 27 తేదీల్లో ఉచిత భోజన-వసతులతో కూడిన రైతు అవగాహన సదస్సును హైదరాబాద్‌కు చెందిన 'సేవ్' స్వచ్ఛంద సంస్థ నిర్వహించనుంది. డా. సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని మరింత మందికి చేరువ చేసే ప్రయత్నంలో భాగంగా 'సేవ్' ఈ సదస్సును నిర్వహిస్తున్నది. ప్రకృతి వ్యవసాయ ఉద్యమకారులు విజయరామ్ రైతులకు రెండు రోజుల పాటు అనేక అంశాలపై శిక్షణ ఇస్తారు.

మాగాణి, మెట్ట సేద్యంలో 5 లేయర్ విధానంపై సమగ్ర అవగాహన, పొలంలో చెరువు ప్రాధాన్యం, నేలతల్లి పరిరక్షణలో ఆవులు, దేశీ విత్తనాల పాత్ర తదితర అంశాలపై శిక్షణ ఉంటుంది. సంప్రదాయ భోజనం తదితర అంశాలపై 'మిల్లెట్స్ రాంబాబు' ప్రసంగిస్తారు. ఎన్జీఆర్ సంస్థ ఎం.డి. నాయుడు అమృతేష్ రెడ్డి, డా. బాబురామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సదస్సు జరగనుంది. రైతులు ముందస్తుగా పేర్ల నమోదు కోసం సంప్రదించవలసిన నెంబర్లు.. సేవ్ కార్యాలయం 040-27654337, 89515 09067.

సేంద్రియ సాగు-విలువ జోడింపుపై 3 రోజుల శిక్షణ

సేంద్రియ సాగు విధానం, పంట దిగుబడులకు విలువ జోడింపు పద్ధతులపై ఈ నెల 26,27,28 తేదీల్లో గుంటూరు జిల్లా కొర్నెపాడులో రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వేంకటేశ్వరరావు తెలిపారు. కూరగాయలు నిల్వ, విలువ జోడింపు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. పేర్ల నమోదుకు.. 97053 83666, 95538 25532.



జొకోవిచ్ 'సిక్సర్'

పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ 'ఏటీపీ ఫైనల్స్'లో సెర్బియా స్టార్ జొకోవిచ్ ఆరోసారి విజేతగా నిలిచాడు. ఆరు టైటిల్స్‌తో స్విట్జర్లాండ్ దిగ్గజం ఫెడరర్ పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. ఇటలీలోని ట్యూరిన్ నగరంలో జరిగిన ఫైనల్లో జొకోవిచ్ 7-5, 6-3తో మూడో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)పై గెలిచాడు. ఈ టోర్నీలో అజేయంగా నిలిచిన జొకోవిచ్‌కు టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక ప్రైజ్‌మనీ లభించింది. అతను 47 లక్షల డాలర్లు (రూ. 38 కోట్ల 35 లక్షలు) గెల్చుకున్నాడు. గతంలో జొకోవిచ్ 2008, 2012, 2013, 2014, 2015లలో ఈ టోర్నీ టైటిల్స్‌ను సాధించాడు.

అర్జున్‌కు ఆరో స్థానం



చాంపియన్స్ టూర్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఆరు పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచాడు. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఈ టోర్నీలో చివరిదైన ఏడో రౌండ్‌లో అర్జున్ 0.5-2.5తో భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద చేతిలో ఓడిపోయాడు. ప్రజ్ఞానంద కూడా ఆరు పాయింట్లు సాధించినా మెరుగైన టైబ్రేక్ స్కోరుతో అతనికి ఐదో ర్యాంక్ దక్కింది. ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్ (నార్వే) 20 పాయింట్లతో విజేతగా నిలిచాడు.

జగదీశన్ 277

దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో సోమవారం అనేక అద్భుతాలు చోటు చేసుకున్నాయి. పలు ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి. తమిళనాడు బ్యాటర్ జగదీశన్ విశ్వరూపం ప్రదర్శించాడు. ఫలితంగా తమిళనాడు జట్టు లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో రికార్డుల జాతరతో చరిత్ర పుటల్లోకి ఎక్కింది.

వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన తమిళనాడు బ్యాటర్

- 141 బంతుల్లో 25 ఫోర్లు, 15 సిక్స్‌లు
- వరుసగా ఐదు సెంచరీలు చేసిన తొలి క్రికెటర్‌గా గుర్తింపు
- విజయ్ హజారే ట్రోఫీలో తమిళనాడు జట్టు రికార్డుల జాతర



బెంగళూరు: వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం గతవారం చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వదిలించుకున్న ఎనిమిది క్రికెటర్లలో నారాయణ్ జగదీశన్ ఒకడు. నాలుగేళ్లుగా చెన్నై జట్టుతో ఉన్నా కేవలం ఏడు మ్యాచ్‌ల్లో అతనికి అవకాశం దక్కింది. ఇక తన అవసరం లేదని సీఎస్‌కే జట్టు నుంచి తప్పించడంతో జగదీశన్ (141 బంతుల్లో 277; 25 ఫోర్లు, 15 సిక్స్‌లు) ఆ కసినంతా బ్యాట్‌తో చూపించాడు. అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లను ఊచకోత కోశాడు. పరుగుల వరద పారించాడు. జగదీశన్ ధాటికి లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు) పలు ప్రపంచ రికార్డులు చెల్లాచెదురయ్యాయి. 26 ఏళ్ల జగదీశన్ కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో తమిళనాడు జట్టు దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో రికార్డుల జాతర సృష్టించింది.

435 గ్రూప్ 'సి'లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో సోమవారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 435 పరుగుల ఆధిక్యంతో నెగ్గి వరుసగా ఐదో విజయం నమోదు చేసింది. 503 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అరుణాచల్ ప్రదేశ్ 28.4 ఓవర్లలో 71 పరుగులకు ఆలౌటైంది. లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో పరుగుల తేడా పరంగా ఇదే అతి పెద్ద విజయం. 346 పరుగులతో సోమర్‌సెట్ జట్టు పేరిట ఉన్న రికార్డును తమిళనాడు బద్దలు కొట్టింది. కౌంటీ క్రికెట్‌లో 1990 జూన్ 27న జరిగిన మ్యాచ్‌లో సోమర్‌సెట్ జట్టు 413/4 స్కోరు చేయగా... డెవాన్ జట్టు 67 పరుగులకే ఆలౌటైంది.

506 టాస్ ఓడిన అరుణాచల్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. తమిళనాడు 50 ఓవర్లలో 2 వికెట్లకు 506 పరుగులు చేసి లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా రికార్డు నెలకొల్పింది. దాంతో ఇంగ్లండ్ (50 ఓవర్లలో 498/4; నెదర్లాండ్స్‌పై 2022 జూన్ 17) పేరిట ఉన్న రికార్డు బద్దలయింది.

277 ఓపెనర్ జగదీశన్ 277 పరుగులు సాధించి లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన క్రికెటర్‌గా చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. 20 ఏళ్లుగా అలిస్టర్ డంకన్ బ్రౌన్ (సర్రే) పేరిట ఉన్న రికార్డును జగదీశన్ తిరగరాశాడు. కౌంటీ క్రికెట్‌లో భాగంగా 2002 జూన్ 19న గ్లామోర్గాన్ జట్టుతో మ్యాచ్‌లో బ్రౌన్ 160 బంతుల్లో 30 ఫోర్లు, 12 సిక్స్‌లతో 268 పరుగులు సాధించాడు. వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన భారత క్రికెటర్‌గా కూడా జగదీశన్ ఘనత సాధించాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ (264; శ్రీలంకపై 2014లో) పేరిట ఉన్న రికార్డును జగదీశన్ సవరించాడు.

416 మరో ఓపెనర్ సాయి సుదర్శన్ (102 బంతుల్లో 154; 19 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి జగదీశన్ తొలి వికెట్‌కు 416 పరుగులు జోడించాడు. లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. 2015లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ క్రికెటర్లు గేల్, సామ్యూల్స్ రెండో వికెట్‌కు 372 పరుగులు జతచేశారు. ఆ రికార్డును జగదీశన్-సాయి సుదర్శన్ బద్దలు కొట్టారు.

5 విజయ్ హజారే ట్రోఫీలో జగదీశన్‌కిది వరుసగా ఐదో సెంచరీ కావడం విశేషం. తద్వారా లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో వరుసగా ఐదు సెంచరీలు చేసిన ఏకైక క్రికెటర్‌గా జగదీశన్ రికార్డు నెలకొల్పాడు. వరుసగా 4 సెంచరీలతో సంగక్కర (శ్రీలంక; 2014-15లో), అల్విరో పీటర్సన్ (దక్షిణాఫ్రికా; 2015-16లో), దేవ్‌దత్ (భారత్; 2020-21లో) పేరిట ఉన్న రికార్డును జగదీశన్ తిరగరాశాడు. విజయ్ హజారే ట్రోఫీలో జగదీశన్ ఆంధ్ర (114 నాటౌట్)పై, ఛత్తీస్‌గఢ్ (107)పై, గోవా (168)పై, హరియాణా (128)పై సెంచరీలు చేశాడు.

సంక్షిప్త స్కోర్లు
తమిళనాడు ఇన్నింగ్స్: 506/2 (50 ఓవర్లలో) (జగదీశన్ 277, సాయి సుదర్శన్ 154, బాబా అపరాజిత్ 31 నాటౌట్, బాబా ఇంద్రజిత్ 31 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 13, చేతన్ ఆనంద్ 1/114). **అరుణాచల్ ప్రదేశ్ ఇన్నింగ్స్:** 71 ఆలౌట్ (28.4 ఓవర్లలో) (కామ్షా 17, సిద్ధార్థ్ 5/12, సిలాంబరాసన్ 2/7, మొహమ్మద్ 2/3).

114 అరుణాచల్‌తో మ్యాచ్‌లో జగదీశన్ 114 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. ఈ క్రమంలో లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన క్రికెటర్‌గా ట్రావిస్ హెడ్ (సౌత్ ఆస్ట్రేలియా; 114 బంతుల్లో క్వీన్స్‌లాండ్‌పై 2021లో) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును సమం చేశాడు.

114 జగదీశన్ దెబ్బకు అరుణాచల్ ప్రదేశ్ బౌలర్ చేతన్ ఆనంద్ కూడా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. ఈ మ్యాచ్‌లో చేతన్ 10 ఓవర్లు వేసి 114 పరుగులు సమర్పించుకున్నాడు. లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా చేతన్ నిలిచాడు. ఆస్ట్రేలియా బౌలర్ మిక్ లూయిస్ (2006లో దక్షిణాఫ్రికాపై 113 పరుగులు) పేరిట ఉన్న రికార్డును చేతన్ తెరమరుగు చేశాడు.

ఇంగ్లండ్ శుభారంభం

- 6-2తో ఇరాన్‌పై జయభేరి
- మెరిసిన బుకయో సాకా
- ఫుట్‌బాల్ ప్రపంచకప్


బుకయో సాకా

దోహా: ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ బోణీ అదిరింది. గ్రూప్ 'బి'లో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 6-2 గోల్స్ తేడాతో ఇరాన్‌పై ఘనవిజయం సాధించింది. గతేడాది 'యూరో కప్' ఫైనల్లో ఇటలీతో జరిగిన షూటౌట్‌లో నిరాశపరిచిన బుకయో సాకా, మార్కస్ రాష్‌ఫోర్డ్ తాజా మ్యాచ్‌లో 'హీరో'లయ్యారు. బుకయో (43వ, 62వ నిమిషంలో) రెండు గోల్స్ చేయగా, మార్కస్ (71వ ని.లో) ఒక గోల్ సాధించాడు. మిగతా మూడు గోల్స్‌ను జూడ్ బెలింగమ్ (35వ ని.లో), రహీమ్ స్టెర్లింగ్ (45+1వ ని.లో), జాక్ గ్రెలిష్ (90వ ని.లో) సాధించారు. మెహది టరెమి (65వ ని., 90+13వ ని. ఇంజూరి టైమ్) చేసిన రెండు గోల్స్‌తో ఇరాన్ పరువు నిలిచింది. ఇంగ్లండ్ స్ట్రయికర్లు ఆటగాళ్లు పాదరసంలా కదలడంతో ఇరాన్ డిఫెండర్లకు కష్టాలు తప్పలేదు. మ్యాచ్ మొత్తంమీద బంతిని తమ గుప్పిటే పెట్టుకోవడంలో ఇంగ్లండ్ స్ట్రయికర్లు సఫలమయ్యారు. ఇంగ్లండ్ తొలి అర్ధభాగంలోనే 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలి అర్ధభాగంలో ఇంగ్లండ్ ఆటగాళ్ల ఆధీనంలో బంతి 82 శాతం ఉండగా... ఆటగాళ్లు ఏకంగా 366 పాస్‌లను పూర్తి చేశారు. 1966 తర్వాత ఓ ప్రపంచకప్ తొలి అర్ధభాగంలో నమోదైన అత్యధిక పాస్‌లు ఇవే కావడం విశేషం.

ఇరాన్ గోల్‌కీపర్‌కు గాయం



మ్యాచ్ మొదలైన కాసేపటికే ఇరాన్ గోల్ కీపర్ అలి బెరన్‌వంద్ తీవ్రంగా గాయపడి మైదానం వీడాడు. సహచరుల తల అతని ముఖానికి బలంగా తాకడంతో ముక్కు, గదవ దగ్గర రక్తస్రావమైంది. వెంటనే అతన్ని చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు.

జాతీయ గీతం పాడకుండా నిరసన



మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్ల జాతీయ పతాకాలతో జాతీయ గీతాన్ని ఆలపించడం ఆనవాయితీ. ఇంగ్లండ్ ఆటగాళ్లు తమ జాతీయ గీతాలాపనలో భాగమయ్యారు. కానీ ఇరాన్ ఫుట్‌బాలర్లు మాత్రం బ్యాక్‌గ్రౌండ్‌లో తమ జాతీయ గీతం వినిపిస్తున్నప్పటికీ శ్రుతి కలపకుండా మౌనంగా నిరసన తెలిపారు. వారి దేశంలో హిజాబ్ కట్టుబాట్లపై ప్రభుత్వం నిర్దయగా వ్యవహరించడం వల్ల కొన్ని నెలలుగా ఇరాన్ అగ్నిగుండం అవుతోంది. ఈ నేపథ్యంలో స్వదేశంలో మహిళా నిరసనకారుల గళానికి ఇరాన్ ఆటగాళ్లు దోహాలో తమ మౌనాన్ని జత చేశారు.

ప్రపంచకప్‌లో నేడు

అర్జెంటీనా X సౌదీ అరేబియా
మధ్యాహ్నం గం. 3:30 నుంచి

డెన్మార్క్ X ట్యునీషియా
సాయంత్రం గం. 6:30 నుంచి

మెక్సికో X పోలాండ్
రాత్రి గం. 9:30 నుంచి

ఫ్రాన్స్ X ఆస్ట్రేలియా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

నెదర్లాండ్స్ గెలుపు

సెనెగల్ జట్టుతో సోమవారమే జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2-0తో గెలిచింది. ఆట 84వ నిమిషంలో కోడీ గాప్కో గోల్‌తో నెదర్లాండ్స్ ఖాతా తెరిచింది. ఇంజ్యూరీ టైమ్ (90+9వ ని.)లో డావీ క్లాసెన్ గోల్‌తో నెదర్లాండ్స్ విజయం ఖాయమైంది.

గెలిస్తే... సిరీస్ మన చేతికి



- నేడు భారత్, కివీస్‌ల మధ్య ఆఖరి పోరు
- మధ్యాహ్నం గం.12 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో, 'డీడీ స్పోర్ట్స్'లో ప్రసారం

నేపియర్: న్యూజిలాండ్ పర్యటనలో టి20 సిరీస్ గెలుపే లక్ష్యంగా టీమిండియా ఆఖరి పోరుకు సిద్ధమైంది. మంగళవారం ఇరుజట్ల మధ్య చివరిదైన మూడో టి20 జరుగుతుంది. ఇదివరకే రెండో మ్యాచ్ గెలిచిన భారత్ 1-0తో ఆధిక్యంలో ఉండగా.. ఇదే ఉత్సాహంతో ఈ మ్యాచ్ కూడా గెలిచి 2-0తో కైవసం చేసుకోవాలని ఆశిస్తోంది. మ్యాచ్ ఓడినా సిరీస్ పోయేదిలేదు కాబట్టి తుదిజట్టులో యువ పేసర్ ఉమ్రాన్ మాలిక్‌తో పాటు బ్యాటింగ్‌లో సంజూ సామ్సన్‌కు అవకాశమివ్వాలని టీమ్ మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. మరోవైపు సిరీస్‌లో వెనుకబడిన న్యూజిలాండ్ కీలకమైన మ్యాచ్‌లో రెగ్యులర్ కెప్టెన్ విలియమ్సన్ లేకుండా బరిలోకి దిగుతోంది. దాంతో సీనియర్ సీమర్ సౌతీ సారథ్యం వహిస్తాడు. నేపియర్ పిచ్ బ్యాటింగ్ పిచ్ కాగా... మ్యాచ్‌కు వానముప్పు పొంచి ఉంది.

సినిమా

విజయ్‌కి గెస్ట్


కమల్ హాసన్

విజయ్‌కి కమల్‌హాసన్ గెస్ట్ కానున్నారట. కోలీవుడ్‌లో ప్రచారంలో ఉన్న వార్త ఇది. 'మాస్టర్' వంటి హిట్ తర్వాత విజయ్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో మరో చిత్రం రూపొందనుంది. ఈ చిత్రంలోనే కమల్ గెస్ట్ రోల్‌లో కనిపించనున్నారని టాక్. కమల్ గత చిత్రం 'విక్రమ్'కి లోకేశ్ కనగరాజ్ దర్శకుడనే విషయం తెలిసిందే. ఈ సినిమా సూపర్ హిట్టయింది. మూడువందల కోట్లకు పైగా వసూలు చేసి, సంచలనం సాధించింది. ఒక సీనియర్ నటుడు నటించిన చిత్రం ఈ స్థాయి వసూళ్లు సాధించడం అంటే సంచలనమే కదా. అందుకే విజయ్ హీరోగా తాను రూపొందించనున్న తాజా చిత్రంలో గెస్ట్ రోల్ చేయమని లోకేశ్ కోరితే కమల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఈ విషయం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఆ సత్తా మా సినిమాకి ఉంది
- 'అల్లరి' నరేశ్

''ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' సినిమా అంతా సీరియస్‌గా ఉంటుందనుకుంటున్నారు. కానీ, ఇందులో 40 శాతం కామెడీ ఉంటుంది. అన్ని భాషల్లో ఆకట్టుకునే సత్తా ఉన్న సినిమా ఇది'' అని హీరో 'అల్లరి' నరేశ్ అన్నారు. ఏఆర్ మోహన్ దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, ఆనంది జంటగా నటించిన చిత్రం 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'. జీ స్టూడియోస్‌తో కలిసి హాస్య మూవీస్‌పై రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో శ్రీ విష్ణు ముఖ్య అతిథిగా, దర్శకులు ఇంద్రగంటి మోహనకృష్ణ, తిరుమల కిశోర్, వీఐ ఆనంద్, విజయ్ కనకమేడల, నిర్మాతలు సతీష్ వర్మ, అభిషేక్ అగర్వాల్ అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ- ''మోహన్ గారు చాలా ప్రతిభ ఉన్న దర్శకుడు. ఈ సినిమాతో తెలుగులో విజయం అందుకున్న తర్వాత ఆయన హిందీలోనూ ఈ మూవీని రీమేక్ చేయాలి. బేబీకి జన్మనిచ్చిన మూడో నెల నుంచే ఆనందిగారు ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనడం గ్రేట్. రాజేష్ దండాకి మినీ 'దిల్' రాజు అని పేరు పెట్టాం. మొదటి సినిమా విడుదల కాకముందే మరో రెండు సినిమాలు స్టార్ట్ చేసిన ఆయన 'దిల్' రాజుగారిలానే పెద్ద నిర్మాత కావాలి'' అన్నారు. ''నా 17 ఏళ్ల కలని నిజం చేసిన నరేశ్ గారికి థ్యాంక్స్'' అన్నారు ఏఆర్ మోహన్. ''మా చిత్రాన్ని కృష్ణగారికి అంకితం ఇస్తున్నాం'' అన్నారు రాజేష్ దండా. సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, మాటల రచయిత అబ్బూరి రవి, ఎడిటర్ ఛోటా కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రాజేష్ దండా, ప్రసాద్ నిమ్మకాయల, శ్రీ విష్ణు, 'అల్లరి' నరేశ్, ఆనంది, ఏఆర్ మోహన్

శంకరాభరణంకి అరుదైన గౌరవం
- 'ఇఫీ'లో ప్రత్యేక ప్రదర్శన



భారతీయ చిత్రాల్లో 'క్లాసిక్' అనిపించుకున్నవాటిలో తెలుగులో పలు చిత్రాలు ఉన్నాయి. వాటిలో 'శంకరాభరణం' ఒకటి. ఈ చిత్రం దేశవ్యాప్తంగా అభినందనలు అందుకున్న విషయం తెలిసిందే. జేవీ సోమయాజులు, మంజు భార్గవి, చంద్రమోహన్, రాజ్యలక్ష్మి, బాల నటి తులసి ముఖ్య తారలుగా కె. విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విడుదలై 42 ఏళ్లవుతోంది. పూర్ణోదయా మూవీ క్రియేషన్స్‌పై ఏడిద నాగేశ్వరరావు నిర్మించారు. ఇప్పటికే పలు చలన చిత్రోత్సవాల్లో 'శంకరాభరణం' ప్రదర్శితం కాగా, తాజాగా గోవాలో జరుగుతోన్న 53వ 'ఇఫీ' (భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు)లో ప్రదర్శితం కానుంది. అయితే ఇంతకుముందు కూడా ఈ చిత్రోత్సవాల్లో ఈ సినిమా ప్రదర్శితమైంది. తాజాగా 'రీస్టోర్డ్ ఇండియన్ క్లాసిక్' విభాగంలో ఎంపికై, అరుదైన గౌరవం దక్కించుకుంది. అంటే.. దేశంలోని క్లాసిక్ చిత్రాలను 'నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా' వారు డిజిటలైజ్ చేసి, భద్రపరుస్తుంటారు. 'ఇఫీ'లో ఈ విభాగానికి ఎంపికైన 'శంకరాభరణం'ని డిజిటలైజ్ చేసి, ప్రదర్శిస్తారు. ఈ నెల 27న ప్రదర్శితం కానుంది, దివంగత చిత్ర నిర్మాత ఏడిద నాగేశ్వరరావు తనయుడు ఏడిద రాజా ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ చిత్రోత్సవాలకు హాజరు కానున్నారు. ''నిజానికి మా సంస్థలో వచ్చిన 'శంకరాభరణం', 'సాగర సంగమం', 'స్వాతి ముత్యం'.. ఇలా అన్నీ క్లాసిక్ చిత్రాలే. అన్ని చిత్రాలూ పలు చిత్రోత్సవాల్లో స్క్రీనింగ్ అయ్యాయి. ఇప్పుడు 'రీస్టోర్డ్ ఇండియన్ క్లాసిక్' విభాగానికి 'శంకరాభరణం' ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మేం ఈ చిత్రాన్ని డిజిటలైజ్ చేసి, భద్రపరచాలనుకున్నాం. 'నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా'వారు చేస్తున్నారు. 'రీస్టోర్డ్ ఇండియన్ క్లాసిక్' విభాగంలో దేశవ్యాప్తంగా ఐదు చిత్రాలను ప్రదర్శిస్తారు. మన తెలుగు నుంచి 'శంకరాభరణం' ఎంపిక కావడం ఈ చిత్రానికి దక్కిన గౌరవం'' అన్నారు ఏడాది రాజా.

ఈ కథలోనే దీప్తి డైరెక్షన్ కనిపించింది
- నాని

''మీట్ క్యూట్' కథని నా సోదరి దీప్తి రాసిందని నేను నిర్మించలేదు. మరెవరు రాసినా ప్రొడ్యూస్ చేసేవాణ్ణి.. ఈ స్క్రిప్ట్ అంత అద్భుతంగా ఉంది. ఇందులోని పాత్రలు, మాటలు, వాళ్ల మధ్య వచ్చే సందర్భాలన్నీ సహజంగా ఉంటాయి'' అని హీరో నాని అన్నారు. అదా శర్మ, వర్ష బొల్లమ్మ, శ్రీదివ్య, సమీర్, అశ్విన్ కుమార్, సత్యరాజ్, రుహానీ శర్మ, రోహిణి మొల్లేటి, శివ కందుకూరి తదితరులు కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'మీట్ క్యూట్'. నాని సోదరి దీప్తి గంటా కథ రాసి, దర్శకత్వం వహించారు. నాని సమర్పణలో ప్రశాంతి త్రిపిర్నేని నిర్మించారు. ఐదు కథల ఆంథాలజీగా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 25 నుంచి సోని లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ- ''ఈ స్క్రిప్ట్‌ని చాలా రోజులు చదవకుండా పక్కన పెట్టాను. దీప్తి ఒత్తిడి చేసేసరికి చదవడం ప్రారంభించాను. కొన్ని పేజీలు చదివేసరికి కథలో లీనమయ్యాను. ఈ స్క్రిప్ట్‌లోనే దీప్తి డైరెక్షన్ కనిపించింది'' అన్నారు. దీప్తి మాట్లాడుతూ- ''నేను గతంలో ఒక షార్ట్ ఫిలిం చేశాను. 'మీట్ క్యూట్'లో ఒక కథ రాసి, నానీకి వినిపించాను. ఇలాంటివి ఇంకో మూడు నాలుగు రాస్తే ఆంథాలజీ చేయొచ్చని సలహా ఇచ్చాడు. జర్నీల్లో, ఇతర సందర్భాల్లో అపరిచిత వ్యక్తుల మధ్య మాటలు ఎలా ఉంటాయి? అనే ఊహతో ఈ స్క్రిప్ట్ రాశాను. ఓ మంచి లవ్ స్టోరీ రాస్తే ఆ కథను నాని హీరోగా తెరకెక్కిస్తా'' అన్నారు.


దీప్తి, నాని

మంచి సినిమాను బతికిద్దాం
- 'దిల్' రాజు


'దిల్' రాజు, రాహుల్

''ఏదైనా సినిమా బాగా లేకపోతే ఎవరూ ఏమీ చేయలేరు. కానీ, 'మసూద' చిత్రం చాలా బాగుంది.. ఇలాంటి మంచి సినిమాను బతికిద్దాం. ఈ సినిమాని థియేటర్లో చూస్తే వచ్చే అనుభూతే వేరు. అందరూ థియేటర్‌లోనే చూడండి'' అని 'దిల్' రాజు అన్నారు. సంగీత, తిరువీర్, కావ్య కల్యాణ్ రామ్, బాంధవి శ్రీధర్ ముఖ్య పాత్రల్లో సాయికిరణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మసూద'. రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలైంది. హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఎస్‌వీసీ బ్యానర్‌లో తెలుగు రాష్ట్రాల్లో 'మసూద'ని విడుదల చేసిన 'దిల్' రాజు మాట్లాడుతూ- ''రాహుల్‌కి సినిమా అంటే ఎంతో ప్యాషన్. 'మసూద' నిడివి కొంచెం తగ్గించాలని చెప్పినా, తను వినలేదు. కానీ అతని నమ్మకమే నిజమైంది.. ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు'' అన్నారు. ''ఇది జెన్యూన్ హారర్ డ్రామా. అందుకే సినిమా నిడివి గురించి ఆలోచించకుండా ముందుకెళ్లాం.. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు రాహుల్ యాదవ్. నటి సంగీత, దర్శకుడు వెంకటేష్ మహా, నటుడు ప్రియదర్శి, సంగీత దర్శకుడు ప్రశాంత్ ఆర్. విహారి, సినిమాటోగ్రాఫర్ నగేశ్ పాల్గొన్నారు.

ఆ డైలాగ్ బాగా నచ్చింది
- హరీష్ శంకర్

''రణస్థలి' ట్రైలర్ బాగుంది. 'చరిత్రలో జరిగే ప్రతి రక్తపాతం వెనక ఒక రాజ తంత్రం ఉంటుంది' అనే డైలాగ్ నాకు నచ్చింది. దర్శక, నిర్మాతలు పెద్ద చిత్రాలకు తగ్గకుండా భారీ ఫైట్స్ పెట్టి ఈ సినిమా తీయడం గ్రేట్'' అన్నారు దర్శకుడు హరీష్ శంకర్. సూరెడ్డి విష్ణు సమర్పణలో ధర్మ హీరోగా, హీరోయిన్లు చాందినీ రావు, అమ్ము అభిరామి నటించిన చిత్రం 'రణస్థలి'. పరశురాం శ్రీనివాస్ దర్శకత్వంలో అనుపమ సూరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హరీష్ శంకర్ విడుదల చేశారు. అన్నపూర్ణ స్టూడియో ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది.



హరీష్, పరశురాం

ఇది పాన్ వరల్డ్ చిత్రం
- ప్రశాంత్ వర్మ


తేజ సజ్జ, ప్రశాంత్ వర్మ, అమృత

''మన తెలుగు సినిమాలు 'ఆర్ఆర్ఆర్, కార్తికేయ 2' పాన్ వరల్డ్ వెళుతున్నాయి. మా 'హనుమాన్' కూడా పాన్ వరల్డ్ ఫిల్మ్. తమిళ, హిందీ, మలయాళం, కన్నడ ప్రేక్షకులు కూడా ఇది తమ సినిమా అని భావించేలా ఉంటుంది'' అని ప్రశాంత్ వర్మ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'హనుమాన్'. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ- ''నాకు చిన్నప్పటి నుండి ఇష్టమైన హనుమాన్ పేరుతో ఇంత పెద్ద సినిమా చేయడం హ్యాపీగా ఉంది. అనుకున్న బడ్జెట్ కంటే ఆరింతలు ఎక్కువ అయినా నిరంజన్ రెడ్డిగారు రాజీపడలేదు. పౌరాణిక పాత్ర అయిన హనుమాన్‌పై తొలిసారి పూర్తి స్థాయి సినిమా చేయడం హ్యాపీ'' అన్నారు. తేజ సజ్జా మాట్లాడుతూ- ''స్పైడర్ మాన్, సూపర్ మాన్ ఫిక్షనల్ హీరోలు. కానీ, హనుమాన్ మన చరిత్ర. అలాంటి గొప్ప దేవుడు హనుమంతుడి అనుగ్రహంతో ఒక కుర్రాడికి సూపర్ పవర్ వస్తే ఏం చేస్తాడు? అనేది ఈ సినిమా'' అన్నారు. ''హనుమాన్'తో త్వరలోనే థియేటర్‌లో కలుద్దాం'' అన్నారు అమృత.

సిద్ధాంతాలు లేకుంటే...

'సాధించకుండా చస్తే చావుకే అవమానం.. సిద్ధాంతాలు లేకుండా బతికితే బతుక్కే అవమానం అని మా నాన్నగారు ఎప్పుడూ చెబుతూ ఉంటారు' అనే డైలాగ్‌తో 'విజయానంద్' ట్రైలర్ విడుదలైంది. వీఆర్ఎల్ లాజిస్టిక్స్ కంపెనీ వ్యవస్థాపకుడు విజయ్ శంకేశ్వర్ బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'విజయానంద్'. నిహాల్ రాజ్‌పుత్ టైటిల్ రోల్‌లో రిషికా శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. అనంత నాగ్, సిరి ప్రహ్లాద్, వినయ ప్రసాద్, వి. రవి చంద్రన్ భరత్ బోపన ఇతర కీలక పాత్రల్లో నటించారు. వీఆర్ఎల్ ఫిలింస్ పతాకంపై విజయ్ శంకేశ్వర్ తనయుడు డా. ఆనంద్ శంకేశ్వర్ నిర్మించారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా మూవీగా డిసెంబర్ 9న ఈ సినిమా రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై విడుదల చేసి, సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు.


నిహాల్, ఆనంద్ శంకేశ్వర్, జాక్ మంజు, భరత్, రిషికా శర్మ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
519	148
61,059	18,160

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,021	▽	125
డోజోన్స్	33,686	▽	59
ఎఫ్‌టీఎస్ఈ 100	7,377	▽	10
డాక్స్	14,380	▽	52
షాంఘై	3,085	▽	12
నికాయ్	27,945	△	45

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	52,406
బంగారం (99.5 స్వచ్ఛత)	52,196
వెండి (కిలో)	60,442

జియో చేతికి రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్!

ఎన్‌సీఎల్‌టీ గ్రీన్‌సిగ్నల్

ముంబై: దివాలా చట్ట చర్యల్లో భాగంగా టవర్లు, ఫైబర్ సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ (ఆర్‌ఐటీఎల్) కొనుగోలుకి ముకేశ్ అంబానీ గ్రూప్ కంపెనీ జియోకు మార్గం సుగమమైంది. ఎన్‌సీఎల్‌టీ ఇందుకు అనుమతించింది. లావాదేవీ పూర్తికి ఎస్‌బీఐ ఎస్క్రో ఖాతాలో రూ. 3,720 కోట్లు డిపాజిట్ చేయవలసిందిగా జియోను ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. ఈ నెల




మొదట్లో జియో ఇందుకు ప్రతిపాదించింది. అనిల్ అంబానీ కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్)కు చెందిన ఇన్‌ఫ్రాటెల్‌ను సొంతం చేసుకునేందుకు 2019 నవంబర్‌లో జియో రూ. 3,720 కోట్ల కొనుగోలుకి బిడ్‌ను దాఖలు చేసింది. తద్వారా రుణ సంక్షోభంలో చిక్కుకున్న టవర్లు, ఫైబర్ సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ కొనుగోలుకి ముందుకు వచ్చింది. జియో ప్రతిపాదిత రుణ పరిష్కార ప్రణాళికకు 2020 మార్చిలోనే రుణదాతల కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ 1.78 లక్షల రూట్ కిలోమీటర్ల ఫైబర్ ఆస్తులతోపాటు దేశవ్యాప్తంగా 43,540 మొబైల్ టవర్లు కలిగి ఉంది. కాగా.. అంతర్గత రుణదాతల వివాదాలతో రుణ పరిష్కార ప్రణాళిక ఆలస్యంకావడంపై ఎన్‌సీఎల్‌టీకి జియో ఫిర్యాదు చేసింది. ఆలస్యం వల్ల రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ ఆస్తుల విలువ క్షీణిస్తుందని పేర్కొంది. అంతర్గత రుణ వివాదం పరిష్కారమైన వెంటనే రుణదాతలకు ఈ నిధులు పంపిణీ కానున్నట్లు తెలుస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-11-2022	
విశాఖ	525-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	524-00
విజయవాడ	524-00
రిటైల్ ధర (డజను)	78.00
21-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.70

'రస్నా' అరీజ్ కన్నుమూత

న్యూఢిల్లీ: దశాబ్దాలుగా రుచికరమైన చౌక డ్రింకుగా పేరొందిన 'రస్నా' వ్యవస్థాపక చైర్మన్ అరీజ్ పిరోజ్‌షా ఖంబట్టా (85) సోమవారం తుది శ్వాస విడిచారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అరీజ్ గుండెపోటుతో అహ్మదాబాద్‌లో కన్నుమూశారు. ఆయనకు భార్య పెర్సిస్, సంతానం పిరూజ్, డెల్నా, రుజాన్, కోడలు వినైషా ఉన్నారు. దశాబ్దాల క్రితమే తండ్రి ఫిరోజా ఖంబట్టా ప్రారంభించిన చిన్న వ్యాపారాన్ని అరీజ్ భారీ సంస్థగా తీర్చిదిద్దారు. ఆయన హయాంలో రస్నా 60 దేశాలలో విస్తరించడం ద్వారా ప్రపంచంలోనే అతి పెద్ద కాన్సెంట్రేట్ తయారీ కంపెనీగా ఆవిర్భవించింది. పరిశ్రమకు అందించిన విశిష్ట సేవలకుగాను అరీజ్ పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్రపతి హోమ్ గార్డ్, సివిల్ డిఫెన్స్ మెడల్, పశ్చిమి స్టార్, సమర్‌సేవా, సంగ్రామ్ మెడల్స్‌తో పాటు జాతీయ పౌర పురస్కారం మొదలైనవి వీటిలో ఉన్నాయి. ఆయన నెలకొల్పిన ట్రస్టులు, ఫౌండేషన్‌లు .. హెల్త్‌కేర్, విద్య తదితర రంగాల్లో పనిచేస్తున్నాయి.

1970లో..: చిన్న ప్యాకులలో అందించడం ద్వారా 1970లలో రస్నా సాఫ్ట్ డ్రింకుల మార్కెట్లో వేగంగా



ఎదిగింది. దాదాపు 18 లక్షల రిటైల్ ఔట్‌లెట్లలో అమ్ముడవుతోంది. 1980-90లలో రూపొందించిన 'ఐ లవ్యూ రస్నా' ప్రకటన ఎంతో మందిని ఆకట్టుకుంది. చౌకగా రూ.5 విలువ గల రస్నా ప్యాకెట్‌తో 32 గ్లాసుల సాఫ్ట్ డ్రింకును తయారు చేసేందుకు వీలు కల్పించడం ద్వారా మార్కెట్లో భారీగా విస్తరించింది. రస్నాకు 9 తయారీ ప్లాంట్లు, 5,000 పైచిలుకు స్టాకిస్టులు ఉన్నారు. రుచిపరంగా రస్నాకు పలు అంతర్జాతీయ అవార్డులు సైతం లభించాయి. కొన్నేళ్ల క్రితమే అరీజ్.. కుమారుడు పిరుజ్ ఖంబట్టాకు రస్నా పగ్గాలు అప్పగించారు. ప్రస్తుతం పిరూజ్ గ్రూప్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

16 నెలల్లో ఏపీలో అరబిందో ప్లాంటు

హైదరాబాద్: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న బెంజైల్‌పెన్సిలిన్ తయారీ ప్లాంటు 2024 మార్చి నాటికి సిద్ధం కానుంది. ఈ ప్రాజెక్టుకు కంపెనీ రూ.2,000 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే రూ.500 కోట్లు ఖర్చు అయింది. 15,000 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఇది రానుంది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం కింద ఈ ప్లాంటుకు ఆమోదం లభించింది. పైలట్ ప్రాతి



పదికన తయారీ 2023 అక్టోబర్ నుంచి మొదలవుతుందని అరబిందో ఫార్మా సీఎఫ్‌వో ఎస్. సుబ్రమణియన్ తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో యూఎస్‌ఏలో 20కిపైగా ఉత్పత్తులను విడుదల చేసే అవకాశం ఉందని అరబిందో అనుబంధ కంపెనీ యూగియా ఫార్మా స్పెషాలిటీస్ సీఈవో యుగంధర్ పువ్వాల తెలిపారు. తక్కువ పోటీ ఉన్న ఉత్పత్తులకు ఆమోదం లభించే చాన్స్ ఉందన్నారు.

ప్రపంచ ప్రతికూలతలు పడేశాయ్

- ఫెడ్ కఠిన ద్రవ్య విధాన వైఖరి
- చైనాలో తాజాగా లాక్‌డౌన్ విధింపు
- సూచీలకు మూడోరోజూ నష్టాలే
- నిఫ్టీ నష్టం 148 పాయింట్లు
- సెన్సెక్స్ 519 పాయింట్ల పతనం

ముంబై: అమెరికా ఫెడ్ రిజర్వ్ కఠినతర ద్రవ్య విధాన వైఖరి మరింతకాలం కొనసాగవచ్చనే ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడోరోజూ నష్టాలను చవిచూసింది. చైనాలో మళ్లీ కోవిడ్ కేసులు పెరగడంతో తాజాగా విధించిన లాక్‌డౌన్ ఆంక్షలు మరింత ఒత్తిడిని పెంచింది. వచ్చే ఏడాదికి సంబంధించి భారత వృద్ధిరేటు అంచనాలను గోల్డ్‌మెన్ శాక్స్ గ్రూప్ తగ్గించడం మార్కెట్ వర్గాలను నిరాశపరిచింది. ఈ ప్రతికూలతల నేపథ్యంలో అధిక వెయిటేజీ రిలయన్స్(-2%) పాటు ఫైనాన్స్, ఆటో, ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 519 పాయింట్లు క్షీణించి 61,059 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148 పాయింట్లు దిగివచ్చి 18,160 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా మూడోరోజూ నష్టాల ముగింపు. ప్రభుత్వరంగ బ్యాంక్స్, మీడియా షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1594 కోట్ల షేర్లను అమ్మేశారు. సం



స్థాగత ఇన్వెస్టర్లు రూ.1263 కోట్ల షేర్లను కొన్నారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. డాలర్ మారకంలో రూపాయి 11 పైసలు క్షీణించి 81.84 స్థాయి వద్ద స్థిరపడింది.

▪ ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.474)తో పోలిస్తే 5% డిస్కౌంట్‌తో రూ.450 వద్ద లిస్టయ్యింది. తర్వాత 14% ఎగసి రూ.540 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి మూడుశాతం లాభంతో రూ.490 వద్ద స్థిరపడింది.

▪ ప్రత్యేక రసాయనాలు తయారీ సంస్థ ఆర్కియన్ కెమికల్ ఇండస్ట్రీస్ బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.407)తో పోలిస్తే పదిశాతం ప్రీమియంతో రూ.449 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 17% ఎగసి రూ.476 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి రూ.13 శాతం లాభంతో రూ.458 వద్ద స్థిరపడింది.

ఉపాధి కల్పనే ధ్యేయంగా బడ్జెట్..

- ఆర్థిక మంత్రి సీతారామన్‌కు పారిశ్రామిక వర్గాల వినతి
- పన్నుల హేతుబద్ధీకరణకు విజ్ఞప్తి
- ప్రీ-బడ్జెట్ భేటీలో పలు సూచనలు

న్యూఢిల్లీ: వినియోగాన్ని పెంచడానికి ఉపాధి కల్పనే ధ్యేయంగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2023-24) బడ్జెట్‌ను రూపొందించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పారిశ్రామిక రంగం విజ్ఞప్తి చేసింది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ), వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబ్‌లను హేతుబద్ధీకరించాలని, తద్వారా పన్ను బేస్‌ను విస్తృతం చేసే చర్యలపై బడ్జెట్ దృష్టి పెట్టాలని ఆర్థిక మంత్రితో సోమవారం జరిగిన వర్చువల్ ప్రీ-బడ్జెట్ సమావేశంలో కోరాయి. ఈ సమావేశంలో తమ ప్రతినిధులు చేసిన సూచనలపై పారిశ్రామిక వేదికలు చేసిన ప్రకటనల ముఖ్యాంశాలు..

ప్రైవేటీకరణకు ప్రాధాన్యం: సీఐఐ

'అంతర్జాతీయ పరిణామాలు కొంతకాలం పాటు అననుకూలంగా కొనసాగే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో దేశీయ డిమాండ్, అన్ని రంగాల పురోగతి, వృద్ధి పెంపునకు చర్యలు అవసరం. ఉపాధి



కల్పనను ప్రోత్సహించడం ద్వారా మన దేశీయ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసుకోవాలి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ దూకుడుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి మధ్య భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడి తప్పకుండా చూడ్డానికి పెట్టుబడులకు దారితీసే వృద్ధి వ్యూహంపై దృష్టి పెట్టాలి. మూలధన వ్యయాల కేటాయింపుల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఉపాధి కల్పనను పెంచేందుకు ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టాలి. ముఖ్యంగా పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. వ్యాపారాలకు సంబంధించి పన్ను ఖచ్చితత్వం అవసరం. ఇందుకుగాను కార్పొరేట్ పన్ను రేట్లను ప్రస్తుత స్థాయిలో కొనసాగించాలి. పన్నుల విషయంలో మరింత సరళీకరణ, హేతుబద్ధీకరణ, చెల్లింపులో సౌలభ్యత, వ్యాజ్యాల తగ్గింపు ప్రధాన ప్రాధాన్యతలుగా ఉండాలి' అని సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ బజాజ్ పేర్కొన్నారు.

పంచముఖ వ్యూహం: పీహెచ్‌డీసీసీఐ

'కేంద్ర బడ్జెట్ (2023-24) భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, అధిక ద్రవ్యోల్బణం, ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగమనం వంటి కీలకమైన తరుణంలో రూపొందుతోంది. ఈ తరుణంలో స్థిరమైన ఆర్థిక వృద్ధి పథాన్ని కొనసాగించడానికి, దేశీయ వృద్ధి వనరులను పెంపొందించడానికి కీలక చర్యలు అవసరం. ముఖ్యంగా ప్రైవేట్ పెట్టుబడులను పునరుద్ధరించడానికి పంచముఖ వ్యూహాన్ని అవలంబించాలి. వినియోగాన్ని పెంచడం, కర్మాగారాల్లో సామర్థ్య వినియోగాన్ని పెంచడం, ఉద్యోగాల అవకాశాల కల్పన, సామాజిక మౌలిక సదుపాయాల నాణ్యతను మెరుగుపరచడం, భారతదేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం వంటి చర్యలు ఇందులో కీలకమైనవి' అని పీహెచ్‌డీసీసీఐ ప్రెసిడెంట్ సాకేత్ దాల్మియా సూచించారు.

శుక్రవారం రాష్ట్రాల ఆర్థికమంత్రులతో భేటీ

కాగా, ఆర్థికమంత్రి సీతారామన్ వచ్చే శుక్రవారం (25వ తేదీ) రాష్ట్రాల ఆర్థికమంత్రులతో న్యూఢిల్లీలో ప్రీ-బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు.

ఎగ్ బోర్డ్ ఏర్పాటు చేయండి

- అప్పుడే రైతుకు మద్దతు ధర
- టీఎస్ పౌల్ట్రీ ఫెడరేషన్ డిమాండ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పౌల్ట్రీ రంగం నష్టాల ఊబి నుంచి గట్టెక్కాలంటే దేశ స్థాయిలో ఎగ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టేట్ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్ రావు డిమాండ్ చేశారు. అప్పుడే రైతుకు మద్దతు ధర లభిస్తుందని, పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందని చెప్పారు. 'ఉత్పత్తి వ్యయాలకు తగ్గట్టుగా మాత్రమే గుడ్డు ధర నిర్ణయించాలి. మార్కెట్లో ధర విషయంలో పూర్తిగా బోర్డుదే తుది నిర్ణయం కావాలి. తద్వారా రైతులకు, వినియోగదార్లకు ప్రయోజనం ఉంటుంది. బోర్డుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి. ప్రభుత్వమే గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. లేదా ప్రైవేటు గిడ్డంగులను లీజుకు తీసుకోవాలి. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరాను కట్టడి చేయాలి. బోర్డు కార్యరూపంలోకి వస్తే కొత్తగా లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుంది. పౌల్ట్రీకి పూర్తిగా వ్యవసాయ రంగ హోదా ఇచ్చి ప్రయోజనాలు కల్పించాలి' అని వివ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్ రావు

రించారు. రైతులు ఒక్కో గుడ్డు ఉత్పత్తిపై సగటున 50-60 పైసలు, బ్రాయిలర్‌పై రూ.10-20 నష్టపోతున్నారని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కాసర్ల మోహన్ రెడ్డి తెలిపారు.

నేటి నుంచి పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో..

పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 22-25 తేదీల్లో ఇక్కడి హైటెక్స్‌లో జరుగనుంది. తొలిరోజు నాలెడ్జ్ డే టెక్నికల్ సెమినార్ నిర్వహిస్తారు. 370 కంపెనీలు స్టాళ్లను ఏర్పాటు చేశాయని ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రధర్ రావు పొట్లూరి తెలిపారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సెయిల్, భిలాయ్‌లో 259 పోస్టులు

భిలాయ్‌లోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం పోస్టుల సంఖ్య:** 259

- **పోస్టుల వివరాలు:** సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్,మేనేజర్,డిప్యూటీ మేనేజర్, మెడికల్ ఆఫీసర్, మైనింగ్ మేట్,ఓసీటీ ట్రెయినీ తదితరాలు.
- **విభాగాలు:** హైడ్రాలిక్స్ మెయింటనెన్స్, జనరల్ మెడిసిన్, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఎలక్ట్రికల్, కెమికల్, మెకానికల్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో మెట్రిక్యులేషన్/డిప్లొమా/ఐటీఐ/బీఈ/బీటెక్/ఎంబీబీఎస్/డీఎం/డీఎన్‌బీ/ఎంసీహెచ్/పీజీ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** పోస్టును అనుసరించి 28 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.25,070 నుంచి రూ.2.4 లక్షలు చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్/ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తు ప్రారంభతేది:** 26.11.2022 నుంచి
- **దరఖాస్తులకు చివరితేది:** 17.12.2022
- **వెబ్‌సైట్:** www.sailcareers.com

పది, ఇంటర్‌తోనే.. డీఆర్‌డీవో కొలువు

జాబ్స్ జంక్షన్

» నెలకు రూ.40వేలకు పైగా వేతనం
» 1061 ఉద్యోగాలకు ప్రకటన విడుదల

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో).. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. భారత రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన ఈ సంస్థ.. సెంటర్ ఫర్ పర్సనల్ టాలెంట్ మేనేజ్‌మెంట్(సెప్టెమ్-10/ఎఅండ్ఎ) అడ్మిన్ అండ్ అలైడ్ కేడర్ ప్రకటనను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీవో పరిశోధన కేంద్రాల్లో.. 1061 స్టెనోగ్రాఫర్, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

విభాగాల వారీగా పోస్టులు

జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్ (జేటీవో)-33, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1(ఇంగ్లిష్ టైపింగ్)-215, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-2(ఇంగ్లిష్ టైపింగ్)-123, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఎ(ఇంగ్లిష్ టైపింగ్)-250, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఎ(హిందీ టైపింగ్)-12, స్టోర్ అసిస్టెంట్ ఎ(ఇంగ్లిష్ టైపింగ్)-134, స్టోర్ అసిస్టెంట్ ఎ(హిందీ టైపింగ్)-04, సెక్యూరిటీ అసిస్టెంట్ 'ఎ'-41, వెహికిల్ ఆపరేటర్ ఎ-145, ఫైర్ ఇంజిన్ డ్రైవర్ ఎ-18, ఫైర్‌మ్యాన్ విభాగంలో 86 పోస్టులు ఉన్నాయి. **అర్హతలు:** పోస్టులను అనుసరించి పదోతరగతి,ఇంటర్, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత ఉండాలి. టైపింగ్ పరిజ్ఞానం, డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలి. **వయసు:** 18-27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. జేటీవో, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1 పోస్టులకు 30 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక ఇలా: పోస్టులను అనుసరించి ఎంపిక ప్రక్రియ వేర్వేరుగా ఉంటుంది. ఇందులో టైర్-1 (సీబీటీ), టైర్-2(నైపుణ్య, శారీరక దారుఢ్య, సామర్థ్య పరీక్షలు) తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష

ఈ పరీక్ష టైర్-1, టైర్-2లుగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకునే పోస్టులను అనుసరించి పరీక్ష వేర్వేరుగా ఉంటుంది.

టైర్-1

జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: ఈ పోస్టులకు సంబంధించి 80 ప్రశ్నలు-80 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో జనరల్ హిందీ నుంచి 40 ప్రశ్నలు-40 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ నుంచి 40 ప్రశ్నలు-40 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు.

ఇతర పోస్టులకు

జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్ మినహా ఇతర అన్ని పోస్టులకు సంబంధించి టైర్-1 పరీక్ష ఒకే విధంగా ఉంటుంది. ఈ పోస్టులకు సంబంధించి 75 ప్రశ్నలు-75 మార్కులకు పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్ విభాగాల నుంచి ప్రశ్నలను అడుగుతారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. **టైర్-2:** జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్ మినహా మిగత అన్ని పోస్టులకు నైపుణ్య, శారీరక దారుఢ్య, సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్లకు టైర్-2 కింద డిస్క్రిప్టివ్ టెస్టును ఉంటుంది.

టైర్-2 డిస్క్రిప్టివ్ టెస్ట్: ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 120 నిమిషాలు. ట్రాన్స్‌లేషన్ అండ్ ఎస్సే రూపంలో ప్రశ్నలను అడుగుతారు. డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్షను రాయాల్సి ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరిత తేదీ:** 07.12.2022
- **వెబ్‌సైట్:** https://www.drdo.gov.in

వెండి తెర.. కెరీర్ వెలుగు

సినిమా ప్రపంచం అందించే.. వినోదాన్ని ప్రతిఒక్కరూ ఆస్వాదిస్తారు. క్లాసికల్ మూవీస్ మొదలు యాక్షన్ సినిమాల వరకు.. ఎంతో ఎంజాయ్ చేస్తారు. కాలం మారినా.. చలన చిత్రాల పట్ల క్రేజ్ ఏమాత్రం తగ్గడంలేదు. మంచి కథ, కథనం ఉంటే లోబడ్జెట్ సినిమాలు సైతం కోట్లు కురిపిస్తున్నాయి. దీంతో ఈ రంగం మరింతగా విస్తరిస్తూ.. యువతకు చక్కటి అవకాశాలకు దోహదం చేస్తోంది! సృజనాత్మకత, కళాత్మక దృష్టితో ఆలోచించే వారికి క్రియేటివ్ అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి!! ఈ నేపథ్యంలో.. సినీ రంగంలో అవకాశాలు, అవసరమయ్యే నైపుణ్యాలు, అకడమిక్ అర్హతలు, అందుకునేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

» సినీ ప్రపంచంలో విభిన్న కొలువులు
» నటన నుంచి డైరక్షన్ వరకు అవకాశాలు
» సృజనాత్మకత ఉన్న వారికి చక్కటి వేదిక

కెరీర్ వినూత్నంగా ఉండాలి, నలుగురిలో ప్రత్యేక గుర్తింపు పొందాలి అనుకునే వారికి చలన చిత్ర రంగం ఒక ప్రధాన వేదికగా నిలుస్తోంది. ప్రతిభ, సృజనాత్మకత ఉంటే.. సినిమా రంగంలో అవకాశాలకు కొదవలేదు. ఎందుకంటే.. సినిమా ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ప్రధాన వినోద సాధనంగా మారింది. సిల్వర్ స్క్రీన్‌పై చూసే సినిమాలైనా.. ఓటీటీలో వస్తున్న చిత్రాలైనా.. వెబ్ సిరీస్‌లు.. ఏవైనా సరే... వినోదానికి మారుపేరుగా మారుతున్నాయి. దీంతో ఈ రంగం విస్తరిస్తూ.. విస్తృత అవకాశాలకు వేదికగా మారుతోంది.

అన్ని విభాగాల్లో

సినిమా అనగానే గుర్తొచ్చేది.. నటీ నటులు, హీరో, హీరోయిన్‌లు. కాని ఇటీవల కాలంలో డైరెక్టర్ ఎవరు.. మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు.. స్క్రీన్ ప్లే రైటర్ ఎవరు.. అని ప్రేక్షకులు ఆలోచించడం మొదలు పెట్టారు. వీటి ఆధారంగా సినిమా ఏ స్థాయిలో ఆడుతుందో అంచనా వేస్తున్నారు. దీంతో.. సినిమా నిర్మాణ సంస్థలు.. వెండి తెరపై కనిపించే నటీనటుల విషయంలోనే కాకుండా.. టెక్నికల్‌గా అన్ని హంగులు దిద్దుతూ ప్రేక్షకుల ఆదరణ పొందేందుకు యత్నిస్తున్నాయి.

ఆ నాలుగు ప్రధానంగా

సినీ రంగంలో విస్తృత కెరీర్ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ.. నేటికీ ప్రధానంగా నాలుగు విభాగాలు ముందంజలో ఉంటున్నాయి. అవి..యాక్టింగ్,డైరెక్షన్, ఎడిటింగ్, మ్యూజిక్. కారణం.. ఈ నాలుగు విభాగాలు సినిమా విజయానికి దోహదం చేస్తున్నాయనే అభిప్రాయమే. వీటిలో రాణిస్తే.. పాన్ ఇండియా స్థాయిలో పేరు సంపాదించుకోవడం సులభమనే భావన నెలకొంది.

యాక్టింగ్

సినీ రంగంలో కెరీర్ పరంగా ఎక్కువ మంది ఆసక్తి చూపే విభాగం..యాక్టింగ్. ఎందుకంటే.. వెండితెరపై కనిపిస్తూ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయే అవకాశం ఉండడమే. ఇలాంటి వారికి యాక్టింగ్‌లో నైపుణ్యాలు అందించేందుకు ఇప్పుడు ఎన్నో కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌లు అందుబాటులోకి వస్తున్నాయి.

టాలెంట్ ముఖ్యం

నటుడిగా రాణించేందుకు.. శిక్షణతోపాటు వ్యక్తిగత ప్రతిభ కూడా ముఖ్యమే. శిక్షణ కోర్సులు నటనకు సంబంధించిన మెళకువలు నేర్పుతాయి. కానీ..ఒక వ్యక్తి నటుడిగా రాణించాలంటే.. స్వతహాగా టాలెంట్ ఉండాలి. సన్నివేశానికి తగినట్లుగా హావభావాలు పండించే ప్రతిభ, నైపుణ్యం అవసరం. నటుడిగా కెరీర్ ప్రారంభించి.. మంచి పేరు సంపాదించుకుంటే.. సినిమా రంగమే కాకుండా, టెలివిజన్, ఓటీటీ సిరీస్‌లలోనూ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.నటుడిగా ఫేమ్ అయితే లక్షల్లో పారితోషికం అందుతుంది.టెలివిజన్ ఇండస్ట్రీలో ఎపిసోడ్‌ల ప్రాతిపదికగా ఒక్కో ఎపిసోడ్‌కు రూ.పది వేల నుంచి రూ.30 వేల వరకు రెమ్యునరేషన్ ఇస్తున్నారు.

డైరెక్షన్

సినిమాకు కెప్టెన్ లాంటి వ్యక్తి.. దర్శకుడు. డైరెక్షన్ విభాగానికి సంబంధించి అసోసియేట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, కో-డైరెక్టర్ వంటి కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. ఈ విభాగంలో నైపుణ్యం సాధించాలంటే.. వాస్తవిక దృక్పథం, శ్రమ, సహనం అవసరం. కారణం.. కథ, నటీనటుల ఎంపిక, మ్యూజిక్, షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్ట్, పబ్లిసిటీ.. ఇలా అన్నీ విభాగాలను సమర్థవంతంగా సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. డైరెక్టర్‌గా క్లిక్ అయితే.. పేరు, డబ్బు, హోదా.. ఇలా అన్నీ ఒకదాని వెంట ఒకటి వచ్చి చేరుతాయి. అందుకే.. ఇప్పుడు యువత ఈ విభాగం వైపు దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా ఇటీవల కాలంలో షార్ట్ ఫిల్మ్స్, ఓటీటీ సంస్కృతి పెరిగిన నేపథ్యంలో ముందుగా దర్శకత్వ విభాగంలో తమ సత్తా చూపేందుకు సిద్ధమవుతున్నారు. డైరెక్టింగ్ విభాగంలో.. సినిమా దర్శకత్వంతోపాటు పలు ఉపాధి వేదికలు అందుబాటులో ఉన్నాయి. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు, టీవీ సీరియళ్లు, డాక్యుమెంటరీ ఫిల్మ్స్.. వీటిలో ముందు వరుసలో ఉంటున్నాయి. దర్శకత్వ నైపుణ్యాలు అందించే కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, మాస్టర్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, పీజీ డిప్లొమా ఇన్ డైరెక్షన్ అండ్ స్క్రీన్ రైటింగ్. వీటిని పలు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లు అందిస్తున్నాయి.

ఎడిటింగ్

సినీ రంగంలో మరో ప్రధానమైన విభాగం.. ఎడిటింగ్. వాస్తవ రన్ టైమ్ నాలుగైదు గంటలు ఉండే సినిమాని రెండున్నర, మూడు గంటలకు కుదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఆయా



సన్నివేశాల మధ్య అనుసంధానం కోల్పోకుండా.. సీక్వెన్స్ దెబ్బతినకుండా చూస్తూ.. ప్రేక్షకులు మెచ్చేలా సన్నివేశాలని కూర్పు చేయడం సవాలుతో కూడుకున్న పని. ఈ పనిని సమర్థంగా చేయగలిగే వారే ఎడిటర్స్. ఎడిటింగ్ విభాగంలో రాణించాలంటే.. సృజనాత్మకత, ఓర్పు, సహనం ప్రధానం. ఎందుకంటే.. నిర్మాత, దర్శకుడి ఆలోచన సరళిని తెలుసుకుంటూ..అందుకు అనుగుణంగా సన్నివేశాలను కూర్పు చేయాల్సి ఉంటుంది. వీరికి టెక్నికల్ నైపుణ్యాలు కూడా అవసరమవుతున్నాయి. ఎడిటింగ్‌లో పలు సంస్థలు డిప్లొమా నుంచి బ్యాచిలర్ స్థాయి వరకు పలు కోర్సులను అందిస్తున్నాయి.

ఎడిటింగ్ కోర్సులు: డిప్లొమా ఇన్ ఫిల్మ్ ఎడిటింగ్, డిప్లొమా ఇన్ వీడియో ఎడిటింగ్, డిప్లొమా ఇన్ వీడియో ఎడిటింగ్ అండ్ సౌండ్ రికార్డింగ్, పీజీ డిప్లొమా ఇన్ ఎడిటింగ్.

ఉపాధి వేదికలు: ఎడిటింగ్ కోర్సు పూర్తిచేసిన వాళ్లు సినీ, టీవీ, వార్తా ఛానళ్లు, ప్రకటన సంస్థలు, మల్టీ మీడియా సంస్థలు, వెబ్ డిజైనింగ్ కంపెనీలు, నెట్ పోర్టల్స్ వంటి చోట్ల ఉద్యోగాలు పొందొచ్చు. అదే విధంగా ఫ్రీలాన్స్ ఎడిటర్‌గా స్వయం ఉపాధికీ అవకాశాలున్నాయి. డిజిటల్ వీడియోలు, యూట్యూబ్ ఛానెళ్లకు సైతం పని చేయొచ్చు.

ఫొటోగ్రఫీ

సినీ పరిభాషలో సినిమాటోగ్రఫీగా పేర్కొనే విభాగం ఇది. ఇందులోనూ ప్రస్తుతం విస్తృత కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. ఒక సన్నివేశాన్ని హృద్యంగా చిత్రీకరించే బాధ్యత ఫొటోగ్రాఫర్‌దే. ఇటీవల కాలంలో సినీ రంగం శరవేగంగా విస్తరిస్తుండడం, వందలకొద్దీ సినిమాలు తెరకెక్కుతున్న నేపథ్యంలో నిపుణులైన వారికి డిమాండ్ పెరుగుతోంది. ఫొటోగ్రఫీకి సంబంధించి టెక్నికల్ నైపుణ్యాలు కూడా సొంతం చేసుకుంటే.. అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్, అసోసియేట్ సినిమాటోగ్రాఫర్, సినిమాటోగ్రాఫర్ స్థాయికి చేరుకోవచ్చు.

మ్యూజిక్.. కెరీర్ క్లిక్

ఒక సినిమా హిట్, ఫ్లాప్‌లో కీలక ప్రాత పోషించే విభాగం.. మ్యూజిక్. సినిమా విడుదల కంటే ముందే రిలీజయ్యే సంగీతం, పాటలు.. సినిమాకు ఆదరణను, చూడాలనే ఆసక్తిని పెంచుతాయి. కేవలం మ్యూజిక్‌తోనే హిట్ అయిన సినిమాలు కూడా ఎన్నో ఉన్నాయి. అందుకే డైరెక్టర్లు సైతం మ్యూజిక్ విషయంలో రాజీపడకుండా వ్యవహరిస్తారు. అందుకే ఈ విభాగంలో నైపుణ్యం సొంతం చేసుకున్న వారికి కెరీర్ గ్యారెంటీ అని చెప్పొచ్చు. ఇందులో రాణించాలంటే.. సంగీతంపై సహజమైన ఆసక్తి ఉండాల్సిందే. దీనికంటే ముందుగా ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్స్ గ్రూప్‌లో సభ్యులుగా చేరి.. తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ఈ విభాగంలో మ్యూజిక్ డైరెక్టర్స్ స్థాయికి చేరుకోవచ్చు. మ్యూజిక్ విభాగంలో బ్యాచిలర్ స్థాయిలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి..బీఏ మ్యూజిక్;బీఎఫ్ఏ తబలా,మ్యూజిక్;బీఏ తబలా; ఎంఏ మ్యూజిక్; ఎంఫిల్ ఇన్ మ్యూజిక్; పీహెచ్‌డీ ఇన్ మ్యూజిక్ వంటివి ముఖ్యమైనవి. వీటితోపాటు ఆంధ్రా యూనివర్సిటీ, నాగార్జున, కాకతీయ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలు.. బీఏ మ్యూజిక్ కోర్సును అందిస్తున్నాయి. పలు ప్రైవేట్ సంస్థలు కూడా శిక్షణ ఇస్తున్నాయి.

స్క్రీన్ ప్లే

సినిమా చూసే రెండున్నర మూడు గంటల సమయంలో ప్రేక్షకుడు కళ్లప్పగించి చూడాలి. ఎక్కడా కూడా బోర్ ఫీలవకూడదు. ఒక సినిమాకు సంబంధించి ఆయా సన్నివేశాల పట్టు సడలకుండా.. ప్రతి సీన్‌ను ఉత్కంఠ కలిగించేలా.. కథలో బిగి తగ్గకుండా..అందంగా, ఆహ్లాదంగా, ఆకర్షణీయంగా ఉండేలా చేసేది స్క్రీన్‌ప్లే. ప్రస్తుతం స్క్రీన్ ప్లే రచయితలకు పలు కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. దీనికి సంబంధించి నైపుణ్యాలు పొందేందుకు అకడమిక్ కోర్సులు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. స్క్రీన్ ప్లే రైటింగ్, రైటింగ్ అండ్ స్క్రీన్ ప్లే స్పెషలైజేషన్లతో డిప్లొమా,బ్యాచిలర్ డిగ్రీ,పీజీ, పీజీ డిప్లొమా వరకు పలు కోర్సులు అభ్యసించే వీలుంది.

ఇన్‌స్టిట్యూట్‌లు ఇవే

- సత్యజిత్‌రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్.
- ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా. ▪ ముంబై డిజిటల్ ఫిల్మ్ అకాడమీ.
- ఏషియన్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్.
- యూనివర్సిటీల విషయంలో ఆంధ్రా యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలు కూడా ఇంటర్ అర్హతగా డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులు అందిస్తున్నాయి. స్థానికంగా పలు ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు సైతం ఆయా విభాగాల్లో శిక్షణ కోర్సులను నిర్వహిస్తున్నాయి.

చలన చిత్ర రంగం.. కెరీర్ ముఖ్యాంశాలు

- సినీ రంగంలో పెరుగుతున్న అవకాశాలు
- యాక్టింగ్ నుంచి స్క్రీన్ ప్లే వరకు పలు కోర్సులు
- సినీ రంగంతోపాటు ఓటీటీ,డిజిటల్ డాక్యుంటరీ హౌస్‌లు, యూ ట్యూబ్ ఛానెల్స్ సంస్థల్లో అవకాశాలు ▪ప్రఖ్యాత ఫిల్మ్ ప్రొడక్షన్ హౌస్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్.

క్లుప్తంగా

'ఆడిట్'లో ఏయూకు 7 గోల్డెన్ స్టార్ రేటింగ్



వీసీ ప్రసాదరెడ్డికి సర్టిఫికెట్ అందిస్తున్న ఆచార్య లలితభాస్కరి

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎన్విరాన్‌మెంట్ ఆడిట్‌లో సెవెన్ గోల్డెన్ స్టార్ రేటింగ్ లభించింది. ఇటీవల ఏయూలో ఆడిట్ చేసిన సంస్థ సంబంధిత సర్టిఫికెట్‌ను అందజేసింది. వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డికి ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య డి.లలితభాస్కరి సర్టిఫికెట్‌ను అందించారు. ఆడిట్‌లో అత్యంత ప్రమాణాలు నిలిపే సంస్థకు సెవెన్ గోల్డెన్ స్టార్ రేటింగ్ ఇస్తారు. తొలి ప్రయత్నంలోనే ఏయూ దీనిని పొందడం విశేషం. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పు మంత్రిత్వ శాఖ సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఏయూలో నీరు, వ్యర్థ జలాల నిర్వహణ, ఇంధన వనరులు, పునరుత్పాదక ఇంధన వనరులు, గాలి నాణ్యత, వ్యర్థాల నిర్వహణ జరుగుతున్నట్లు ఆడిట్ కమిటీ సభ్యులు పరిశీలించి, పరిగణలోనికి తీసుకుని ఈ గుర్తింపును అందజేశారు.

'బొర్రా'లో నిలిచిపోయిన జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్



అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని బొర్రా రైల్వేస్టేషన్‌లో జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బొర్రా, చిమిడిపల్లి రైల్వేస్టేషన్ మధ్యలోని ఓహెచ్‌సీ విద్యుత్ తీగలు తెగిపోవడంతో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో జగదల్‌పూర్ నుంచి విశాఖకు ప్రయాణికులతో వెళుతోన్న జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను బొర్రా రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. రైల్వేసిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.అనంతరం రైలు విశాఖకు బయలుదేరి వెళ్లింది.

'స్వదేశ్ దర్శన్' పేరిట ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): విశాఖ నుంచి దక్షిణ భారత్‌లోని పలు దేవాలయాలను సందర్శించుకోవాలనే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు ప్యాకేజీ ప్రకటించింది. యాత్ర వివరాలను ఐఆర్‌సీటీసీ సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ సోమవారం వెల్లడించారు. ఈ యాత్ర కోసం ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు చెప్పారు. స్వదేశ్ దర్శన్ టూరిస్ట్ ట్రైన్ (సౌత్ ఇండియా టెంపుల్ టూర్) యాత్ర 10 రాత్రులు, 11 పగళ్లు ఉంటుంది. యాత్ర డిసెంబర్ 3న విశాఖలో ప్రారంభమై 12న విశాఖలోనే ముగుస్తుంది. స్టాండర్డ్ ప్రయాణికులకు నాన్ ఏసీ బడ్జెట్ హోటల్, బడ్జెట్ ప్రయాణికులకు ధర్మశాల, డార్మిటరీ/హోటల్స్‌లో షేరింగ్ పద్ధతిన వసతి కల్పిస్తారు. మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో లేదా 0891-2500695, 82879 32318 నంబర్లను సంప్రదించాలన్నారు.

అహ్మదాబాద్ ఐఐఎంతో రాష్ట్ర టీచర్లకు శిక్షణ

పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గుణాత్మక విద్య, వినూత్న బోధన ఆలోచనలకు నాంది పలికేలా ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష తరఫున సీమ్యాట్ విభాగం ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (అహ్మదాబాద్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం తరఫున సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు ఒప్పందపత్రాన్ని ఐఐఎం-ఏ ప్రోగ్రాం ఫ్యాకల్టీ విభాగాధిపతి ప్రొఫెసర్ కాథన్ శుక్లా, ప్రొఫెసర్ నెహరికా వొహ్రలకు అందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మన రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 50 మంది ప్రధానోపాధ్యాయులు సోమవారం నుంచి ఐదురోజుల పాటు శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, నాయకత్వ సామర్థ్యాల కోసం లక్షణాలు పెంపొందించడం, స్కూల్ ప్రిన్సిపాల్ పాత్ర, పాఠశాల వాతావరణంలో అభ్యసన సంసిద్ధత, పాఠశాల క్రమశిక్షణ : పునరుద్ధరణ పద్ధతులు, మెరుగైన అభ్యాస పర్యావరణం కోసం విద్యార్థుల భావోద్వేగాలను గుర్తించడం, ఆసక్తికరమైన వినూత్న బోధన, కొత్త ఆలోచనలను ప్రోత్సహించడం తదితర అంశాలపై ఐఐఎం-ఏ శిక్షణ ఇస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి, పాఠశాల విద్యాశాఖ, సీమ్యాట్, సమగ్ర శిక్ష ప్రతినిధులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.



ప్రకాశం జిల్లా పొదిలిలో ఓ మహిళకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ 37వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

గడప గడపకు మన ప్రభుత్వం



ఏలూరు జిల్లా గుర్వాయిపాలెంలో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



చిత్తూరు జిల్లా గుడిపాల మండలం కొత్తకోట కాలనీలో వృద్ధుడికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రమాదంలో పునరుత్పత్తి



సాక్షి, హైదరాబాద్:

భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పురుషుల్లో శుక్ర కణాలు భారీ సంఖ్యలో తగ్గుతున్నాయి. వీర్యకణాల చిక్కదనం తగ్గిపోతోంది. నలభై ఐదేళ్ల కిందటి పరిస్థితులతో పోల్చితే...పురుషుల్లో వీర్యకణాల చిక్కదనంలో 50 శాతానికి పైగా, స్పెర్మ్ కౌంట్ (శుక్ర కణాలు)లో 62.3 శాతం తగ్గుదల నమోదైనట్టు పేర్కొంటున్నాయి. తగ్గుదల రేటు గత కొన్నేళ్లుగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. కాగా జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పులే ఇందుకు కారణమని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. రాత్రివేళ పని చేయడం, అధిక ఉష్ణోగ్రతలు, మారుతున్న అలవాట్లు ఇందుకు దోహదపడుతున్నాయని నిపుణులు అంటున్నారు.

ఏడాదికి 1.16% చొప్పున..!

1972 నుంచి ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఖండాల్లో నిర్వహించిన పరిశోధనల్లో ఏడాదికి 1.16 శాతం చొప్పున శుక్రకణాల చిక్కదనంలో తగ్గుదల నమోదైనట్టు గుర్తించారు. ఇక 2000 సంవత్సరం తర్వాత సేకరించిన డేటాను మాత్రమే పరిశీలించినపుడు ఆ తగ్గుదల ఏడాదికి 2.64 శాతంగా ఉన్నట్టు తేలింది. దీనికి సంబంధించి తాజా పరిశోధన 'హ్యూమన్ రీ ప్రొడక్షన్ అప్‌డేట్' జర్నల్‌లో ప్రచురితమైంది. గతంలో వీర్యకణాల చిక్కదనం, కౌంట్ ఒక మిల్లీగ్రామ్ (ఎంఎల్)లో 40 మిలియన్ల కంటే తగ్గితే పునరుత్పత్తికి దోహదపడవని అంచనా వేశారు. అయితే తాజా అంచనాలు, డేటా చూశాక దీని కంటే కూడా కౌంట్ పడిపోయిన వారి సంఖ్య భారీగా పెరిగినట్టు స్పష్టమైంది.

పునరుత్పత్తి సామర్థ్యంలో తగ్గుదల

స్పెర్మ్‌కౌంట్ తగ్గుదల జనాభా పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుదలను స్పష్టం చేస్తోందని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన జెరూసలెం హిబ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ హగాయ్ లీవైన్ పేర్కొన్నారు. స్పెర్మ్‌కౌంట్ అనేది 'హ్యూమన్ ఫెర్టిలిటీ'కే కాకుండా మగవారి ఆరోగ్యంతో ముడిపడిన అంశంగా పరిగణించాల్సి ఉంటుంది. వీర్యకణాల తగ్గుదల దీర్ఘకాలిక వ్యాధులకు, టెస్టిక్యూలర్ (వృషణాల) కేన్సర్లకు దారితీయడంతో పాటు ఆయుర్దాయం తగ్గుదలకూ దోహదపడుతుందని తేలింది. వయసు, శృంగార సామర్థ్యం ఇతర అంశాల ప్రాతిపదికగా వివిధ కేటగిరీలుగా విభజించి ఈ పరిశోధన నిర్వహించారు.

భారత్‌లో సుస్పష్టం

ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన పరిశోధనల్లో భాగంగా మన దేశంలోనూ దీనిపై పరిశీలన నిర్వహించారు. భారత్‌లో వివిధ కేటగిరీల వారీగా డేటా సేకరించారు. 'భారత్‌లోని మగవారిలో శుక్ర కణాల తగ్గుదల అనేది స్పష్టంగా గమనించాం. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే ఒకేవిధమైన పరిస్థితి ఉంది. అత్యాధునిక సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పుచేర్పులు, జీవనశైలి మార్పులు, పర్యావరణంలో రసాయనాల వ్యాప్తి వంటివి దీనికి ప్రధానకారణం' అని లీవైన్ అభిప్రాయపడ్డారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఎక్కువగా..



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఎక్కువగా ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. మిగతా వారితో పోల్చితే 30 ఏళ్ల తర్వాత వివాహాలు చేసుకుంటున్నవారిలో వీర్యకణాల కౌంట్ బాగా తక్కువగా ఉంటోంది. ఐటీజాబ్స్ చేసేవారు ఎక్కువగా నైట్ డ్యూటీల్లో పనిచేస్తుండడం, ఆహార అలవాట్లు మారడం వల్ల శరీరంలోని హార్మోన్ల సమతూకం కోల్పోయి మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో స్పెర్మ్‌కౌంట్ బాగా తగ్గడాన్ని మా పరిశీలనల్లో గమనించాం. ఒకవేళ కౌంట్ కావాల్సినంత ఉన్నా ఆరోగ్యవంతమైన, చురుకైన కదలికలు లేని వీర్యకణాలే ఎక్కువగా ఉండడం వల్ల ప్రయోజనం ఉండడం లేదు.

– డా.కేవీ భార్గవ్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ యూరాలజీ, మంగళగిరి ఎయిమ్స్

ఒత్తిళ్లు..ఊబకాయం



దాదాపు అన్ని రంగాలు, వర్గాలకు చెందిన వారు తీవ్రమైన ఒత్తిళ్ల మధ్య జీవితం గడుపుతున్నారు. తినే ఆహారంలో పోషక విలువలు ఉండడం లేదు. జంక్ ఫుడ్‌కు ఎక్కువగా అలవాటు పడడంతో ఊబకాయం బారిన పడుతున్నారు. 30 ఏళ్లలోపు వారికే షుగర్, బీపీ వస్తున్నాయి. దీనివల్ల రానురాను ఇన్‌ఫెర్టిలిటీ కేసులు పెరుగుతున్నాయి. ఇంట్లో, బయటా, పనిప్రదేశాల్లో వివిధ రూపాల్లో రేడియేషన్, యూవీ రేస్, కాలుష్య ప్రభావాలు పెరిగిపోయి కావాల్సిన సంఖ్యలో వీర్యకణాల ఉత్పత్తి జరగడం లేదు.

– డా.ప్రభుకుమార్ చల్లగాలి, జనరల్ ఫిజీషియన్, దయాబెటాలజిస్ట్, (దీనికి సంబంధించి హంగేరీలో స్పెషలైజేషన్ కోర్సు చేస్తున్నారు)

పురుషులపైనే ప్రభావం



ఆడవారిలో పోల్చితే మగవారిలో పునరుత్పత్తి సంబంధించిన అంశాల్లో మార్పులుంటాయి. అమ్మాయిలలో పుట్టుకతోనే ఓవరీస్, ఓవమ్స్ అనేవి నిర్ణయమై పోతాయి. అందువల్ల స్త్రీలలో కంటే జీవనశైలి మార్పుల ప్రభావం పురుషులపైనే ఎక్కువగా ఉంటుంది. వీర్యకణాలు అప్పటికప్పుడు పుట్టేవి కాబట్టి ఓవమ్స్ కంటే కూడా శుక్రకణాలనేవి సెన్సిటివ్‌గా ఉంటాయి. వాటి ప్రభావం ఇన్‌స్టాంట్‌గా ఉంటుంది. మూడు, నాలుగురోజుల్లో చోటుచేసుకున్న పరిణామాలను బట్టి కూడా ఇవి ప్రభావితమౌతాయి.

– డా.కిరణ్ మాదల, అసోసియేట్ ప్రొఫెసర్, నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ వైద్యశాల


హైదరాబాద్‌లోనూ తక్కువగా..

హైదరాబాద్ మహానగరంలో ఐటీతో పాటు వివిధ రంగాల్లో ముఖ్యంగా రాత్రి పూట పనిచేసే వారిని, 30 ఏళ్లు ఆ పై వయసు పైబడ్డాక పెళ్లి చేసుకున్న వారిని, జీవనశైలిలో మార్పులు చోటుచేసుకున్న రోగుల్ని డాక్టర్లు పరిశీలించారు. వారికి తగిన పరీక్షలు చేసి, పునరుత్పత్తికి సంబంధించిన సమస్యలపై ట్రీట్‌మెంట్ ఇచ్చారు.

- పెళ్లి అయిన రెండేళ్ల తర్వాత 32 ఏళ్ల వయసున్న సురేష్ కుమార్, 30 ఏళ్ల వయసున్న లక్ష్మీ (పేర్లు మార్చాం) తమకు పిల్లలు పుట్టడం లేదంటూ డాక్టర్ వద్దకు వెళ్లారు. వారికి ఇన్‌ఫెర్టిలిటీ ఎవల్యూయేషన్ చెకప్‌లు నిర్వహించారు. ఇందులో భాగంగా వారికి విడివిడిగా క్లినికల్ ఎగ్జామినేషన్, బ్లడ్ టెస్ట్‌లు నిర్వహించి సెమన్ అనాలిసిస్‌కు (వీర్యకణాల విశ్లేషణ) పంపించారు. సురేష్‌లో శుక్రకణాలు ఉండాల్సిన దాని కంటే చాలా తక్కువగా ఉన్నట్టు 'వలిగొ స్పెర్మటోజువా' ద్వారా గుర్తించారు. జీవనశైలి అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. సరైన సమయానికి ఆహారం, ఆరోగ్యకరమైన అలవాట్లు, సరైన నిద్ర, ఒత్తిళ్లను దూరం చేసే విధానాలు, తగిన వ్యాయామం వంటి వాటితో గణనీయమైన మార్పులు సాధించవచ్చునని సూచించారు. ఒత్తిడిని తగ్గించుకోవాలని ట్యాబ్లెట్లు ఇచ్చారు.
- 29 ఏళ్ల వెంకటేశ్వరరావు (పేరు మార్చాం)కు రెండేళ్ల క్రితమే పెళ్లి అయినా పిల్లలు పుట్టలేదు. ఇతను ప్రతిరోజూ రాత్రి 10, 11 గంటల దాకా వ్యాపారరీత్యా పనిలోనే ఉంటారు. ఆ తర్వాత అలసటకు గురికావడం, ఆలస్యంగా తిండి తినడం, నిద్రపోవడం వల్ల వీర్యకణాలు అవసరమైన వాటికంటే చాలా తక్కువగా ఉన్నట్టు డాక్టర్లు గుర్తించారు. మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం ముఖ్యమని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో వీర్యకణాల సంఖ్య తగ్గుతున్నందు వల్ల వీలైనంత మేర ఆ ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎంబీబీఎస్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ రిజర్వేషన్‌కు పిల్

ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ విద్యార్థులకు 1 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని, డాక్టర్ వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, ఎన్‌సీసీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వీరిని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022-23 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లను అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఫెడరేషన్ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసయ్య నర్సింహ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం ఎన్‌సీసీ విద్యార్థులకు 1 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది కవిత గొట్టిపాటి వాదనలు వినిపిస్తూ.. ఎన్‌సీసీ కోటా విషయంలో అధికారులు ప్రభుత్వ జీవో ప్రకారం నడుచుకోవడం లేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. బాధిత విద్యార్థులు వస్తే ఈ వ్యవహారంపై తగిన విధంగా స్పందిస్తామని తెలిపింది. ఇది సర్వీసు వివాదమని, ఇలాంటి వ్యవహారంలో పిల్ దాఖలు చేయడం ఏమిటని ప్రశ్నించింది. అయినా కూడా ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపింది. కవిత జోక్యం చేసుకుంటూ.. ప్రవేశాలు జరుగుతున్నాయని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. పిటిషన్‌ను కొట్టేయకుండా ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపింది. నోటీసులు జారీ చేస్తే సమస్య పరిష్కారమవుతుందన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నామని పేర్కొంది.

ఎంపీహెచ్‌డబ్ల్యూ పరీక్షల షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) ఫిమేల్/ఏఎన్ఎం కోర్సు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సోమవారం విడుదల చేసింది. డిసెంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు థియరీ పరీక్షలు, 23, 24 తేదీల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు పేర్కొంది. రెండేళ్ల కాల వ్యవధి ఉండే ఈ కోర్సు చదువుతోన్న విద్యార్థులు వార్షిక పరీక్షల రుసుమును ఏడాదికి రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. cfw. ap. nic. in వెబ్‌సైట్‌లో పరీక్షల షెడ్యూల్, రుసుము చెల్లింపు ఇతర వివరాలు అందుబాటులో ఉంచారు.

పోలవరానికి నిధుల విడుదలపై 28న భేటీ

పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులతో సమావేశం కానున్న కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి

సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టుకు అడ్‌హక్ (ముందస్తు)గా నిధుల విడుదలపై ఈనెల 28న కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అధికారులు పాల్గొననున్నారు. అడ్‌హక్‌గా రూ.పదివేల కోట్లను విడుదల చేయడం ద్వారా పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి సహకరించాలని ప్రధాని నరేంద్రమోదీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుమార్లు కోరారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ.. అడ్‌హక్‌గా పోలవరానికి నిధులు విడుదల చేయడంతోపాటు సీఎం వైఎస్ జగన్ లేవనెత్తిన అంశాల పరిష్కారానికి కేంద్ర అధికారులతో ఓ కమిటీని ఏర్పాటుచేయాలని తన కార్యాలయ (పీఎంవో) అధికారులను ఆదేశించారు. పీఎంవో ఏర్పాటు చేసిన కమిటీ.. ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) ఏర్పాటు చేసిన రాష్ట్ర అధికారుల కమిటీ రెండుసార్లు సమావేశమయ్యాయి. అడ్‌హక్‌గా నిధులు ఇచ్చేందుకు కేంద్ర కమిటీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఈ అంశంపై రాష్ట్ర జలవనరులశాఖ అధికారులతో చర్చించి నివేదిక ఇవ్వాలని కేంద్ర జల్‌శక్తి శాఖను ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టు తొలి, రెండోదశ పూర్తికి అవసరమైన నిధులు.. దీనివల్ల కలిగే ప్రయోజనాలపై రాష్ట్ర అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ, సీడబ్ల్యూసీ, పీపీఏలు చర్చించాయి. ఈ చర్చల్లో వెల్లడైన అంశాల ఆధారంగా అడ్‌హక్‌గా నిధుల విడుదలపై సోమవారం ఢిల్లీలో చర్చించాలని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ తొలుత నిర్ణయించారు. కానీ ఆయన వ్యక్తిగత పనులపై శుక్రవారం అమెరికా వెళ్లారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల్‌శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఆ శాఖ అధికారులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెల్లడైన అంశాలతో ఈనెల 28న నిర్వహించే సమావేశానికి ఆమె నివేదిక ఇవ్వనున్నారు. ఆ నివేదిక ఆధారంగా 28న జరిగే సమావేశంలో పోలవరానికి అడ్‌హక్‌గా నిధుల విడుదలపై కేంద్ర జల్‌శక్తి శాఖ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి.

అన్ని పోస్టులూ భర్తీ చేసేలా...

- ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా నిరంతర చర్యలు దేశంలోనే తొలిసారి
- ఆస్పత్రుల్లో మంజూరైన క్యాడర్, ఖాళీగా ఉన్న పోస్టులు ప్రతి నెలా 20న ధ్రువీకరణ
- 25వ తేదీన ఖాళీల భర్తీకి నోటిఫికేషన్
- మరుసటి నెల 7వ తేదీలోగా నియామకం పూర్తి
- ఇందుకోసం కాంప్రహెన్సివ్ హెచ్‌ఆర్ పోర్టల్‌కు రూపకల్పన

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజలకు ప్రభుత్వ రంగంలో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వినూత్న విధానాలను, సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీలు లేదని సీఎం వైఎస్ జగన్ అధికారులకు స్పష్టంగా చెప్పారు. మాటలు చెప్పడమే కాకుండా అందుకు తగ్గట్టుగా 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 46 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారు. తాజాగా దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల కొరత అనేది తలెత్తకుండా వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీకి నియామక ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగించడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నుంచి వైద్య కళాశాల, బోధనాస్పత్రి వరకు అన్ని స్థాయిల్లో వైద్య శాఖలో ఖాళీ అయిన పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేసేలా అత్యవసర అనుమతులు ఇచ్చింది. కేవలం నియామకాల కోసమే ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏపీఎంఎస్ఆర్‌బీ)ను ఏర్పాటు చేస్తోంది.

2019 నుంచి వైద్య శాఖలో సీఎం జగన్ సర్కార్ చేపట్టిన నియామకాలు

విభాగం	డాక్టర్స్/ స్పెషలిస్ట్‌లు	పారామెడికల్, ఇతర సిబ్బంది	మొత్తం
ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమం	1,802	4,813	6,615
ఏపీవీవీపీ	2,035	5,652	7,687
డీఎంఈ	1,676	6,841	8,517
ఆరోగ్య, కుటుంబ సంక్షేమం	-	23,667	23,667
మొత్తం	5,513	40,973	46,486

ప్రతి నెలా 20న ఖాళీల గుర్తింపు

ఏపీఎంఎస్ఆర్‌బీ ద్వారా వైద్య శాఖలో ఖాళీల గుర్తింపు, వాటిని ఆన్‌లైన్ విధానంలో భర్తీ చేయడానికి ప్రత్యేకంగా కాంప్రహెన్సివ్ హెచ్‌ఆర్ పోర్టల్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పోర్టల్‌లో వేతన చెల్లింపుల సమాచారం ఆధారంగా ప్రతి నెలా 20వ తేదీన ఆస్పత్రుల్లో మంజూరైన పోస్టులు, ఇన్ పొజిషన్, ఖాళీల వివరాలను పీహెచ్‌సీ డీడీవో, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్‌లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్‌వోల లాగిన్‌కు సీఎఫ్ఎంఎస్ నుంచి ఆన్‌లైన్‌లో వెళతాయి. వీరు ఖాళీలను ధ్రువీకరించిన అనంతరం రాష్ట్ర స్థాయిలో ఆయా విభాగాధిపతులు పరిశీలిస్తారు. విభాగాధిపతులు కూడా ధ్రువీకరించిన అనంతరం 25వ తేదీన ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఏపీఎంఎస్ఆర్‌బీ ఆన్‌లైన్ నోటిఫికేషన్‌లు జారీ చేస్తుంది. మరుసటి నెల 7వ తేదీలోగా పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తుంది. నియామకాల్లో భర్తీ అయిన పోస్టులు, భర్తీ కాకుండా మిగిలిపోయిన, కొత్తగా ఏర్పడిన ఖాళీలు మళ్లీ తిరిగి 20వ తేదీన గుర్తిస్తారు. ఇలా సైక్లింగ్ విధానంలో ప్రతి నెలా ఖాళీల గుర్తింపు, వాటి నియామక ప్రక్రియ కొనసాగుతూ ఉంటుంది.

అంతా ఆన్‌లైన్ లోనే



వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీలను గుర్తించడం మొదలు భర్తీ చేయడం వరకు మొత్తం ఆన్‌లైన్ లోనే చేపట్టేలా ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తున్నాం. బదిలీల ప్రక్రియను కూడా ఈ పోర్టల్ ద్వారానే చేపడతాం. పోర్టల్ ద్వారా ప్రతి నెలా 20న ఖాళీలు గుర్తిస్తాం. మరుసటి నెల 7వ తేదీలోగా పోస్టుల భర్తీ పూర్తి చేయాలని నిర్ణయించాం. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించిన వెంటనే కార్యాచరణ మొదలుపెడతాం.

– జి.ఎస్. నవీన్ కుమార్, కార్యదర్శి (ఎఫ్ఏసీ), వైద్య ఆరోగ్య శాఖ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.